ISSN 2581-3978
ఫిబ్రవరి 2024 సంపుటి 9, సంచిక 11, పేజీలు: 60

# తెలంగాణ

మాస పత్రిక
రూ. 20



# నియామకాలు షురూ..

# గణతంత్ర దినోత్సవం









# తెలంగాణ
మాసపత్రిక

సంపుటి: 9 సంచిక: 11 ఫిబ్రవరి 2024

కమీషనర్ & పబ్లిషర్
**కొర్రెం అశోక్‌రెడ్డి, ఐ.ఎ.ఎస్**

చీఫ్ ఎడిటర్
**కె. సుబ్రహ్మణ్య శాస్త్రి**

అసోసియేట్ ఎడిటర్స్
కప్పర రాంప్రసాద్‌రావు
ముత్తోజు సత్యనారాయణ
కాజీపేట కిరణ్‌కుమార్
సామిడి జగన్‌రెడ్డి

ముఖచిత్రం
నియామకాలు షురూ...

రెండవ కవర్
గణతంత్ర దినోత్సవ వేడుకలు

మూడవ కవర్
తెలంగాణ మాస పత్రిక ఆవిష్కరణ

నాల్గవ కవర్
ఢిల్లీ పరేడ్‌లో తెలంగాణ శకటం

విడి ప్రతి: రూ.20
సంవత్సర చందా : రూ.220

ప్రచురణ
సమాచార, పౌర సంబంధాల శాఖ
సమాచార భవన్, ఎ.సి.గార్డ్స్
హైదరాబాద్ - 500 028.

ముద్రణ
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్
విద్యానగర్, హైదరాబాద్ - 500 044.



రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి చెందినవి కానక్కరలేదు.



e-magazine:http//ipr.tg.nic.in
email: telanganamasapatrika@gmail.com
ISSN 2581-3978

https://magazine.telangana.gov.in


## సంపాదకీయం

# శుభారంభం

**ముఖ్యమంత్రి** ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర పరిపాలనా పగ్గాలు చేబూనిన అనంతరం రాష్ట్రంలో పెట్టుబడుల సాధన కోసం తొలిసారిగా జరిపిన విదేశీ పర్యటన విజయవంతమైంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్ నగరంలో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి తెలంగాణలో పెట్టుబడులకు గల అపార అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న వివిధ ప్రోత్సాహకాలు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరుల గురించి సవివరంగా వివరించారు. దీంతో అనేకమంది పెట్టుబడిదారులు మన రాష్ట్రంలో తమ సంస్థలను నెలకొల్పేటందుకు, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారు. ముఖ్యమంత్రి పర్యటనలో 40వేల కోట్ల రూపాయలకుపైగా పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదరడం ముదావహం.

దావోస్ నుంచి లండన్, దుబాయ్‌లను కూడా ముఖ్యమంత్రి సందర్శించారు. ముఖ్యమంత్రి తన పర్యటనలో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు ఆకర్షించడంతోపాటు, మూసీ సుందరీకరణకు కూడా అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు.

ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర పరిశ్రమలు, ఐ.టి శాఖల మంత్రి శ్రీధర్ బాబు, వివిధ శాఖల అధికారుల బృందం కూడా ఈ పర్యటనలో పాల్గొంది. చారిత్రాత్మక నగరాలన్నీ నీటి వనరుల చుట్టూనే అభివృద్ధి చెందాయి. మూసీ పునరుద్ధరణతో హైదరాబాద్ మహానగరాన్ని కూడా ప్రపంచంలోనే అద్భుత నగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. అందుకే, మూసీ రివర్ ఫ్రంట్‌కు సంబంధించి దుబాయ్‌లో సుమారు 70 సంస్థలతో ముఖ్యమంత్రి సంప్రదింపులు జరిపారు. వీరిలో ప్రపంచస్థాయి సిటీ ప్లానర్‌లు, డిజైనర్లు, మెగా మాస్టర్ ప్లాన్ డెవలపర్లు, ఆర్కిటెక్ట్‌లు ఉన్నారు.

హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ నిర్మించేందుకు దేశ విదేశాల్లోని వివిధ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి, ఆయన వెంటవెళ్ళిన రాష్ట్ర ప్రతినిధి బృందం అధ్యయనం చేసింది. అందులో భాగంగానే సిఎం నేతృత్వంలో రాష్ట్ర ప్రతినిధి బృందం లండన్‌లో థేమ్స్ రివర్ ఫ్రంట్‌ను, దుబాయ్‌లో వాటర్ ఫ్రంట్‌ను సందర్శించింది. ఒక ఎత్తైన ఆకాశహర్మ్యం పైకెక్కి ఏరియల్ వ్యూలా కనిపించే దుబాయ్ వాటర్ ఫ్రంట్ అందాలను తిలకించారు.

చుట్టూ నీళ్లు, పక్కనే అంబరాన్ని చుంబిస్తున్న విధంగా కనిపించే అందమైన భవంతులు, అందమైన రహదారులతో ఒకదానికొకటి అనుబంధంగా రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టు దుబాయ్‌లో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ప్రాజెక్టు నిర్వహణ వ్యవహారాలు, దాంతో ముడిపడి ఉన్న సామాజిక, ఆర్థిక ప్రభావాలను సిఎం అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాంటి అందాల ఆవిష్కరణ హైదరాబాద్‌లో కూడా జరగాలని సి.ఎం ఆకాంక్షించారు.

ముఖ్యమంత్రి తన పర్యటనలో వివిధ సంస్థలతో చేసుకున్న ఒప్పందాల ఫలితంగా భారీ పెట్టుబడులతోపాటు, మన యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు రానుండటం శుభ పరిణామం.

– కె. సుబ్రహ్మణ్య శాస్త్రి

# చూసొద్దాం... మేడారం!

34





17

ద్విచక్ర వాహనంపై మంత్రి పొంగులేటి పర్యటన




41

త్వరలో కులగణన



36

13 దేశాల ప్రతినిధులకు సిఎం ఆతిథ్యం



46

ఆరు గ్యారంటీల అభయ'హస్తం'


ఇక కొలువుల జాతర ....................6
నంది కాదు... గద్దర్ అవార్డులు ....................7
40 వేల కోట్లకు పైగా పెట్టుబడులు....................8
ప్రపంచ సమస్యలకు ప్రజాస్వామ్యమే పరిష్కారం....................14
మన మూసీ పునరుజ్జీవానికి థేమ్స్ ప్లాన్....................15
మూసీ సుందరీకరణకు ప్రాధాన్యం ....................16
ప్రభుత్వ సలహాదారుల నియామకం....................18
టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి....................19
నియంతృత్వానికి కాలం చెల్లింది ....................20
యూపీఎస్సీ తరహాలో టీఎస్‌పీఎస్సీ రూపకల్పన....................22
హైదరాబాద్‌లో ఆరాజెన్ విస్తరణ....................23
త్వరలో కొత్త విద్యుత్ విధానం....................24
రాష్ట్ర పునర్నిర్మాణానికి సహకరించండి ....................25
ఉత్తమ పార్లమెంటేరియన్ జైపాల్‌రెడ్డికి నివాళి ....................26
పారిశ్రామిక అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్ - 2050....................28
ప్రగతిపథం....................30
అర్హులందరికీ 'గ్యారంటీ'లు....................31
రాష్ట్రానికి అదనంగా ఐపిఎస్‌లు....................32
మూసివేసిన బడులను తెరిపించాలి....................38
"జయ జయహే తెలంగాణ" ....................39
బీసీల సమగ్రాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం ....................40
నల్గొండ సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి చర్యలు ....................42
మే నెలాఖరు కల్లా సీతారామ కాలువల పనులు పూర్తి ....................43
ఉన్నత ప్రమాణాలతో ఐటీఐలు ....................44
హైదరాబాద్‌లో ఎస్ ల్యాబ్....................46
పచ్చదనం పెంపు నిరంతర ప్రక్రియ ....................49
అందరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు....................50
పెట్టుబడులకు ప్రోత్సాహం....................51
కేంద్ర గ్రాంట్లు ఇప్పించండి.. ....................52
హైదరాబాద్‌కా నిషాన్ నుమాయిష్ ....................53
క్రీడాకారులకు ప్రోత్సాహం....................54
గిరిజన విద్యా సంస్థల్లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం....................56
సంపదను పెంచుతాం...ప్రజలకు పంచుతాం....................58



జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా బాపూఘాట్‌లో నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, తదితరులు.




రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రచురిస్తున్న 'తెలంగాణ' మాసపత్రికను పోస్టల్ ద్వారా తమ చిరునామాకు పొందగోరువారు **వార్షిక చందా రూ.220** చెల్లించి పొందవచ్చు.

'తెలంగాణ' మాసపత్రిక తెలుగు, ఉర్దు భాషలలో వెలువడుతున్నందున పాఠకులు తమకు ఏ భాషా పత్రిక (తెలుగు/ఉర్దూ) కావాలో స్పష్టంగా తెలియజేయాలి. చందాదారులు తమ చిరునామాను స్పష్టంగా ఇంటి పూర్తి అడ్రస్, పిన్‌కోడ్ నెంబర్‌తో సహా తెలియచేయవలెను. డి.డి. రూపంలో ఈ క్రింది చిరునామాకు పంపించవలెను.

**చందా పంపించవలసిన మా చిరునామా:**

**అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, కమిషనర్ కార్యాలయం, సమాచార, పౌర సంబంధాల శాఖ, సమాచార భవన్, ఎ.సి.గార్డ్స్, మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్ 500028 వివరాలకు 040-23399048, 23398104 ఎక్స్‌టెన్షన్ 148 నంబరులో సంప్రదించవచ్చు.**

**- చీఫ్ ఎడిటర్**


## పద్మ అవార్డు గ్రహీతలకు సిఎం శుభాకాంక్షలు

**గణతంత్ర దినోత్సవం** సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, ప్రముఖ సినీ నటుడు చిరంజీవికి పద్మ విభూషణ్ అవార్డును ప్రకటించింది. అలాగే కొండప్ప, సమ్మయ్య, విఠలాచార్య, కెతావత్ సోంలాల్, ఆనందా చారీలకు పద్మశ్రీ అవార్డులను ప్రకటించింది. పద్మ అవార్డు గ్రహీతలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

నారాయణపేట జిల్లా దామరగిద్దకు చెందిన కొండప్ప బుర్ర వీణ వాయిద్యకారుడు. 63 ఏళ్ల వయస్సున్న దాసరి కొండప్ప తెలుగు, కన్నడ తత్వాలు పాడుతూ బుర్ర వీణను వాయించటంలో సంగీత నిపుణునిగా స్థానికంగా అందరి గుర్తింపును అందుకున్నారు.

జనగాంకు చెందిన గడ్డం సమ్మయ్య యక్షగాన కళాకారుడు. 67 ఏళ్ల వయస్సున్న సమ్మయ్య అయిదు దశాబ్దాలుగా ఇదే రంగంలో తన ప్రావీణ్యాన్ని చాటుకున్నారు. దాదాపు 19 వేల ప్రదర్శనలు ఇచ్చారు. చిందు యక్ష గాన కళాకారుల సంఘంతో పాటు గడ్డం సమ్మయ్య యువ కళా క్షేత్రం ద్వారా ఈ కళను ఇతరులకు నేర్పించాడు. అద్భుతమైన కళా నైపుణ్యంతో వీరిద్దరూ తెలంగాణ సంస్కృతీ, కళలను దేశమంతటికి చాటిచెప్పారని ముఖ్యమంత్రి ప్రశంసించారు. అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు. •



# ఇక కొలువుల జాతర

## ఏడాదిలో 2లక్షల ఉద్యోగాల భర్తీ : సిఎం రేవంత్

**ఉద్యోగాల భర్తీ విషయంలో తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నదని, ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసే దిశగా తాము ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లో రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నిరుద్యోగ యువతకు హామీ ఇచ్చారు. ఉద్యోగాలు భర్తీ చేసే విషయంలో భాగంగానే టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేశామని, కొత్తగా ఛైర్మన్, సభ్యుల నియామకాలను పూర్తి చేశామని తెలిపారు. పోలీసుశాఖలో కూడా 15వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు.**

**6,956 స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు**



వైద్య ఆరోగ్యశాఖలో కొత్తగా నియమితులైన 6,956 మంది స్టాఫ్ నర్సులకు హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఎం నియామకపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ, ఇదే ఎల్.బి.స్టేడియంలో తాము మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసినప్పుడు ఎంతగా సంతోషించామో.. మీరు, మీ కుటుంబ సభ్యులు ఉద్యోగ నియామక పత్రాలు అందుకుని అంతగా సంతోషించాలని ఇక్కడ కార్యక్రమం ఏర్పాటు చేశామని, ఉద్యోగాలు వచ్చిన నర్సులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తాము ప్రతి క్షణం నిరుద్యోగ సమస్యను ఎలా అధిగమించాలా.. తెలంగాణ నిరుద్యోగులకు ఎలా ఉద్యోగాల కల్పన చేయాలో ఆలోచిస్తున్నామని పేర్కొన్నారు.

గత పది సంవత్సరాలపాటు రాష్ట్రాన్ని ఏలిన పాలకులు నిరుద్యోగుల గురించి పట్టించుకోలేదని, తమ కుటుంబసభ్యులకు కొలువులు ఇవ్వడానికే అధికశ్రద్ధ చూపిందని విమర్శించారు. విధ్వంసమైన తెలంగాణను పునర్ని ర్మించే పనిలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ఈ రోజు ఇవి మరువలేని ఆనందమయ క్షణాలని అన్నారు. మీ మోముల్లో కని పిస్తున్న సంతోషాన్ని చూసి కొందరు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. వైద్య ఆరోగ్యశాఖలో మరిన్ని ఉద్యోగాలు భర్తీ చేస్తామని సిఎం తెలిపారు.

### మీరే దాటర్లు, మీరే డాక్టర్లు

రాబోయే రోజుల్లో మీరు ఆసుపత్రుల్లో పనిచేస్తున్నపుడు మానవతా దృక్పథంతో పని చేయాలని పిలుపు నిచ్చారు. అక్కడకు వచ్చే రోగులకు మీరే డాటర్లు, మీరే డాక్టర్లుగా ప్రేమతో విధులు నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. మనం ఆరోగ్య తెలంగాణ నిర్మించాలంటే మీరే సారథులుగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంత పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి తనను ఆహ్వానించిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను సిఎం అభినందించారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసిందన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో మరో అయిదువేల పోస్టులు భర్తీ చేయనున్నట్లు భట్టి తెలిపారు. నెలకు రూపాయలు 500 కోట్ల చొప్పున సంవత్సరానికి 6వేల కోట్లు ఖర్చు అయినా భరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అధిగమించి నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన దిశగానే ప్రభుత్వం ముందడుగు వేస్తుందని, ప్రజలు కాంగ్రెస్‌కు అధికారమిచ్చారని, తాము ప్రజల కలలను నిజం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో స్టాఫ్ నర్సుల సేవలు ఎంతో అవసరమని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. వారి ద్వారానే శాఖకు మంచిపేరు వస్తుందన్నారు. న్యాయ వివాదాలు లేకుండా రోస్టర్ పద్ధతిని అనుసరించామన్నారు. ఇందులో 46 శాతం ఉద్యోగాలు వెనుకబడిన తరగతుల వారికి వచ్చాయన్నారు. 31 శాతం ఎస్సీలకు, 13 శాతం ఎస్టీలకు వచ్చాయన్నారు. ఇంకా ఈ సమావేశంలో శాసనసభాపతి ప్రసాద్‌కుమార్, మంత్రులు తుమ్మల నాగే శ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.



# నంది కాదు... గద్దర్ అవార్డులు

**కవులు, కళాకారులు, సినిమారంగానికి చెందినవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున నంది అవార్డులకు బదులుగా గద్దర్ అవార్డులు ఇస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. వచ్చే ఏడాది గద్దర్ జయంతి రోజు (జనవరి31) నుంచే ఈ అవార్డులు ప్రధానం చేస్తామన్నారు.**

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గద్దర్ ఫౌండేషన్, తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగాయకుడు గద్దర్ జయంతి సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ లెజెండ్, బ్రాండ్ అంబాసిడర్ గద్దర్ అని కొనియాడారు. ఒక జిల్లాకు గద్దర్ పేరు పెట్టేందుకు, హైదరాబాద్‌లోని టాంక్ బండ్‌పై గద్దర్ విగ్రహం ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు. నంది అవార్డులకు బదులు గద్దర్ పేరిట ఇచ్చే అవార్డులను సినిమా రంగానికి చెందినవారు గొప్ప అవకాశంగా భావించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ అవార్డుల ద్వారా గద్దరన్నను స్మరించుకొనే అవకాశం అందరికీ దక్కుతుందని అన్నారు.

ఇది ప్రజాస్వామిక ప్రభుత్వమని, ప్రజలెన్నుకున్న ప్రభుత్వమని, అందుకే గద్దరన్న జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించామని రేవంత్ రెడ్డి తెలిపారు. సమాజాన్ని చైతన్య పరిచేందుకు గద్దరన్న గజ్జెకట్టి గళం విప్పారని, తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ జన సమితి, బెల్లి లలిత, గద్దర్ లాంటివారు ఎందరో పోరాడారని సి.ఎం గుర్తుచేశారు. త్యాగాల పునాదులమీద ఎర్పడిన తెలంగాణ మొన్నటివరకూ కొందరు స్వార్థపరుల పాలయిందని, పునాదులను మరచి, ఉద్యమకారులను అణచివేయాలని చూశారని విమర్శించారు. తాను కాంక్షించిన తెలంగాణ రాలేదని గ్రహించిన గద్దరన్న, మళ్ళీ తన అవసరం తెలంగాణ సమాజానికి ఉన్నదని భావించి, గొంగడి భుజానవేసుకొని ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు బయలుదేరాడని, ఆరోగ్యం సహకరించకున్నా భట్టి విక్రమార్క జరిపిన పాదయాత్రలో పాల్గొన్నాడని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. గద్దర్‌తో మాట్లాడితే వెయ్యి ఏనుగుల బలం వచ్చేదన్నారు. తన పాదయాత్రకు పీపుల్స్ మార్చ్ అని పేరుపెట్టింది గద్దరేనని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన ప్రసంగంలో తెలిపారు.

పాదయాత్రలో తన ఆట, మాట, పాటల ద్వారా అడవి బిడ్డలను, అణగారిన వర్గాలవారిని గద్దర్ చైతన్య పరిచారన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిందంటే దానికి గద్దర్ ఆట, పాటే కారణమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్పవ్యక్తి గద్దర్ అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ సభలో గద్దర్ కుమారుడు సూర్య, ఇతర కుటుంబ సభ్యులు, కవులు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇన్వెస్ట్ ఇన్ తెలంగాణ

# 40 వేల కోట్లకు పైగా పెట్టుబడులు



**తెలంగాణ** రాష్ట్రాన్ని పరిశ్రమల స్థాపనలో అగ్రగామిగా నిలబెట్టాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి స్విట్జర్‌లాండ్ దేశంలోని దావోస్‌లో జరిపిన పర్యటన విజయవంతమైంది. దావోస్‌లో జరిగిన 54వ ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్)కు సిఎం హాజరయ్యారు. అక్కడ నుండి లండన్, దుబాయ్‌లలో కూడా పర్యటించారు. ఈ పర్యటనల సందర్భంగా పలువురు పారిశ్రామికవేత్తలతో చర్చించారు. తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వ పరంగా పారిశ్రామికవేత్తలకు కల్పించనున్న వసతి సౌకర్యాలు, త్వరితగతిన అనుమతులు, తదితర విషయాలు వారికి వివరించారు. దీనితో పారిశ్రామికవేత్తలు సిఎం హామీలకు ఆకర్షితులై పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు 40వేల కోట్ల రూపాయలపైగా పెట్టుబడులను రాబట్టగలిగారు. వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారు. పెట్టుబడులకు అడ్డాగా తెలంగాణ గడ్డ అని నిరూపించారు. దావోస్‌లో 15 జనవరిన సదస్సు ప్రారంభం కాగా 15, 16 తేదీలు రెండు రోజుల్లోనే సుమారు 60 మంది పారిశ్రామికవేత్తలను, వ్యాపారవేత్తలను కలిసి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను, మార్కెటింగ్ సౌకర్యాలను వివరించారు. ఆర్థిక సదస్సులో ఇన్వెస్ట్ ఇన్ తెలంగాణ పేరుతో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌లో పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. అమెజాన్ ఉపాధ్యక్షుడు మైఖేల్

పుంకేతో భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడుల విస్తరణపై చర్చించారు. నోవార్టిస్ సిఈవో వాస్ నరసింహాన్‌తో చర్చలు జరిపారు. తెలంగాణలో నోవార్టిస్ విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.




## ప్రపంచ దిగ్గజాలతో రేవంత్‌రెడ్డి భేటీ

ప్రపంచ ఆర్థిక సదస్సు వేదిగా తెలంగాణ ప్రభుత్వం ఇన్వెస్ట్ ఇన్ తెలంగాణ క్యాంపెయిన్ విజయవంతంగా ప్రారంభించింది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ సదస్సులో పాలు పంచుకుంటున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ప్రపంచ దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో కీలక సమావేశాల్లో పాల్గొన్నారు.

ఐటీ, జీవ, వైద్య శాస్త్ర రంగానికి ముఖ్య కేంద్రంగా అభివృద్ధి చెందిన తెలంగాణ బలాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు, భారీ పెట్టుబడులను ఆకర్షించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రతినిధి బృందం తొలి రోజునే పలువురు ప్రముఖులతో కీలక చర్చలు జరిపింది.

దావోస్ పర్యటనలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రెసిడెంట్ బోర్గ్ బ్రెండెతో సమావేశమయ్యారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం చీఫ్‌తో పాటు నిర్వాహకులు, ఇతర ప్రముఖులతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చించారు. రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో పాటు తమ ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించారు. ప్రభుత్వాలతో పాటు పారిశ్రామికవేత్తలు, వ్యాపార వాణిజ్య వాటాదారులు కలిసికట్టుగా పని చేస్తే ప్రజలు సంపన్నులవుతారని, సుస్థిరమైన అభివృద్ధితో పాటు జీవన ప్రమాణాలు మెరుగుపడితే ప్రజలు మరింత ఆనందంగా ఉంటారనే దృక్కోణంలో చర్చలు జరిపారు.

అనంతరం ఇథియోపియా డిప్యూటీ ప్రైమ్ మినిస్టర్ డెమెక్ హసెంటోతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. పారిశ్రామిక అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎంచుకున్న రూట్ మ్యాప్‌పై చర్చించారు.




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో పాటు తెలంగాణ ప్రతినిధి బృందం నేషనల్ అసోషియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (NASSCOM) ప్రెసిడెంట్ దేబ్జానీ ఘోష్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్మెంట్ పై ప్రత్యేక దృష్టి సారించటం, అందుకోసం అనుసరించే భవిష్యత్తు మార్గాలపై చర్చించారు. ఇంజినీరింగ్, డిగ్రీ కోర్సులు చదువుతున్న యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, ప్లేస్మెంట్ కమిట్‌మెంట్, విలువైన ఉద్యోగాల కల్పనకు సాయం అందించే అంశాలపై సంప్రదింపులు జరిపారు.

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ 54వ వార్షిక సదస్సు మూడు రోజుల పాటు జరిగింది. దావోస్ టూర్‌కు వెళ్లిన సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుకు పలువురు ప్రవాసీ భారత ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. జ్యూరిచ్ ఎయిర్ పోర్ట్‌లో మన దేశానికి చెందిన ప్రముఖులను కలిసి వారితో ముచ్చటించటం సంతోషాన్నిచ్చిందన్నారు రేవంత్ రెడ్డి. సమ్మిళిత, సంతులిత అభివృద్ధి ద్వారా ప్రజలందరి పురోగతి.. నవ తెలంగాణ నిర్మాణానికై మొదలైన తమ ప్రభుత్వ ప్రయత్నంలో భాగస్వాములు కావటం పట్ల ముఖ్యమంత్రి ఆనందం వ్యక్తపరిచారు.




# నియో ఎనర్జీ పెట్టుబడి 9000 కోట్లు

**జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ అనుబంధ సంస్థ జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ, తెలంగాణలో రూ.9,000 కోట్ల పెట్టుబడితో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం, జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ మధ్య ఈ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. దావోస్ లో జేఎస్ డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో సమావేశమై ఈ ప్రాజెక్టుపై చర్చలు జరిపారు. ఈ కొత్త ప్రాజెక్ట్ 1,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.**

**జేఎస్‌డబ్ల్యూ** ఎనర్జీ ప్రధాన కార్యాలయం ముంబైలో ఉన్నది. ఈ సంస్థ థర్మల్, హైడ్రో మరియు సౌర వనరుల నుండి విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. భారతదేశంలో ప్రముఖ ప్రైవేట్ రంగ విద్యుత్ సంస్థగా, ఇది 4,559 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది. జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తుంది.

తెలంగాణలో ఏర్పాటు చేసే పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ కు అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం పునరుత్పాదక శక్తిని ప్రోత్సహిస్తుందని అన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీలో భాగంగా జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని, భవిష్యత్ ప్రాజెక్టులపై సహకరించడానికి ప్రభుత్వం ఆసక్తిగా ఉందని ముఖ్యమంత్రి ప్రకటించారు.

ప్రభుత్వం అందించిన సహకారానికి సజ్జన్ జిందాల్ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో జేఎస్‌డబ్ల్యూ వేగంగా విస్తరిస్తున్నదని, తెలంగాణలోనూ తమ గ్రూప్‌ను విస్తరించాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పరిశ్రమలు, ఐటి శాఖల మంత్రి డి. శ్రీధర్ బాబు, ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు గోద్రెజ్ ఆసక్తి

## 1000 కోట్లతో కెమికల్ ప్లాంట్

## 270 కోట్లతో ఖమ్మంలో పామాయిల్ సీడ్ గార్డెన్



**దావోస్‌లోని** వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, గోద్రెజ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నాదిర్ గోద్రెజ్‌తో కీలకమైన సమావేశం జరిగింది. తెలంగాణలో అపారమైన అవకాశాలున్నాయని, వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు గోద్రెజ్ కంపెనీ ఆసక్తిని ప్రదర్శించింది. వ్యూహాత్మకమైన పెట్టుబడులతో తెలంగాణలో అడుగు పెట్టాలని చూస్తున్నామని నాదిర్ గోద్రెజ్ ముఖ్యమంత్రికి తెలిపారు. రాష్ట్రంలో పామ్ ఆయిల్ మిషన్‌ను నడపడంలో గోద్రెజ్ ఇప్పటికే కీలక పాత్ర పోషిస్తున్నది. ఖమ్మం జిల్లాలో మొదటి దశలో రూ. 270 కోట్ల పెట్టుబడితో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తోంది. మలేషియాకు చెందిన అతి పెద్ద పామాయిల్ కంపెనీ సిమ్ డార్బీ తో గోద్రెజ్ జాయింట్ వెంచర్ కుదుర్చుకుంది.

ఈ రెండు కంపెనీల జాయింట్ వెంచర్‌గా దేశంలోనే మొట్టమొదటి ఆయిల్ పామ్ సీడ్ గార్డెన్ వాణిజ్య యూనిట్‌ను ఖమ్మంలో ఏర్పాటు చేస్తోంది. నాణ్యమైన పామాయిల్ విత్తనాలను నూటికి నూరు శాతం ప్రస్తుతం దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని అధిగమించి దేశీయ విత్తనాల ఉత్పత్తి, ఏడాదికి 70 లక్షల మొక్కలను పెంచాలనేది ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా ఎంచుకుంది. దీంతో దాదాపు పది లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు అవుతుంది.

ఈ సందర్భంగా తెలంగాణలో 1000 కోట్ల రూపాయల కెమికల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు గోద్రెజ్ అంగీకరించింది. దీంతో పాటు స్కిల్ డెవలప్ మెంట్, రియల్ ఎస్టేట్, క్రీమ్‌లైన్ డెయిరీ తదితర రంగాలలో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన అంశాలపై చర్చించారు. తెలంగాణాలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన గోద్రెజ్ ప్రతినిధులకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. పెట్టుబడులకు తెలంగాణ మొదటి గమ్యస్థానంగా మారిందని, దీంతో రాష్ట్ర వ్యాపార, పారిశ్రామిక వృద్ధి పెరుగుతుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశానికి పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణు వర్ధన్ రెడ్డి హాజరయ్యారు.

# 231 కోట్లతో వైద్య పరికరాల తయారీ కేంద్రం

**యూకేకు** చెందిన ప్రముఖ వైద్య పరికరాల తయారీ సంస్థ సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ గ్రూప్ హోల్డింగ్స్ (SIGH) హైదరాబాద్‌లో తమ మ్యానుఫాక్చరింగ్ యూనిట్ నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. ఇప్పటివరకు దేశంలో తయారు చేయని పలు సర్జికల్ పరికరాలను ఇక్కడ తయారు చేస్తారు. రాబోయే రెండు మూడు ఏండ్లలో అందుకు అవసరమయ్యే రూ. 231.5 కోట్ల పెట్టుబడులు పెడుతామని ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించే ప్రణాళికలో భాగంగా ఈ కంపెనీ భారతీయ మార్కెట్‌లోకి అడుగుపెడుతోంది. ఈ ఫెసిలిటీ ఏర్పాటుతో హెల్త్ కేర్ రంగంలో తెలంగాణ మరో ముందడుగు వేయనుంది.

దావోస్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి శ్రీధర్ బాబుతో SIGH ఎండీ గౌరీ శ్రీధర, డైరెక్టర్ అమర్ చీడిపోతు సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు మొదటి దశలో జనరల్ సర్జికల్ పరికరాలు, మైక్రో సర్జరీకి ఉపయోగించే అధునాతన పరికరాలను తయారు చేస్తారు. ఆర్థోపెడిక్, చర్మ, నేత్ర సంబంధిత సున్నితమైన సర్జరీలకు అవసరమయ్యే పరికరాలు తయారు చేస్తుంది. రెండో దశలో రోబోటిక్ వైద్య పరికరాలను తయారీ చేసేలా యూనిట్ ను విస్తరిస్తారు.

SIGH కంపెనీ యూకేలో నేషనల్ హెల్త్ సర్వీస్, అక్కడి మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ (ఆర్మీ) హాస్పిటళ్లకు, ప్రైవేట్ హాస్పిటళ్లకు తమ పరికరాలను సరఫరా చేస్తోంది.

# పెట్టుబడులకు వెల్ స్పాన్ గ్రూప్ సిద్ధం

**తెలంగాణ రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు వెల్‌స్పాన్ గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. డా.బిఆర్ అంబేడ్కర్ సచివాలయంలో వెల్‌స్పాన్ గ్రూప్ ఛైర్మన్ బి.కె. గోయెంకా, వారి ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు.**




పరిశ్రమల అభివృద్ధికి, పెట్టుబడులను ఆహ్వానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఫ్రెండ్లీ పాలసీని అనుసరిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. తమ ప్రభుత్వ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ముఖ్యమంత్రి వెల్లడించారు.

వెల్‌స్పాన్ గ్రూప్ ఛైర్మన్ బి.కె. గోయెంకా మాట్లాడుతూ.. తమ కంపెనీ భవిష్యత్తులో చందన్ వ్యాలీ పారిశ్రామిక విభాగంలో ప్రారంభించబడిన ఐటి సేవలలో రూ.250 కోట్ల పెట్టుబడి పెడతామని చెప్పారు. టైర్ 2, 3లలోని ఐటిలను అభివృద్ధిపరిచి ప్రమోట్ చేసేందుకుగాను వికారాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని యువతకు ఐటి ఉద్యోగాలను కల్పించేందుకు తమ కంపెనీ సిద్ధంగా ఉన్నదని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ఐటి ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, స్పెషల్ సెక్రటరీ డాక్టర్ విష్ణు రెడ్డి, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, వెల్‌స్పాన్ గ్రూప్ హెడ్ (కార్పొరేట్ వ్యవహారాలు) చింతన్ థాకర్, శ్రీస భార్గవ మొవ్వ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో గ్రీన్ ఫీల్డ్ డేటాసెంటర్

**వెబ్ వెర్క్స్ 5,200 కోట్ల పెట్టుబడులు**

**తెలంగాణలో డేటా సెంటర్లను నెలకొల్పేందుకు వెబ్ వెర్క్స్ సంస్థ 5200 కోట్ల రూపాయల పెట్టుబడులకు సిద్ధపడింది. డేటా సెంటర్ల నిర్వహణలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన ఐరన్ మౌంటెన్ అనుబంధ సంస్థ వెబ్ వెర్క్స్. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఐరన్ మౌంటేన్ సీఈవో విలియం మీనీ, వెబ్ వెర్క్స్ సీఈవో నిఖిల్ రాఠీతో సమావేశమయ్యారు. తెలంగాణలో డేటా సెంటర్ల ఏర్పాటు, నిర్వహణపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా 5200 కోట్ల రూపాయల పెట్టుబడులకు వెబ్ వెర్క్స్ కంపెనీ తెలంగాణ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది.**

హైదరాబాద్‌లో 10 మెగావాట్ల నెట్ వర్కింగ్-హెవీ డేటా సెంటర్‌లో ఇప్పటికే ఈ కంపెనీ రూ.1,200 కోట్లు పెట్టుబడి పెడుతోంది. దీనికి అదనంగా 4,000 కోట్లకు పైగా పెట్టుబడులతో రాబోయే కొన్ని సంవత్సరాలలో గ్రీన్ ఫీల్డ్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ విస్తరించేందుకు ఈ ఒప్పందం చేసుకుంది. తెలంగాణలో డేటా సెంటర్ల ఏర్పాటును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతించారు. డేటా సెంటర్ల ద్వారా ఐటీ రంగం అత్యున్నతంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. దేశంలోనే డేటా సెంటర్ల ఏర్పాటుకు తెలంగాణ అసలైన గమ్యస్థానంగా నిలుస్తుందని అన్నారు. పెట్టుబడిదారులు అందుకు అవసరమైన విద్యుత్తును కూడా పునరుత్పాదక వనరుల ద్వారా సమకూర్చుకుంటున్నారని అన్నారు. ఇదంతా తమ కొత్త ప్రభుత్వం అనుసరించే వ్యాపార అనుకూల విధానాలు, తాము ఎంచుకున్న ఫ్రెండ్లీ పాలసీపై వాళ్లకున్న నమ్మకాన్ని చాటి చెపుతోందన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేయటం, దేశంలో తమ డేటా సెంటర్ కార్యకలాపాలను విస్తరించడంపై ఐరన్ మౌంటైన్ ఆనందం వ్యక్తం చేసింది. “తెలంగాణ రాష్ట్రానికి స్పష్టమైన ప్రాధాన్యతలున్నాయి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా మా డేటా సెంటర్‌లలో 100 శాతం పునరుత్పాదక శక్తిని ఉపయోగిస్తున్నాము. దీనిని భారతదేశంలో విస్తరించాలని చూస్తున్నాం. కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధనం రెండింటికి మద్దతు అందించటం ద్వారా పెట్టుబడులను ఆకర్షణీయంగా మార్చింది” అని విలియం మీనీ అన్నారు.



# కొత్త ప్రాజెక్టులకు అదానీ గ్రూప్ సంసిద్ధత

**తెలంగాణలో పెట్టుబడులకు తాము సిద్ధంగా ఉన్నట్లు అదానీ గ్రూప్ మరోమారు ముందుకు వచ్చింది. సెక్రెటేరియట్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో పోర్ట్స్ - సెజ్ సిఇఓ, గౌతమ్ అదాని పెద్ద కుమారుడు కరణ్ అదానీ, అదానీ ఎరోస్పేస్ సిఇఓ ఆశీష్ రాజ్ వన్షిలతో చర్చలు జరిపారు. పారిశ్రామిక అభివృద్ధికి, ఉపాధి కల్పనకు కొత్త పరిశ్రమలకు తెలంగాణ ప్రభుత్వం తగినన్ని వసతులు, రాయితీలు కల్పిస్తుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.**

అదానీ గ్రూప్ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. ఇప్పటికే తలపెట్టిన పాత ప్రాజెక్టులను కొనసాగిస్తామని, కొత్త ప్రాజెక్టుల స్థాపనకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం కోరుతున్నామని అదానీ గ్రూప్ ప్రతినిధులు అన్నారు. ప్రభుత్వం మారినప్పటికీ తెలంగాణలో పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పనకు తమ కంపెనీ ముందు నిలబడుతుందని అన్నారు. రాష్ట్రంలో ఏరోస్పేస్ పార్కుతో పాటు డేటా సెంటర్ ప్రాజెక్టు నెలకొల్పేందుకు అదానీ గ్రూప్ ప్రభుత్వంతో చర్చలు జరిపింది. వీటికి సంబంధించిన పురోగతితో పాటు కొత్త ప్రాజెక్టుల స్థాపనపై సమావేశంలో చర్చించారు.

సమావేశంలో ఐటి, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఐటి ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, సిఎం సెక్రటరీ షానవాజ్ ఖాసీం, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచ సమస్యలకు ప్రజాస్వామ్యమే పరిష్కారం

## లండన్‌లో చారిత్రాత్మక వెస్ట్ మినిస్టర్ ప్యాలెస్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం

**"నేడు ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. హింస, ఉగ్రవాదం, ప్రజల హక్కుల హరణ, ప్రజాస్వామ్యంపై దాడి వంటి సమస్యలన్నింటికీ విరుగుడు ప్రజాస్వామ్యం పటిష్టం చేయటం ద్వారానే సాధ్యమవుతుంది. ప్రజాస్వామ్యం ద్వారా ప్రజలను శక్తిమంతులను చేయటమే అసలైన పరిష్కారం.' అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు.**

**తెలంగాణ** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన లండన్ పర్యటన సందర్భంగా, భారతీయ మూలాలున్న బ్రిటిష్ పార్లమెంట్ మెంబర్లతో సమావేశమయ్యారు. చారిత్రాత్మకమైన వెస్ట్ మినిస్టర్ ప్యాలెస్ లో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'భారత్, బ్రిటన్ మధ్య బలమైన బంధం ప్రజాస్వామ్యమే. ఇప్పుడు ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరచడమే అత్యవసరం...' అని అన్నారు.

యునెస్కో 1016 సంవత్సరంలోనే లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ ప్యాలెస్‌ను ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది. ఈ చారిత్రక భవనంలోనే ఈ సమావేశం జరగడం విశేషం. లేబర్ పార్టీ ఎంపీ వీరేంద్ర శర్మతో పాటు మరో ఏడుగురు ఎంపీలు, ఉన్నత స్థాయి అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ, ఇరు దేశాల మధ్య చారిత్రక సంబంధాలను ఈ సందర్భంగా సిఎం గుర్తు చేశారు. 'ఒకప్పుడు మీ దేశం మా దేశాన్ని పరిపాలించింది. మా కాంగ్రెస్ పార్టీనే మీకు వ్యతిరేకంగా పోరాడింది. అప్పుడు మహాత్మా గాంధీ ఎంచుకున్న సత్యం, అహింస, న్యాయ పోరాటమే మీ దేశానికైనా, మా దేశానికైనా ఇప్పటికీ మార్గదర్శకం..' అని అన్నారు.

ఇదే సందర్భంగా తన స్వీయ అనుభవాలను సిఎం వారితో పంచుకున్నారు. 'నాది గ్రామీణ ప్రాంతం. నేను సామాన్య రైతు బిడ్డను. కేవలం ప్రజాస్వామ్యం వల్లనే నేను ఈ స్థాయికి చేరుకున్నాను. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం, పార్టీ ఎంచుకున్న ప్రజాస్వామ్య భావనతోనే నాకు ఇంతటి అవకాశం వచ్చింది. దేశంలో ప్రతి ఒక్కరు అభివృద్ధి చెందే అవకాశాలు అసలైన ప్రజాస్వామ్యం ద్వారానే సాధ్యమవుతాయి..'అని ముఖ్యమంత్రి అన్నారు.





# మన మూసీ పునరుజ్జీవానికి థేమ్స్ ప్లాన్

## థేమ్స్ రివర్ పాలక మండలితో సి.ఎం రేవంత్ రెడ్డి చర్చలు.. రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు సహకారం

**తెలంగాణలోని మూసీ నది పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా ఇతర దేశాల్లో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లండన్ లో పర్యటించి అక్కడి థేమ్స్ నదిని సందర్శించారు. థేమ్స్ నదిని నిర్వహిస్తున్న తీరును, అక్కడి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అభివృద్ధి చేసిన తీరును ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. అక్కడి థేమ్స్ రివర్ పాలక మండలి, పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ అధికారులు, నిపుణులతో ముఖ్యమంత్రి దాదాపు మూడు గంటల పాటు చర్చలు జరిపారు.**

**దశాబ్దాలుగా** వివిధ దశల్లో థేమ్స్ నదీ తీరం వెంట చేపట్టిన సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను అక్కడి కార్పొరేట్ అఫైర్స్ డైరెక్టర్ సియాన్ ఫోస్టర్, పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ హెడ్ రాజ్ కెహల్ లివీ సీఎంకు వివరించారు. అందులో భాగంగా ఎదురైన సవాళ్లు, పరిష్కారాలు, ఖర్చయిన నిధులు, భాగస్వామ్యమైన సంస్థలు, అందంగా తీర్చిదిద్దేందుకు అనుసరించిన అత్యుత్తమ విధానాలన్నీ ఈ సందర్భంగా చర్చించారు.

“నదులు, సరస్సులు, సముద్ర తీరం వెంట ఉన్న నగరాలన్నీ చారిత్రాత్మకంగా అభివృద్ధి చెందాయి. హైదరాబాద్ సిటీకి అటువంటి ప్రత్యేకత ఉంది. అటు మూసీ నది వెంబడి, ఇటు హుస్సేన్ సాగర్ చుట్టూ, ఉస్మాన్ సాగర్ లాంటి నదీ వ్యవస్థ కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందింది. పునరుజ్జీవ ప్రాజెక్టు ద్వారా తిరిగి మూసీకి పునర్వైభవం తీసుకు వస్తే నదులు, సరస్సులతో హైదరాబాద్ మరింత శక్తివంతంగా తయారవుతుంది...” అని ముఖ్యమంత్రి వివరించారు.

తన విజన్ 2050కు అనుగుణంగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, లండన్ అధికారులు సానుకూలతతో చర్చలు జరిపారు. నది ఒడ్డున అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నదీ సంరక్షణకు అత్యున్నత ప్రాధాన్యమిచ్చినట్లు అక్కడి అధికారులు వివరించారు. నదీ జలాలను సుస్థిరంగా ఉంచటం, ఎంచుకున్న ప్రాజెక్టు ద్వారా స్థానికులకు ఎక్కువ ప్రయోజనముండే రెవిన్యూ మోడల్ ను ఎంచుకోవాలని చెప్పారు. ఈ ప్రాజెక్టును మరింత అత్యుత్తమంగా తీర్చిదిద్దే కొత్త విధానాలు ఎప్పటికప్పుడు గమనించటంతో పాటు, ప్రాజెక్టు నిర్వహణపై నిరంతరం దృష్టి పెట్టాలన్నారు. హైదరాబాద్‌లో మూసీ నదిని పునరుజ్జీవింప జేసేందుకు చేస్తున్న అన్ని ప్రయత్నాలకు తమ మద్దతు ఉంటుందని పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ హామీ ఇచ్చింది. ఇదే సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన అవుట్ లైన్, వివిధ సంస్థల భాగస్వామ్యంపైనా చర్చించారు. ఈ ప్రాజెక్టుకు నిర్దిష్టమైన సహకారం అందించేందుకు భవిష్యత్తులో మరిన్ని చర్చలు జరపాలని ఇరు పక్షాల మధ్య అంగీకారం కుదిరింది. సిఎం రేవంత్ రెడ్డితో పాటు సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శేషాద్రి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్, సిఎం స్పెషల్ సెక్రెటరీ బి.అజిత్ రెడ్డి, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్, మూసీ రివర్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలీ, ఇన్వెస్ట్ మెంట్స్ అండ్ ప్రమోషన్స్ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్ రెడ్డి, మూసీ రివర్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ ఎస్ఈ వెంకట రమణ ఈ సమావేశంలో పాల్గొన్నారు.



# మూసీ సుందరీకరణకు ప్రాధాన్యం

## దుబాయ్‌లో 70 సంస్థలతో సిఎం సంప్రదింపులు

**లండన్ నుంచి బయల్దేరిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దుబాయ్‌లో బిజీ బిజీగా గడిపారు. ప్రపంచ స్థాయి సిటీ ప్లానర్లు, డిజైనర్లు, మెగా మాస్టర్ ప్లాన్ డెవలపర్లు, ఆర్కిటెక్ట్‌లతో సీఎం వరుసగా భేటీ అయ్యారు. హైదరాబాద్ సిటీలో మూసీ రివర్ ఫ్రంట్ డిజైన్లు, అభివృద్ధిపైనే కీలక సమావేశాల్లో పాల్గొన్నారు. 56 కిలోమీటర్ల పొడవునా మూసీ రివర్ ఫ్రంట్, గ్రీన్ అర్బన్ పార్క్‌లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లు, అభివృద్ధి నమూనాలు, వాటికి అవసరమైన పెట్టుబడులపై వివిధ సంస్థలతో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు.**

**దుబాయ్‌లో** దాదాపు 70 సంస్థలతో ఆయన సంప్రదింపులు జరిపారు. ప్రపంచంలో పేరొందిన కంపెనీలు, డిజైన్, ప్లానింగ్, ఆర్కిటెక్చర్ సంస్థల ప్రతినిధులు, కన్సల్టెన్సీ నిపుణులతో సమావేశమయ్యారు. దాదాపు అన్ని సంస్థలు తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యానికి, హైదరాబాద్ లో మూసీ రివర్ డెవెలప్‌మెంట్ ప్రాజెక్టుపై ఆసక్తి ప్రదర్శించాయి. తదుపరి సంప్రదింపులకు త్వరలోనే రాష్ట్రానికి వచ్చేందుకు అంగీకరించాయి.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "చారిత్రాత్మక నగరాలన్నీ నీటి వనరుల చుట్టే అభివృద్ధి చెందాయి. నదులు, సరస్సులు వాటికి సహజత్వాన్ని తెచ్చిపెట్టాయి. మూసీ పునరుద్ధరణతో హైదరాబాద్ సిటీ ప్రపంచంలోనే అద్భుతమైన నగరంగా మారుతుంది..." అని అన్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న మూసీ రివర్ ప్రాజెక్టుకు అపురూపమైన డిజైన్లు, నమూనాలు రూపొందించాలని కోరారు. ఇతర సిటీలు, రాష్ట్రాలతో తాము పోటీ పడటం లేదని, ప్రపంచంలోనే అత్యుత్తమమైన బెంచ్‌మార్క్ నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. దుబాయ్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర అధికారబృందంతో కలిసి దుబాయ్ వాటర్ ఫ్రంట్ ప్రాజెక్టును సందర్శించారు. ఒక ఆకాశహర్మ్యం పైకెక్కి ఏరియల్ వ్యూలా కనిపించే వాటర్ ఫ్రంట్ అందాలను తిలకించారు. సిఎంతో పాటు సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ వి.శేషాద్రి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవెలప్ మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్, సిఎం స్పెషల్ సెక్రెటరీ బి.అజిత్ రెడ్డి, హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్, మూసీ రివర్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలితో పాటు అధికారులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు.



# ద్విచక్ర వాహనంపై మంత్రి పొంగులేటి పర్యటన

**రాష్ట్ర రెవిన్యూ, హౌజింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 59వ డివిజన్ దానవాయిగూడెం, 60వ డివిజన్ రామన్నపేట, ఒకటో డివిజన్ కైకొండాయిగూడెంలో ఆకస్మిక పర్యటన చేసి, పారిశుద్ధ్య, స్థానిక సమస్యల తనిఖీలు చేశారు.**

ద్విచక్రవాహనంపై నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి స్థానిక స్థితిగతులు పరిశీలించారు. వీధుల్లో తిరుగుతూ ప్రజలను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వెంటనే ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా కూడా ఆకస్మిక పర్యటనలు చేయనున్నట్లు ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. అధికారులందరూ ఎప్పటికప్పుడు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలను అందించే బాధ్యత అధికారులు, సిబ్బంది తీసుకోవాలని మంత్రి సూచించారు. సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలు సైతం తన దృష్టికి వచ్చాయని ఆ సమస్యలను కూడా వీలైనంత త్వరగా పరిష్కరించి ప్రజలకు న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి తనిఖీల సందర్భంగా పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.







# ప్రభుత్వ సలహాదారుల నియామకం

**తెలంగాణ ప్రభుత్వం ముగ్గురు ప్రభుత్వ సలహాదారులను, ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మాజీ ఎంపీ మల్లు రవిని నియమించగా, ప్రభుత్వ సలహాదారులుగా మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షులు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, సీనియర్ కాంగ్రెస్‌నాయకులు, పీసీసీ ఉపాధ్యక్షులు హర్కర్ వేణుగోపాల్‌లను నియమించింది.**

**ఇందులో** వేం నరేందర్‌రెడ్డి ముఖ్యమంత్రి సలహాదారులుగా నియమితులు కాగా, హర్కర వేణుగోపాల్ ప్రోటోకాల్, ప్రజా సంబంధాల విభాగాలకు సలహాదారులుగా నియామకమయ్యారు. షబ్బీర్ అలీ ఎస్సీ, ఎస్టి, బీసీ, మైనారిటీ సంక్షేమశాఖలకు సలహాదారులుగా నియమితు లయ్యారు. వీరికి క్యాబినెట్ హోదా కల్పిస్తారు.

**షబ్బీర్ అలీ:** షబ్బీర్ అలీ తన రాజకీయ జీవితం ఎన్ఎస్‌యుఐ కార్యకర్తగా ప్రారంభించారు. 1970లో ఎన్ఎస్‌యుఐ లో పనిచేశారు. 1989, 2004 సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కామారెడ్డి నియోజకవర్గం నుంచి శాసనసభ్యులుగా గెలుపొందారు. మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, వై.ఎస్.రాజశేఖరరెడ్డిల మంత్రి వర్గాల్లో మంత్రిగా విధులు నిర్వహించారు. 2013, మార్చి 14న ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆరేళ్ళపాటు ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు.

**వేం నరేందర్ రెడ్డి:** పీసీసీ ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్న వేం నరేందర్‌రెడ్డి 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

**హర్కర వేణుగోపాల్:** కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రోటోకాల్ విభాగం ఛైర్మన్‌గా ఉన్న హర్కర వేణుగోపాల్ పీసీసీ ఉపాధ్యక్షుడుగా, ఏఐసీసీ సభ్యుడుగా కూడా ఉన్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండం వేణుగోపాల్ స్వస్థలం. కాంగ్రెస్ సభ్యత్వ నమోదు రాష్ట్ర ముఖ్య సమన్వయకర్తగా కూడా పనిచేశారు.

**మల్లు రవి:** నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా రెండు పర్యాయాలు గెలుపొందిన మల్లు రవి, జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా సేవలందించారు. ప్రస్తుతం పీసీసీఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. గతంలో వై.ఎస్. ముఖ్యమంత్రిగా ఉన్నపుడు క్యాబినెట్ హోదాతో ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధిగా పనిచేశారు.

## ఇద్దరు ఎమ్మెల్సీలు ఏకగ్రీవం

రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటా కింద జరిగిన రెండు ఎమ్మెల్సీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు పూర్తి మెజారిటీ ఉండడం, ఇద్దరు కాంగ్రెస్ పార్టీ నాయకులు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్‌లు నామినేషన్లు వేయడంతో, ఇతరులెవరూ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో ఎన్నికల కమిషన్ వీరిద్దరు ఎమ్మెల్సీలుగా

ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ప్రకటించింది.

ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి బల్మూరి వెంకట్, మహేష్‌కుమార్ గౌడ్‌లు ధ్రువీకరణ పత్రాలను అందుకున్నారు. శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సమక్షంలో వారికి ధృవీకరణ పత్రాలు అందించారు.

### గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, ఆమిర్ అలీఖాన్

గవర్నర్‌కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, ఆమిర్‌అలీ ఖాన్‌లు నియమితులయ్యారు. వీరిద్దరి పేర్లను ప్రభుత్వం ప్రతిపాదించగా గవర్నర్ తమిళిసై ఆమోదం తెలిపారు.

### ప్రొఫెసర్ కోదండరాం

తెలంగాణ విద్యావంతుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉన్న ప్రొఫెసర్ కోదండరాం ఉస్మానియా యునివర్సిటీలో రాజనీతిశాస్త్రంలో ఆచార్యులుగాపనిచేశారు. పౌరహక్కుల సంఘం, మానవహక్కుల సంఘాలలో క్రియాశీలకంగా పనిచేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర మలిదశ ఉద్యమంలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)కి నాయకత్వం వహించారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం తెలంగాణ జనసమితి అనే పార్టీని స్థాపించి, దాని అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి తమ పార్టీ మద్దతు తెలిపారు.

### ఆమిర్ అలీఖాన్

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి కమ్యూనికేషన్స్ అండ్ జర్నలిజంలో బ్యాచిలర్స్ డిగ్రీ పొందిన ఆమిర్‌అలీఖాన్ ప్రముఖ ఉర్దూ దినపత్రిక సియాసత్ చీఫ్ ఎడిటర్ జావెద్ అలీఖాన్ కుమారుడు. ఆంగ్లం, ఉర్దూ, హిందీ, అరబిక్, తెలుగు భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన ఆమిర్ 1994 నుంచి పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్నారు. ప్రజా సమస్యలపైన, రాజకీయాలపైన ఆయన రాసిన వ్యాసాలు విశేష ఆదరణ పొందాయి.





## టీఎస్‌పీఎస్‌సీ ఛైర్మన్‌గా

# మహేందర్‌రెడ్డి

**తెలంగాణ** పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేయాలన్న ఆలోచనకు తగిన విధంగా, ప్రభుత్వ సిఫారసు మేరకు ఛైర్మన్‌గా మాజీ డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డిని, మరో అయిదుగురు సభ్యులను నియమిస్తు గవర్నర్ తమిళిసై ఆమోదముద్ర వేశారు. సభ్యులుగా ప్రభుత్వ విశ్రాంత ముఖ్య కార్యదర్శి అనితా రాజేంద్ర, జేఎన్‌టీయు సీనియర్ ప్రొఫెసర్ నర్రి యాదయ్య, గ్రూప్-1 విశ్రాంత అధికారిణి పాల్వాయి రజనీకుమారి, పోస్టల్ సర్వీసు విశ్రాంత అధికారి ప్రొఫెసర్ అమీరుల్లాఖాన్, జెన్‌కో ఈడీ యరబాడి రామమోహన రావులు సభ్యులుగా నియమిం చబడ్డారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాలు జారీ చేశారు.

### టీఎస్‌పీఎస్‌సీని పటిష్టపరుస్తాం

టీఎస్‌పీఎస్‌సీని మరింత పటిష్టపరిచి, బాధ్యతాయుతంగా ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలించి ఉద్యోగ నోటిఫికేషన్లు జారీచేస్తామని ఛైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సంస్థలోని ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించి, నిబంధనల ప్రకారం నియామకాలు పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. టీఎస్‌పీఎస్‌సీకి ఛైర్మన్‌గా నియామకమైన ఎం.మహేందర్‌రెడ్డి ఐపీఎస్ అధికారిగా రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎస్పీగా సేవలందించారు. సైబరాబాద్ కమిషనర్‌గా, గ్రేహౌండ్స్ చీఫ్‌గా, ఇంటలీజెన్స్ ఐ.జీ.గా, హైదరాబాద్ సీపీగా విధులు నిర్వహించారు. తెలంగాణ డీజీపీగా ఫ్రెండ్లీ పోలీసింగ్ సంస్కరణలు తీసుకువచ్చారు. సుమారు 30 సంవత్సరాల పాటు పోలీస్‌శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన మహేందర్‌రెడ్డి పలు అవార్డులు అందుకున్నారు.

# నియంతృత్వానికి కాలం చెల్లింది



## రిపబ్లిక్ డే ప్రసంగంలో గవర్నర్

**గత పదేళ్లలో పాలకులు నియంతృత్వ ధోరణితో వ్యవహరించడాన్ని సహించని తెలంగాణ సమాజం అసెంబ్లీ ఎన్నికలలో తమ తీర్పు ద్వారా ఆ ధోరణికి చరమగీతం పాడి, ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో గవర్నర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు. గవర్నర్ తొలుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులకు, అధికార యంత్రాంగానికి శుభాకాంక్షలు తెలిపి, తన ప్రసంగాన్ని కొనసాగించారు. గవర్నర్ ప్రసంగిస్తూ......**

**75వ** గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మంత్రివర్గ సహచరులకు, ప్రభుత్వ యంత్రాంగానికి నా శుభాకాంక్షలు. భిన్న జాతులు, మతాలు, కులాల సమాహారంగా ఉన్న దేశంలో అందరినీ ఐక్యం చేసి, భారతజాతిగా నిలబెట్టిన ఘనత మన రాజ్యాంగానికి దక్కుతుంది. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ఒక లిఖిత రాజ్యాంగం రాసుకుని 74 యేళ్లు దిగ్విజయంగా, ఆ రాజ్యాంగ మార్గదర్శకత్వంలో దేశం ముందుకు సాగడం నిజంగా ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయం. ఈ ఘనత రాజ్యాంగ నిర్మాతలకు, ఈ దేశ ప్రజలకు దక్కుతుంది.

రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పాలకులు వ్యవహరించినప్పుడు ప్రజలే కార్యోన్ముఖులై తమ పోరాటాలు, తీర్పుల ద్వారా అధికారాన్ని నియంత్రించే శక్తి రాజ్యాంగం ఇచ్చింది. ఆ రాజ్యాంగ స్ఫూర్తితోనే, రాజ్యాంగం ఇచ్చిన హక్కుల ద్వారానే మనం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. తెలంగాణలో పాలన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా సాగినప్పుడు, ఆ పాలనకు చరమగీతం పాడే అవకాశం కూడా రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన హక్కే. గడచిన 10 యేళ్లలో పాలకులు రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా, నియంతృత్వ ధోరణితో వ్యవహరించడాన్ని సహించని తెలంగాణ సమాజం ఇటీవల జరిగిన ఎన్నికల్లో తమ తీర్పు ద్వారా ఆ ధోరణికి చరమగీతం పాడింది. ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంది. అహంకారం, నియంతృత్వం చెల్లదని విస్పష్టమైన తీర్పుతో ప్రకటించింది.

పదేళ్ల పాలనలో విధ్వంసానికి గురైన రాజ్యాంగ విలువలు, రాజ్యాంగబద్ధ సంస్థలు, వ్యవస్థలను ఈ ప్రజా ప్రభుత్వంలో ఇప్పుడిప్పుడే మళ్లీ పునర్ నిర్మిం చుకుంటున్నాం. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల్లో రాజ్యాంగబద్ధమైన విలు వలు, విధానాలు, పద్ధతులను పునరుద్ధరణ చేసుకుంటున్నామని చెప్పడానికి సంతోషిస్తున్నాను. ఏ ప్రభుత్వమైనా రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పాలన సాగించినప్పుడే ప్రజాస్వామ్య, సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రతి పేదవాడికి అందుతాయి. ఏకపక్ష నిర్ణయాలు, నియంత పోకడలు ఎప్పుడూ ప్రజాస్వామ్యానికి శోభనివ్వవు. కొత్తగా ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ఈ స్పృహతో పని మొదలు పెట్టింది. సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలన్న లక్ష్యంతో పని చేస్తోంది. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన క్షణం నుండి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే కార్యాచరణ మొదలైంది. ఆరు గ్యారెంటీలలో రెండు గ్యారెంటీలు ఇప్పటికే అమలులోకి వచ్చిన విషయం మీకు తెలుసు. దీనిలో భాగంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో ఇప్పటివరకు 11 కోట్ల పైబడి మహిళా సోదరీమణులు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఉపయోగించుకోవడం ఎంతో సంతోషకరం. మిగిలిన గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేసి ప్రజల ముఖాలలో ఆనందం చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యం. గత పాలకుల నిర్వాకంతో ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నంగా మారినా, వ్యవస్థలు గాడి తప్పినా అన్నింటినీ సంస్కరించుకుంటూ, సరిదిద్దుకుంటూ ముందుకు వెళుతున్నాం. తెలంగాణ అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడేలా, సంక్షేమంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించేలా





రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పట్టుదలతో ముందుకు సాగుతోంది. ప్రజా ప్రభుత్వ తొలి ప్రాధాన్యత ప్రజా సంక్షేమమే. ప్రజల ఉద్యమ ఆకాంక్షలే ఈ ప్రభుత్వ ప్రాధాన్యాలు. ప్రతి అర్హుడికి సంక్షేమ ఫలాలు అందించడం ప్రభుత్వ బాధ్యత. అందుకే డిసెంబర్ 28 నుండి జనవరి 6 వరకు ప్రజల నుండి పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించాం. ఈ కార్యక్రమంలో 1,25,84,383 దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. వీటిలో ఐదు గ్యారెంటీలకు సంబంధించి 1,05,91,636 దరఖాస్తులు రాగా, ఇతర అభ్యర్థనలకు సంబంధించి 19,92,747 దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తులను ప్రస్తుతం శాఖల వారిగా క్రోడీకరించి, కంప్యూటరీకరించి వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందుతోంది.

గడచిన పదేళ్ల పాలకుల వైఫల్య ఫలితం... యువతకు ఉపాధి, ఉద్యోగాల విషయంలో పూర్తి నిర్లక్ష్యం జరిగింది. తెలంగాణ ఉద్యమ సారథులైన యువత విషయంలో గత ప్రభుత్వం పూర్తి నిర్దయగా, నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం ఈ విషయంలో గట్టి దృష్టి పెట్టింది. టీఎస్పీఎస్సీ ప్రక్షాళన ప్రక్రియ ప్రస్తుతం జరుగుతోంది. ఆ ప్రక్రియ పూర్తి కాగానే ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రక్రియ మొదలవుతుంది. ఈ విషయంలో యువత ఎలాంటి అనుమానాలు, అపోహలకు లోను కావాల్సిన అవసరం లేదు. రాష్ట్రానికి పెట్టుబడుల సాధన కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని బృందం దావోస్ లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు హాజరు కావడం, గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.40,232 కోట్ల మేర పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకోవడం తెలంగాణ పురోగమనానికి సంకేతం. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, వారి బృందాన్ని అభినందిస్తున్నాను. ఈ ప్రయత్నం రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధికి... తద్వారా ఉపాధి అవకాశాల కల్పనకు ఉపకరిస్తుందని విశ్వసిస్తున్నాను. రైతుల విషయంలో మా ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది. వరంగల్ డిక్లరేషన్ అమలుకు కార్యాచరణతో పాటు, 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రైతు భరోసా పథకాన్ని సంపూర్ణంగా అమలు చేయడానికి కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే చిన్న, సన్నకారు రైతుల ఖాతాలలో రైతు భరోసా నిధులు జమ చేయడం జరిగింది. రూ.2 లక్షల రుణమాఫీకి సంబంధించి బ్యాంకులతో సంప్రదింపులు జరుగుతున్నాయి. ఒక పద్ధతి ప్రకారం ఆ ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. రైతులకు ఇచ్చిన మాట నూటికి నూరు శాతం నిలబెట్టుకుంటామని మరొక్కసారి హామీ ఇస్తున్నాం. రాష్ట్ర ప్రజలకు ఒక విషయం స్పష్టంగా చెప్పదలచుకున్నాను. గత ప్రభుత్వం ఏనాడు సామాన్యులకు అందుబాటులో లేదు. కష్టమొస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. పేదల కన్నీళ్లు తుడిచే నాథుడు లేని పాలన గతంలో చూశాం. ఇప్పుడు తెలంగాణ ప్రజాస్వామ్య పాలనలో ఉంది. మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాలు ప్రజావాణి పేరుతో ప్రజా సమస్యలు వినేందుకు మంత్రులు అందు బాటులో వుంటున్నారు. సచివాలయంలో సామా న్యుడు సైతం వచ్చి ముఖ్యమంత్రిని, మంత్రులను కలిసి సమస్యలు చెప్పుకునే స్వేచ్ఛ వచ్చింది. ప్రజావాణి కార్యక్రమాన్ని కేవలం హైదరాబాదుకే పరిమితం చేయకుండా క్షేత్ర స్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారి రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైన పాలన మొదలైంది. ప్రజల హక్కులను, స్వేచ్ఛను గౌరవించే పాలన తెలంగాణలో ఉంది అని చెప్పడానికి గర్విస్తున్నాను. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో పేద, బడుగు, బలహీన వర్గాలు, గిజనులు, మైనారిటీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా పాలన అడుగులు వేస్తోంది. ఇదే స్ఫూర్తితో ఇక ముందు కూడా పాలన సాగాలని, అభివృద్ధిలో తెలంగాణ అత్యున్నత శిఖరాలకు చేరాలని... సంక్షేమంతో ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలని మనసారా కోరుకుంటున్నాను.

> “ A constitution is not a mere lawyers document, it is a vehicle of life and its spirit is always the spirit of the age
>
> \- DR. BR AMBEDKAR

JAI HIND






# యూపీఎస్సీ తరహాలో టీఎస్‌పీఎస్సీ రూపకల్పన

## నోటిఫికేషన్ మొదలు నియామకాల ప్రక్రియ వరకు పారదర్శకతకే పెద్దపీట

## యూపీఎస్సీ ఛైర్మన్‌తో ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి ఉత్తమ్ సుదీర్ఘ భేటీ

**యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్‌కు (యూపీఎస్సీ) సుమారు వందేళ్ల చరిత్ర ఉంది. సుదీర్ఘ చరిత్రతో పాటు నిర్దిష్ట కాలపరిమితిలోనే నోటిఫికేషన్, పరీక్షలు, ఇంటర్వ్యూల నిర్వహణ, నియామక ప్రక్రియను చేపట్టడం,అన్నింటా పారదర్శకత పాటిస్తోంది. ఈ విషయంలో మేం యూపీఎస్సీకి అభినందనలు తెలుపుతున్నాం, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ను ఆ విధంగానే రూపొందించాలని తాము నిర్ణయించుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూపీఎస్సీ ఛైర్మన్ డాక్టర్ మనోజ్ సోనికి తెలిపారు.**

**న్యూఢిల్లీలోని** యూపీఎస్సీ కార్యాలయంలో యూపీఎస్సీ ఛైర్మన్ డాక్టర్ మనోజ్ సోని, కార్యదర్శి శశిరంజన్ కుమార్‌లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన, యూపీఎస్సీ పని తీరుపై సుమారు గంటన్నర పాటు వారు చర్చించారు. యూపీఎస్సీ పారదర్శకత పాటిస్తోందని, అవినీతి మరక అంటలేదని, ఇంత సుదీర్ఘకాలంగా అంత సమర్థవంతంగా యూపీఎస్సీ పని చేస్తున్న తీరుపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన నియామక ప్రక్రియలో నూతన విధానాలు, పద్ధతులు పాటించాలనుకుంటున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

ఇందుకు స్పందించిన యూపీఎస్సీ ఛైర్మన్ యువ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామకాల ప్రక్రియపై దృష్టి సారించడం అభినందనీయమన్నారు. యూపీఎస్సీ ఛైర్మన్, సభ్యుల నియామకంలో రాజకీయ ప్రమేయం ఉండదని, సమర్థత ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు.

తాము 2024 డిసెంబరు నాటికి రెండు లక్షల ఉద్యోగ నియామకాలు చేపట్టాలని భావిస్తున్నామని, ఇందుకు టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలనుకుంటున్నామని ముఖ్యమంత్రి, మంత్రి ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్, సభ్యుల నియామకాన్ని రాజకీయం చేసి, దాన్ని ఒక రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చిందన్నారు. ఫలితంగా పేపర్ లీకులు, నోటిఫికేషన్ల జారీ, పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి ఓ ప్రహసనంగా మారిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయిందని, కానీ గత ప్రభుత్వం అలసత్వం, అసమర్థతతో నియామకాల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చోటు చేసుకుందన్నారు. తాము రాజకీయ ప్రమేయం లేకుండా ఛైర్మన్, సభ్యుల నియామకం చేపడతామని ముఖ్యమంత్రి తెలిపారు. టీఎస్‌పీఎస్సీలో అవకతవలకు తావులేకుండా సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికన నియమిస్తామని వివరించారు.

ఈ సందర్భంగా యూపీఎస్సీ ఛైర్మన్ మాట్లాడుతూ, టీఎస్‌పీఎస్సీని యూపీఎస్సీ తరహాలో తీర్చిదిద్దాలనుకుంటున్నందున టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్‌తో పాటు సభ్యులకు తాము శిక్షణ ఇస్తామని, సచివాలయ సిబ్బందికి అవగాహన తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, ఓఎస్డీ అజిత్ రెడ్డి, టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్, రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్ పాల్గొన్నారు.

### రక్షణ శాఖ భూములు బదలాయించండి

హైదరాబాద్ నగరంలో రహదారులు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణ శాఖ పరిధిలో ఉన్న భూములు కేటాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కలిసి చర్చించారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు మెహిదీపట్నం రైతు బజార్ వద్ద స్కైవాక్ నిర్మిస్తున్నామని, ఇందుకోసం అక్కడ ఉన్న రక్షణ శాఖ భూమి 0.21 హెక్టార్లను బదిలీ చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఆ భాగంలో మినహా స్కైవే నిర్మాణం పూర్తి కావస్తున్నందున ఆ భూమిని వెంటనే బదిలీ చేయాలని కోరారు. అందుకు రక్షణ శాఖ మంత్రి సుముఖత వ్యక్తం చేశారు.

హైదరాబాద్ నుంచి కరీంనగర్ - రామగుండంను కలిపే రాజీవ్ రహదారిలో ప్యారడైజ్ జంక్షన్ నుంచి అవుటర్ రింగు రోడ్డు జంక్షన్ వరకు ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, ఎంట్రీ, ఎగ్జిట్ ర్యాంపుల నిర్మాణానికి మొత్తంగా 11.30 కిలోమీటర్ల కారిడార్ నిర్మాణానికి 83 ఎకరాల రక్షణ శాఖ భూమి అవసరమని దానిని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని రక్షణ శాఖ మంత్రికి విజప్తి చేశారు. నాగ్‌పూర్ హైవే (ఎన్‌హెచ్-44)పై కండ్లకోయ సమీపంలోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి అవుటర్ రింగ్ రోడ్డు వరకు ఎలివేటెడ్ కారిడార్ మొత్తంగా 18.30 కిలోమీటర్ల మేర ప్రతిపాదించామని, అందులో 12.68 కిలోమీటర్ల మేర ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి, నాలుగు ప్రాంతాల్లో ఎగ్జిట్, ఎంట్రీలకు, భవిష్యత్తులో డబుల్ డెక్కర్ (మెట్రో కోసం) కారిడార్, ఇతర నిర్మాణాలకు మొత్తంగా 56 ఎకరాల రక్షణ శాఖ భూములు బదిలీ చేయాలని రక్షణ శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజప్తి చేశారు.

ముఖ్యమంత్రి విజ్ఞప్తులకు రక్షణ శాఖ మంత్రి సానుకూల స్పందన వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, ఓఎస్డీ అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

### నిధులు విడుదల చేయండి

తెలంగాణకు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కింద 2019-20, 2021-22 నుంచి 2023-24 వరకు సంవత్సరానికి రూ.450 కోట్ల చొప్పున విడుదల చేయాల్సిన రూ.1800 కోట్లు విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజప్తి చేశారు. కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఢిల్లీలోని ఆమె కార్యాలయంలో కలిశారు. 15వ ఆర్థిక సంఘం నుంచి తెలంగాణకు రావల్సిన 2,233.54 కోట్ల రూపాయలను త్వరగా విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, ఓఎస్డీ అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఆరాజెన్ విస్తరణ

**తెలంగాణలో** ఔషధాల ఆవిష్కరణ, అభివృద్ధి సేవలను విస్తరించేందుకు ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ మరిన్ని పెట్టుబడులకు సంసిద్ధత వ్యక్తం చేసింది. 2,000 కోట్ల రూపాయల కొత్త పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. 1,500 కొత్త ఉద్యోగాలను అందించేలా తమ ప్రాజెక్టులను విస్తరించనుంది. తెలంగాణలోని మల్లాపూర్‌లో ప్రస్తుతం ఉన్న సదుపాయాన్ని మరింత పెంచుకోవడానికి కొత్త పెట్టుబడులు పెడు తోంది. దీంతో ఆసియాలోనే ఔషధ పరిశ్రమకు హబ్‌గా పేరొందిన హైదరాబాద్ స్థానం మరింత సుస్థిర మవ నున్నది. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో భాగంగా ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ సీఈవో మణి కంటిపూడి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు.

ఫార్మా రంగంలో గ్లోబల్ లీడర్‌గా ఉన్న ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ హైదరాబాద్‌లో భారీ పెట్టుబడి ప్రణాళికలను ఎంచుకోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కొత్త ఆవిష్కరణలతో ఇక్కడున్న ప్రతిభా నైపుణ్యాలకు మరింత గుర్తింపు వస్తుందని సిఎం అన్నారు. రాబోయే అయిదేండ్లలో తమ సేవలను విస్తరించే ప్రణాళికను ప్రకటించటం సంతోషంగా ఉందని కంపెనీ సీఈవో మణి కంటిపూడి అన్నారు. హైదరాబాద్‌లో రూ. 2,000 కోట్ల పెట్టుబడులకు నిర్ణయం తీసుకున్నామ న్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొత్త ఔషధ ఆవిష్కరణలు, పరిశోధన సంస్థల కేంద్రంగా హైదరాబాద్ జాతీయ స్థాయిలో తనకున్న హోదాను నిలబెట్టుకుం టుందనే విశ్వాసం కలుగుతోందన్నారు. తమ కంపెనీ విస్తరణకు తగినంత మద్దతు ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ విస్తరణతో హైదరాబాద్ దేశంలోనే కాంట్రాక్ట్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ హబ్‌గా మారనుంది. కొత్త డ్రగ్స్, డివైజ్‌లను కనుగొనేందుకు, అభివృద్ధి చేసేందుకు ప్రపంచ వ్యాప్తంగా 1,000 మందికిపైగా ఆవిష్కర్తలకు హైదరాబాద్ సేవలందిస్తోంది. కొత్త ఔషధాల సృష్టి, అభివృద్ధి, తయారీ సేవల విభాగంలో ఆరాజెన్ కంపెనీకి 20 ఏళ్లకుపైగా అనుభవముంది. ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ రంగాలకు కాంట్రాక్ట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సేవలను ఈ కంపెనీ అందిస్తోంది.



# త్వరలో కొత్త విద్యుత్ విధానం

**విద్యుత్ రంగ నిపుణులు, వివిధ రాష్ట్రాల విద్యుత్తు విధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి, శాసనసభలో చర్చించి తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర విద్యుత్ విధానాన్ని అమలుచేయాల్సిన అవసరముందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబులతో కలిసి నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో విద్యుత్తు వినియోగం, 24 గంటలపాటు నిరంతర విద్యుత్తు సరఫరా, విద్యుత్ సంస్థల ఉత్పత్తి, కొత్తగా ఉత్పత్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలు, ఎన్నికల్లో హామీ ఇచ్చిన 'గృహజ్యోతి' పథకానికి 2వందల యూనిట్లను అందించడానికి తీసుకోవాల్సిన చర్యల వంటివాటిపై చర్చించారు.**

**రాష్ట్రంలో** విద్యుత్ ఉత్పత్తి, వివిధ విద్యుత్ కంపెనీల నుంచి విద్యుత్ కొనుగోళ్లు, విద్యుత్ వినియోగం, డిస్కంల పనితీరు, ఆర్థిక పరిస్థితిపైనా వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2014 నుంచి ఇప్పటిదాకా విద్యుత్ కంపెనీలకు, విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) మధ్య జరిగిన ఒప్పందాలు, ఆ ఒప్పందాల్లోని అంశాలు, విద్యుత్‌కు చెల్లించిన ధరలు వంటివాటిపై సమగ్రంగా అధ్యయనం చేసి, పూర్తి వివరాలను అందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

ఆర్థిక సంవత్సరాల వారీగా జరిగిన ఒప్పందాలను, వాటిలోని అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. ఎక్కువ ధర చెల్లించే విధంగా జరిగిన ఒప్పందాలకు కారణాలేమిటో కూడా నివేదించాలని ఆదేశించారు. బహిరంగ మార్కెట్లో ఎక్కడ తక్కువ ధరకు విద్యుత్ లభిస్తుందో, ఆ కంపెనీల నుంచే విద్యుత్ కొనుగోలు చేయాలని సిఎం ఆదేశించారు. ఇప్పటిదాకా సరైన విద్యుత్ పాలసీని రూపొందించక పోవడంతో వివిధరకాల ఇబ్బందులు, సమస్యలు ఉత్పన్నమవుతున్నా యన్నారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యుత్ విధానాలను అధ్యయనం చేయాలని, ఆ రాష్ట్రాల్లోని విద్యుత్ పరిస్థితులు, మెరుగైన విధానం ఏ రాష్ట్రంలో ఉందో అధ్యయనం చేసి, నివేదికలను ఇవ్వాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. అన్ని రాష్ట్రాలకంటే మెరుగైన విద్యుత్ విధానాన్ని తెలంగాణలో అమలుచేయడానికి నిపుణులతో చర్చించి, అసెంబ్లీలోనూ అన్ని రాజకీయపార్టీల ప్రజా ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించి, సరికొత్త విద్యుత్ పాలసీని తీసుకు వస్తామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.

తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చి తీరాలని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలలో ఒకటైన 'గృహజ్యోతి' పథకం ద్వారా ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎం ఆదేశించారు. ప్రభుత్వ పరంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచడానికి, మరిన్ని విద్యుత్ సంస్థలను ఏర్పాటు చేయడానికి ఉన్న అవకాశాలను, ఇప్పటికే నిర్మాణంలో ఉన్న పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ దుర్వినియోగాన్ని అరికట్టాలని, నాణ్యతను పెంచాలని సూచించారు. విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేయడంలో ఎలాంటి అవాంతరాలు రాకుండా పటిష్టంగా, ముందస్తు చర్యలను చేపట్టాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఫైనాన్స్ స్పెషల్ సిఎస్ రామకృష్ణా రావు, ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ట్రాన్స్ కో సిఎండి రిజ్వీ, టిఎస్ఎస్పీడిసిఎల్ సిఎండీ ముషార్రఫ్ ఫారూఖీ, సిఎంఓ అధికారులు ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# రాష్ట్ర పునర్నిర్మాణానికి సహకరించండి

## బిల్డర్ల సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి

**రాష్ట్ర పునర్నిర్మాణానికి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిల్డర్లను కోరారు. హైదరాబాద్‌లో ఆలిండియా బిల్డర్స్ అసోసియేషన్ 31వ జాతీయ కన్వెన్షన్‌కు రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తమ ప్రభుత్వం బిల్డర్లు, కాంట్రాక్టర్ల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తుందని అన్నారు. బిల్డర్లు ఆర్థికంగా ఎదిగి బలపడితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని సిఎం అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టులు, ఇతర పనులను నాణ్యతతో చేయాలని ఆయన బిల్డర్లను కోరారు.**

మెగా మాస్టర్‌ప్లాన్-2050ని రూపొందిస్తున్నామని, అందుకోసం త్వరలో ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్‌ను పిలుస్తామని సిఎం వివరించారు. మెగా మాస్టర్‌ప్లాన్ రూపకల్పనలో బిల్డర్స్ అసోసియేషన్ భాగస్వామి కావాలన్నారు. తెలంగాణ పునర్నిర్మాణానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. మూసీ నది వల్లనే హైదరాబాద్‌కు ఎన్నో అందాలు సమకూరుతాయన్నారు. మూసీని ప్రక్షాళన చేసేందుకు బృహత్ ప్రణాళిక తయారు చేస్తామని సిఎం వివరించారు. లండన్‌లో థేమ్స్ నది, గుజరాత్‌లోని సబర్మతీ నదుల మాదిరిగా హైదరాబాద్‌లో కూడా మూసీలో స్వచ్ఛమైన నీరు ప్రవహించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

సమాచార, రెవిన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, కాంట్రాక్టర్లు వెయ్యి కోట్ల పనులు చేసినా మిగిలేది తక్కువేనని అన్నారు. కానీ వెయ్యి కోట్ల పనులకు కాంట్రాక్టర్‌నే బాధ్యుడిని చేస్తారని అన్నారు. తాము కాంట్రాక్టర్లు, బిల్డర్ల సమస్యలను అర్థం చేసుకుంటామని, పెండింగ్‌లో ఉన్న 12వేల కోట్ల రూపాయల బిల్లులను చెల్లిస్తామని తెలిపారు. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రాన్ని, రాజధాని నగరం హైదరాబాద్‌ను అంచనాలకు మించి అభివృద్ధిచేసి చూపిస్తామని పేర్కొన్నారు. వ్యాపారం, పరిశ్రమలు అభివృద్ధి చెందితేనే నగరాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయని, ఆ దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు.

రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, అవుటర్ రింగ్ రోడ్ కాంగ్రెస్ కాలంలోనే నిర్మాణం జరిగిందని, ఇప్పుడు ఆర్‌ఆర్‌ఆర్ కూడా కాంగ్రెస్ కాలంలోనే పూర్తవుతుందని అన్నారు. ఇవి రాష్ట్ర అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌లుగా మారాయన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రులు బీఏఐ సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) జాతీయ మాజీ అధ్యక్షులు బి.శీనయ్య, జాతీయ అధ్యక్షులు ఎస్.ఎన్.రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ పార్లమెంటేరియన్

# జైపాల్‌రెడ్డికి నివాళి



'అవుట్ స్టాండింగ్ పార్లమెంటేరియన్' అవార్డు గ్రహీత, స్ఫూర్తి ప్రదాత, కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి 82వ జయంతి వేడుకలు హైదరాబాద్ నగరంలో ఘనంగా నిర్వహించారు. నెక్లెస్‌రోడ్‌లో ఉన్న జైపాల్‌రెడ్డి సమాధి 'స్ఫూర్తి స్థల్' వద్ద పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు నివాళులు అర్పించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రోడ్లు, భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో జైపాల్ రెడ్డి చరిత్రను చేర్చేందుకు చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మలిదశ ఉద్యమంలో తెలంగాణ ఏర్పాటు కోసం ఢిల్లీలో జైపాల్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్టానంపై ఎంతో వత్తిడి తెచ్చారని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలన్నారు.

రెవిన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, జైపాల్ రెడ్డి దేశంలో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పేరు తెచ్చుకున్నారని, దేశంలోని అయిదుగురు ఉత్తమ పార్లమెంటేరియన్‌లలో జైపాల్‌రెడ్డి ఒకరని కొనియాడారు. జైపాల్‌రెడ్డి రాజకీయాలలో నైతిక విలువలకు ప్రాధాన్యత ఇచ్చారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ పార్లమెంటు సభ్యులకు జైపాల్‌రెడ్డి ఆదర్శప్రాయుడన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, జైపాల్‌రెడ్డి అభిమానులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీమణి, జైపాల్‌రెడ్డి తమ్ముని కూతురు శ్రీమతి గీతా రేవంత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు కూడా జైపాల్‌రెడ్డి సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు.

### గాంధీ భవన్‌లో ఘన నివాళి

గాంధీభవన్‌లో జైపాల్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జానారెడ్డి, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఢిల్లీలో...

ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కూడా జైపాల్‌రెడ్డి జయంతిని నిర్వహించారు. తెలంగాణభవన్ రెసిడెంట్ ఎడిటర్ గౌతమ్ ఉప్పల్ జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

### డీజీపీ కార్యాలయంలో ....

రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించారు. జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన దేశానికి, ముఖ్యంగా తెలంగాణకు చేసిన సేవలను స్మరించుకొని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీజీపీ రవిగుప్తతోపాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.










# పారిశ్రామిక అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్ - 2050

**2050 నాటికి తెలంగాణ అంతటా పారిశ్రామిక వృద్ధి జరగాలనే భవిష్యత్తు లక్ష్యంతో మెగా మాస్టర్ పాలసీ రూపకల్పన చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సచివాలయంలో భారత పారిశ్రామిక సమాఖ్య (సిఐఐ) ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. తెలంగాణ ప్రాంతంలో 1994 నుంచి 2004 వరకు పరిశ్రమల అభివృద్ధికి అనుసరించిన ఫార్ములా ఒక తీరుగా ఉంటే.. 2004 నుంచి 2014 వరకు అది మరో మెట్టుకు చేరుకుందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇది అత్యున్నత వృద్ధి దశకు(నెక్ట్స లెవల్ డెవెలప్ మెంట్) చేరుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు.**

పరిశ్రమల అభివృద్ధికి.. పెట్టుబడులను ఆహ్వానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఫ్రెండ్లీ పాలసీని అనుసరిస్తుందన్నారు సిఎం.పారిశ్రామిక అభివృద్ధి విషయంలో అపోహలు, అనుమానాలకు తావు లేదని అన్నారు. పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టే ప్రతి పైసా పెట్టుబడికి రక్షణ కల్పిస్తామని, అంతకంత విలువ కూడా ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రజల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల ప్రయోజనాలకి మాత్రమే పెద్దపీట వేస్తుందనే ఆలోచనలకు భిన్నంగా కొత్త పాలసీని తమ ప్రభుత్వం అనుసరిస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ ఒక్కచోటే పారిశ్రామిక అభివృద్ధి కేంద్రీకృతం కాకుండా.. తెలంగాణలోని అన్ని ప్రాంతాలు హైదరాబాద్ తరహాలోనే అభివృద్ధి చెందాలనే ఆకాంక్షను వ్యక్తపరిచారు. గ్రామీణ ప్రాంతాలకు పరిశ్రమలు విస్తరించాలనేది తమ లక్ష్యమని అన్నారు. నగరాలు, పట్టణాల్లో అభివృద్ధి ఫలాలు, పెట్టుబడులతోనే గ్రామాలు, గ్రామీణ ప్రాంతాల సౌభాగ్యం,



సంక్షేమం కూడా ముడిపడి ఉంటుందని అన్నారు. పారిశ్రామికంగా అన్ని రంగాలు అభివృద్ధి చెందేలా ఫ్రెండ్లీ పాలసీని అమలు చేసేందుకు ఔత్సాహికులు, పారిశ్రామికవేత్తలు సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు.

ఈ పాలసీలో భాగంగా తెలంగాణను మూడు క్లస్టర్లుగా విభజించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల అర్బన్ క్లస్టర్, ఓఆర్ఆర్ తర్వాత రీజనల్ రింగ్ రోడ్డు వరకు మధ్యలో ఉన్న ప్రాంతం సెమీ అర్బన్ క్లస్టర్ గా, రీజనల్ రింగ్ రోడ్డు తర్వాత చుట్టూరా ఉన్న ప్రాంతాన్ని రూరల్ క్లస్టర్ గా గుర్తించి పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

ఫార్మాసిటీ విషయంలో ప్రభుత్వానికి స్పష్టమైన ఆలోచనలు ఉన్నాయని తెలిపారు. ఫార్మాసిటీగా కాకుండా ఫార్మా విలేజీలను డెవెలప్ చేస్తామన్నారు. ఓఆర్ఆర్ పై 14 రేడియల్ రోడ్లు ఉన్నాయని, వీటికి 12 జాతీయ రహదారుల కనెక్టివిటీ ఉందని.. వీటికి అందుబాటులో ఉండేలా దాదాపు వెయ్యి నుంచి 3 వేల ఎకరాలకో ఫార్మా విలేజీని అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రజల జీవనానికి ఇబ్బంది లేకుండా, కాలుష్యం లేకుండా, పరిశ్రమలతో పాటు స్కూల్స్, హాస్పిటల్స్, అన్ని మౌలిక సదుపాయాలుండేలా వీటిని డెవెలప్ చేసే ప్రణాళికలను తమ ప్రభుత్వం రూపొందిస్తుందని అన్నారు.

తెలంగాణలో ఐటీ, ఫార్మా, హెల్త్ తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, స్పోర్ట్స్, ఆటోమొబైల్, ఆర్గానిక్ క్లస్టర్లుగా అక్కడ పరిశ్రమల ఏర్పాటు జరగాలని అన్నారు. రక్షణ రంగం, నావికా రంగానికి అవసరమైన పరికరాల తయారీ, ఉత్పత్తికి హైదరాబాద్‌లో అపారమైన అవకాశాలున్నాయని, పారిశ్రామికవేత్తలు వీటిపై దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. కొత్తగా సోలార్ పవర్ పాలసీని రూపొందిస్తామని, సోలార్ ఎనర్జీ పరిశ్రమలకు తగిన ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు.

ఎన్నికలు, రాజకీయాలు వేరు.. అభివృద్ధి వేరని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయ పడ్డారు. దార్శనికతతో పారదర్శకమైన అభివృద్ధి తమ లక్ష్యంగా ఎంచుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమల వృద్ధికి సహకరించదన్న, అపోహలు అవసరం లేదని, ఎవరికి వారుగా తమకున్న అభిప్రాయాలు ఇతరులపై రుద్దవద్దని హితవు పలికారు. 24 గంటల పాటు తాను ఆఫీసు లేదా క్యాంపు కార్యాలయంలో అందరికీ అందుబాటులో ఉంటానని, తనతో మాట్లాడి నిర్ణయాలు తీసుకోవాలని పారిశ్రామికవేత్తలను, పెట్టుబడిదారులను ఆహ్వానించారు. తమతోనూ, ప్రభుత్వ ప్రతినిధులు అయిన అధికారులతోనూ మాట్లాడకుండానే తొందరపడి ఒక అభిప్రాయానికో, నిర్ణయానికో రావద్దని అన్నారు.

రాష్ట్రంలో సుమారు 35 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, గత ప్రభుత్వం తరహాలో వీరిని తాము భారంగా భావించటం లేదని అన్నారు. వీరందరినీ పరిశ్రమల అభివృద్ధిలో పాలుపంచుకునే మానవ వనరులుగా భావిస్తున్నామని తెలిపారు. యువతీ యువకులకు స్కిల్స్ నేర్పించేందుకు స్కిల్ యూనివర్సిటీలను నెలకొల్పుతామని అన్నారు. స్కిల్ యూనివర్సిటీల్లో డిగ్రీలు పొందిన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని, పోటీ ప్రపంచంలో ఎక్కడైనా నిలదొక్కుకునే సామర్థ్యం వాళ్ల సొంతమవుతుందని అన్నారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శేషాద్రి, ఐటి ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, సిఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ప్రతినిధులు సి. శేఖర్ రెడ్డి, అనిల్ కుమార్, డాక్టర్ మోహన్ రెడ్డి, సతీష్ రెడ్డి, సుచిత్రా కె ఎల్లా, వనిత దాట్ల, రాజు, సంజయ్ సింగ్, ప్రదీప్ ధోబాలే, శక్తి సాగర్, వై. హరీష్ చంద్ర ప్రసాద్, గౌతమ్ రెడ్డి, వంశీకృష్ణ గడ్డం, శివప్రసాద్ రెడ్డి రాచమల్లు, రామ్, చక్రవర్తి, షేక్ సమియుద్దిన్, వెంకటగిరి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఒక నమ్మకం... ఒక విశ్వాసం

**అన్నం ఉడికింది లేనిది ఒక్క మెతుకు పట్టుకొని చూస్తే తెలుస్తుంది. ఊరి అందం గోడలే చెపుతాయంటారు. అలాగే, కొత్త ప్రభుత్వం పోకడలు తొలి అడుగులోనే తెలిసిపోతాయి. ఆపద మొక్కులు మొక్కడం, ఎన్నికలప్పుడు ప్రజలకు హామీల వర్షం కురిపిండచం రాజకీయపార్టీలకు సర్వసాధారణం. కానీ, వాటిని అమలుపరచిన వారే ప్రజల మన్ననలు పొందగలుగుతారు.ఇచ్చిన హామీలు అమలుపరచాలంటే, కార్యదీక్ష, పట్టుదల, ప్రజల పట్ల ప్రేమ, అంకితభావం అవసరం.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో ఈ లక్షణాలు పుష్కలంగా కనిపిస్తాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనా విధానం తొలి మాసంలోనే ప్రజా విశ్వాసం చూరగొని ప్రజలలో ఒక నమ్మకం కలిగించ గలిగింది.**



**అధికారం** చేపట్టిన నాడే ఇచ్చిన హామీకి కట్టుబడి ఓ దివ్యాంగురాలికి ఉద్యోగ నియామక పత్రం అందించడం, కానిస్టేబుల్‌గా పనిచేస్తూన్న తన భర్త అకస్మాత్తుగా ప్రమాదవశాత్తూ మరణించడంతో, ఎంతో కాలంగా ఉద్యోగం కోసం ఎదురుచూస్తున ఆ కానిస్టేబుల్ భార్యకు నిబంధనలు సడలించి మరీ ఉద్యోగావకాశం కల్పించడం వంటి తొలిచర్యలు ముఖ్యమంత్రిలోని మానవతా కోణాన్ని చెప్పకనే చెపుతున్నాయి.

ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా మార్చి, అందులో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం ద్వారా ప్రజలు తమ గోడును ప్రభుత్వానికి తెలుపుకొనే సదవకాశాన్ని కల్పించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు అభయహస్తం పేరిట అధికారయంత్రాంగాన్ని ప్రజల ముంగిటకు నడిపించి, ప్రజలనుంచి నేరుగా ఆర్జీలను స్వీకరించడం, దీనికి ప్రజల నుంచి వచ్చిన స్పందన అనూహ్యం. అభయహస్తం కార్యక్రమంలో కోటికిపైగా దరఖాస్తులు రావడం, ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు వేకువజామునే పెద్ద ఎత్తున తరలిరావడం దేనికి సంకేతం?

మరో వంక సచివాలయంలో సందడి పెరిగింది. వచ్చివెళ్ళేవారితో కళకళలాడుతోంది. నిత్యం వందల సంఖ్యలో అర్జీదారులు తరలివచ్చి ముఖ్యమంత్రి నుంచి మంత్రులదాకా తమ సమస్యలను చెప్పుకోగలుగుతున్నారు. సచివాలయంలో మంత్రులు అందుబాటులో ఉంటారని, వారిని కలసి స్వయంగా తమ గోడు చెప్పుకోవచ్చన్న విశ్వాసం ప్రజలలో ఏర్పడింది. ఇచ్చిన హామీలను అమలుపరిచేందుకు ప్రజల ఆశీస్సులతో అధికారం చేపట్టినముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తొలిరోజునుంచే నడుంబిగించి రంగంలోకి దిగింది. అధికారం చేపట్టిన 48 గంటల్లోనేఇచ్చిన ఆరు గ్యారంటీలలో రెండింటిని అమలుపరచి తన నిబద్ధతను చాటుకుంది.

ప్రస్తుత ప్రభుత్వం తమ ఆశలు నెరవేరుస్తుందన్నవిశ్వాసం ప్రజల్లో కనిపిస్తోంది. ప్రజల నుంచి పెద్దఎత్తున వచ్చిన దరఖాస్తులను శాఖల వారీగా క్రోడీకరించి, కంప్యూటరీకరించి, వాటి పరిష్కారానికి ప్రణాళికలను రూపొందించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ప్రజల ఆశలు నెరవేర్చడంతోపాటు గత పదేళ్ళపాలనలో అప్పుల కుప్పగా మారిన రాష్ట్ర ఖజానాను చక్కదిద్దే పనిలో ప్రభుత్వం పడింది.

ఇప్పటికే ఆర్థిక రంగంపైన, విద్యుత్ రంగంపైన అసెంబ్లీలో ప్రభుత్వం శ్వేతపత్రాలను సమర్పిం

చింది. రాష్ట్ర ఖజానాలో లంకెబిందెలున్నా యనుకుంటే ఖాళీ కుండలున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా వ్యాఖ్యానించడం రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతోంది.

మారిన ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు బడ్జెట్ రూపకల్పనకు ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి భట్టి విక్రమార్క కసరత్తు ప్రారంభించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల దావోస్ లో జరిపిన పర్యటన సందర్భంగా రాష్ట్రంలో 40 వేల కోట్ల రూపాయలకుపైగా పెట్టుబడులకు ఒప్పందాలు కుదరడం విశేషం. కొత్త ప్రభుత్వంపై, పాలకులపైన పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులకు కలిగిన విశ్వాసానికి ఇది నిదర్శనం. పనిలోపనిగా, మూసీనది పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూపకల్పనకు లండన్, దుబాయ్‌లలో సంబంధిత సంస్థలతో ముఖ్యమంత్రి సమావేశాలు జరిపారు. మురికి కూపంగా మారి, దుర్గంధాన్ని వెదజల్లుతూ, దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిన మూసీని శుద్ధి చేసి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దితే నగరం రూపురేఖలే మారిపోతాయి.

ఉద్యోగ నియామకాలను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించడానికి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి సంకల్పించారు. దానికి అనుగుణంగానే రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా మాజీ డిజిపి ఎం. మహేందర్ రెడ్డిని, ఇతర సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఇక చకచకా ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రక్రియ మొదలవుతుంది. ఈ కార్యక్రమం నిరుద్యోగ యువతలో ప్రభుత్వంపట్ల విశ్వాసాన్ని రెట్టింపు చేస్తోంది. ఉద్యోగాలకోసం ఎంతో కాలంగా నిరీక్షిస్తున్న వారి కలలు ఫలించే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.

రాష్ట్రంలో కులగణన చేయాలని, బీసీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలపట్ల కూడా ఆయావర్గాలలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

– శాస్త్రి



# అర్హులందరికీ 'గ్యారంటీ'లు

**ప్రతి పేదింటికి ప్రభుత్వ గ్యారంటీ పథకాలను అర్హత మేరకు అందిస్తామని రాష్ట్ర రెవిన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెం, తిరుమలాయపాలెం మండల కేంద్రం, నేలకొండపల్లి మండలం మంగాపురం తాండ, కూసుమంచి మండలం ముత్యాలగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన అభయహస్తం గ్యారంటీల దరఖాస్తు స్వీకరణ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. గ్రామ సభలలో ముందస్తుగా ప్రజా పాలన కార్యక్రమ ఉద్దేశాన్ని వివరిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు పంపిన సందేశాన్ని మంత్రి చదివి వినిపించారు.**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నూతన ప్రభుత్వం ఏర్పడిన రెండు గంటలలోపే 6 గ్యారంటీలకు కేబినెట్‌తో చట్టబద్ధత కల్పించినట్లు ఆయన అన్నారు. 48 గంటల లోపే ఇచ్చిన 6 గ్యారంటీలలో 2 గ్యారంటీలను అమలుపర్చినట్లు తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించామని, అదే విధంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుంచి 10 లక్షలకు పెంచామని ఆయన అన్నారు. రైతు భరోసా కార్యక్రమం క్రింద రైతులకు, వ్యవసాయ కూలీలకు అందించనున్న ఆర్థిక సహాయానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ముందు వరుసలో అత్యంత నిరుపేదలకు పథకాల లబ్ధి చేకూరుస్తామని మంత్రి అన్నారు. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా మంచి పరిపాలన అందిస్తామని ఆయన తెలిపారు. పార్టీలకతీతంగా అందరికి మంచి చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, జెడ్పి సిఇఓ అప్పారావు, డిఆర్డీవో విద్యాచందన, జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, ట్రాన్స్ కో ఎస్ఇ సురేందర్, ఆర్ అండ్ బి ఎస్ఇ శ్యామ్ ప్రసాద్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రానికి అదనంగా ఐపిఎస్‌లు

**తెలంగాణ రాష్ట్రానికి అదనంగా ఐపిఎస్ అధికారులను కేటాయించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు కేవలం 76 మంది ఐపిఎస్ అధికారులను కేటాయించారని తెలిపారు. జిల్లాల విభజన, వివిధ శాఖల పర్యవేక్షణ నిమిత్తం రాష్ట్రానికి అదనంగా 29 ఐపిఎస్ పోస్టులు కేటాయించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తికి కేంద్ర మంత్రి అమిత్ షా సానుకూలంగా స్పందించారు. 2024లో కొత్తగా వచ్చే ఐపిఎస్ బ్యాచ్ నుంచి తెలంగాణకు అధికారులను అదనంగా కేటాయిస్తామని హామీ ఇచ్చారు.**

**ముఖ్యమంత్రిగా** బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షాను రేవంత్‌రెడ్డి ఢిల్లీ నార్త్ బ్లాక్‌లోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి చెందిన పలు అంశాలను అమిత్‌షా దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు.

రాష్ట్ర పునర్విభజన చట్టం తొమ్మిదో షెడ్యూల్‌లో పేర్కొన్న సంస్థల విభజనను పూర్తి చేయాలని, పదో షెడ్యూల్ పరిధిలోని సంస్థల వివాదాన్ని పరిష్కరించాలని, న్యూఢిల్లీలోని ఉమ్మడిరాష్ట్ర భవన్ విభజనను సాఫీగా పూర్తి చేయాలని, చట్టంలో ఎక్కడా పేర్కొనకుండా ఉన్న సంస్థలను ఆంధ్రప్రదేశ్ క్లెయిమ్ చేసుకోవడం విషయంపై దృష్టి సారించాలని కేంద్ర హోం శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో బలోపేతానికి రూ. 88 కోట్లు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో బలోపేతానికి రూ. 90 కోట్లు అదనంగా కేటాయించాలని కేంద్ర హోం శాఖ మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్‌లోని

రాజ్‌భవన్, హైకోర్టు భవనం, లోకాయుక్త, ఎస్‌హెచ్‌ఆర్సీ వంటి భవనాలను వినియోగించుకున్నందున ఆ రాష్ట్రం నుంచి వడ్డీతో కలిపి మొత్తం రూ.408 కోట్లు ఇప్పించాలని కేంద్ర హోం శాఖ మంత్రిని ముఖ్యమంత్రి కోరారు.

## జాతీయ హోదా ఇవ్వండి

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించాలని జల్ శక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. షెకావత్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కలిశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్రాధాన్యతను కేంద్ర మంత్రికి వివరించారు. కరువు, ఫ్లోరైడ్ పీడిత జిల్లాలైన నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్, నారాయణపేట, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల నుంచి సాగునీరు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నుంచి ఆరు జిల్లాల పరిధిలోని 1,226 గ్రామాలతో పాటు హైదరాబాద్ మహా నగరానికి తాగు నీరు సరఫరా చేయాల్సి ఉందన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే పలు అనుమతులు తీసుకున్నా ఇంకా హైడ్రాలజీ, ఇరిగేషన్ ప్లానింగ్, అంచనా వ్యయం, బీసీ రేషియో, అంతర్రాష్ట్ర అంశాలు కేంద్ర జల సంఘం పరిశీలనలో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు.

ప్రాజెక్టు ప్రాధాన్యం దృష్ట్యా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా ఇవ్వాలని జల్ శక్తి మంత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కోరారు.

## సవరించిన ప్రతిపాదనలు ఆమోదించండి

హైదరాబాద్ మెట్రో రెండో దశకు సవరించిన ప్రతిపాదనలు ఆమోదించాలని కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖమంత్రి హర్‌దీప్ సింగ్ పూరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజప్తి చేశారు. కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

హైదరాబాద్ మెట్రో రెండో దశను (బీహెచ్‌ఈఎల్-లక్డీకాపూల్, నాగోల్-ఎల్‌బీ నగర్, 26 కి.మీ., రూ.9,100 కోట్ల అంచనా వ్యయం

**విమానాశ్రయం మెట్రో కారిడార్ :**

రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 32 కి.మీ, రూ.6,250 కోట్ల అంచనా వ్యయం సవరించాల్సి ఉందని తెలిపారు. సవరించిన ప్రతిపాదనల ప్రకారం ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టే విషయాన్ని పరిగణించాలని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రిని కోరారు.

హైదరాబాద్‌లోని మూసీ రివర్ ఫ్రంట్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని, అమ్యూజ్‌మెంట్ పార్కులు, వాటర్ ఫాల్స్, చిల్డ్రన్స్ వాటర్ స్పోర్ట్స్, బిజినెస్ ఏరియా, దుకాణ సముదాయాలతో బహుళ విధాలా ఉపయోగపడేలా చేయాలనుకుంటున్నట్లు కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం సహకారం అవసరమని, ఇందుకు మద్దతు ఇవ్వాలని కేంద్రమంత్రి పూరిని ముఖ్యమంత్రి కోరారు.

రాష్ట్రంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద వాటిని ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణకు ఇళ్లు మంజూరు చేయడంతో పాటు రాష్ట్రానికి రావాల్సిన నిధులు విడుదల చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.







# చూసొద్దాం... మేడారం!

**గిరిజనుల సంస్కృతి, సంప్రదాయం, కట్టుబాట్లు అన్నీ ప్రత్యేకమైనవే. వీరి సంస్కృతిలో జాతరలు ఓ భాగం. సమ్మక్క, సారక్క జాతర వాటిలో మకుటాయ మానమైనది. ఈ జాతర వరంగల్ నుంచి 110 కి.మీ. దూరంలో ఉన్న తాడ్వాయి మండలానికి చెందిన దండకారణ్యం ప్రాంతంలో ఉన్న మేడారం గ్రామంలో నిర్వహిస్తారు. ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు ఈ జాతర జరుగుతుంది.**

**- కన్నెకంటి వెంకటరమణ**

ఆసియా ఖండంలో కెల్లా జరిగే అతిపెద్ద గిరిజన జాతర ఇది. కుంభమేళా తరువాత ఈ జాతరనే అతి పెద్దది. గిరిజనులు దేవతలుగా కొలిచే సమ్మక్క, సారక్కలను గద్దె మీదకు తీసుకువచ్చే కనువిందైన పండుగ ఇది. ఈ తల్లులను దర్శించటానికి లక్షలాదిమంది విచ్చేస్తారు. బంగారంగా భావించే బెల్లంతో తులాభారం వేస్తారు. వైరాగ్యాన్ని ప్రబోధించేలా కేశాలను ఇస్తామని మొక్కుకుంటారు.

## యునెస్కో అంతర్జాతీయ గుర్తింపు దక్కాల్సిన మన మేడారం జాతర

ఇటీవలే మన రాష్ట్రంలోని సుప్రసిద్ధ కాకతీయ కట్టడం రామప్ప రుద్రేశ్వరాలయానికి యునెస్కో గుర్తింపు లభించింది. ఇదే కోవలో యునెస్కో ఇంటంజిబుల్ కల్చరల్ విభాగం క్రింద మరో అద్భుతమైన గిరిజన సాంస్కృతిక వేడుకగా నిలిచే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు కూడా అంతర్జాతీయ గుర్తింపు లభించేందుకు అన్ని అర్హతలూ ఉన్నాయి. దాదాపు కోటిన్నర మంది గిరిజనులు, గిరిజనేతరులు హాజరయ్యే ఈ మేడారం జాతరను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్ర పండగగా ప్రకటించడంతోపాటు తాడ్వాయి మండలానికి సమ్మక్క సారలమ్మ మండలంగా పేరు పెట్టింది. ఈ జాతరను జాతీయ పండగగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఆదివాసీ, గిరిజన సంఘాలు ఎంతోకాలంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

అటు చారిత్రిక శిల్పసంపద ఉన్న రామప్ప దేవాలయం, ప్రకృతి సౌందర్యంతో అలరారే లక్నవరం చెరువు, విస్తారమైన అటవీప్రాంతం, వేలసంవత్సరాల నాటి శిలాజాలు ఉన్న పాండవుల గుట్ట, సహజంగా పారే గోదావరీ నదీ ...ఇలా ప్రతీ అంశంతో ములుగు ప్రాంతం ప్రత్యేకత గాంచింది. ములుగు జిల్లాలోని మేడారం జాతరకు కూడా యునెస్కో గుర్తింపు లభిస్తే మేడారం జాతరపై అధ్యయనం చేయడానికి, ఇక్కడి సాంస్కృతీ, సాంప్రదాయాలు, గిరిజన, ఆదివాసీ సంస్కృతిని తెలుసుకోవడానికి వివిధ దేశాలనుండి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. అందుబాటులో ఉన్న చరిత్రను పరిశీలిస్తే, 800 సంవత్సరాల క్రితం అప్పటి కాకతీయ రాజులను గిరిజన రాజులు ఎదిరించడం, ఈ నేపథ్యంలో జరిగిన యుద్ధంలో నేలకొరిగిన పడిగిద్ద రాజు, గోవిందరాజులు, జంపన్న సారలమ్మ, సమ్మక్క లను దేవతలుగా మేడారంలో ప్రతీ రెండేళ్లకోసారి జాతర నిర్వహించి కొలవడం సాంప్రదాయకంగా వస్తోంది.

ఈ మేడారం జాతర ను మరింత వైభవంగా నిర్వహించేందుకు సుప్రసిద్ధ సామాజిక వేత్త హెమాన్ డార్ఫ్ కూడా కృషిచేశారు.

హన్మకొండ వేయిస్తంభాల గుడిలోని శాసనంలోనూ ఆదివాసీ దేవతలైన సమ్మక్క – సారక్కల ప్రస్తావన ఉంది.

ఇక ఈ జాతర ఆవిష్కరించే అద్భుత గిరిజన సంస్కృతీ, సాంప్రదాయాలు, జానపదుల ఆచార వ్యవహారాలూ, కోటి మందికి పైగా భక్తులు హాజరయ్యే ఈ జాతరలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు అందించే సేవలను తమ కెమెరాల్లో బంధించేందుకు వందలాది ఫోటో, వీడియో జర్నలిస్టులు హాజరవుతారు. ఏవిధమైన సౌఖ్యాలను ఆశించకుండా కేవలం సమ్మక్క, సారలమ్మ తల్లుల దర్శన భాగ్యం దక్కితే చాలనే లక్షలాది, ఆదివాసీ జానపదుల భక్తి పూర్వక నిబద్ధత మరే ఇతర సాంస్కృతిక ఉత్సవంలో ఇంతగా కనపడదు.

ఒక విధంగా చెప్పాలంటే, ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం జాతరకు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలతో పాటు, ఛత్తీస్ గఢ్ నుండి గుత్తి కోయలు, ఆదివాసీలు, జార్ఖండ్, మహారాష్ట్ర నుంచి గోండులు, కోయలు, లంబాడా, మధ్యప్రదేశ్ నుంచి బిల్లులు, రతీసాగర్ గోండులు, ఒరిస్సా నుంచి సవర ఆదివాసీలు కూడా పెద్ద ఎత్తున తరలివస్తారు.

కేవలం కోయల సంప్రదాయాలను గౌరవించడం, గుర్తించడం వరకు మాత్రమే ఈ జాతర పరిమితం కాదు. నమ్మిన జనం కోసం ప్రాణమైనా ఇవ్వాలనే ఓ సందేశం కూడా అంతర్లీనంగా ఉంటుంది. యుద్ధంలో గెలిచిన కాకతీయులు సామ్రాజ్యాన్ని విస్తరించుకుని చక్రవర్తులయ్యారు. పోరాటం చేసిన మేడరాజులు మాత్రం దేవుళ్ళు, దేవతలయ్యారు.

ఇలా, ఇన్ని ప్రత్యేకతలు, విశిష్టతలు, విశేషాలున్న మేడారం జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ. 100 కోట్లకు పైగా నిధులను వెచ్చించి విస్తృత ఏర్పాట్లను చేపట్టింది. తాగునీరు, శానిటేషన్, ప్రజారోగ్యం, పశు సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ ఇలా విస్తృత స్థాయిలో ఏర్పాట్లను చేసింది.



# మహా జాతరకు భారీ ఏర్పాట్లు

**తెలంగాణ కుంభమేళగా పేరుగాంచి, ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన మేడారం సమ్మక్క - సారలమ్మల మహాజాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం భారీ సన్నాహాలు ప్రారంభించింది.**

ఈ జాతర పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ, అటవీ పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క, సీఎస్ శాంతి కుమారి, డీజీపీ రవి గుప్తా, పోలీస్ రెవిన్యూ అటవీ, గిరిజన శాఖ ఉన్నతాధికారులు, హనుమకొండ, వరంగల్ ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు, పోలీస్, అటవీ, రోడ్లు భావనాలు, రవాణా, సమాచార శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో ఎంతో ప్రతిష్టాత్మకమైన సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందుగా రూ.75 కోట్లను విడుదల చేసిందని అన్నారు. దేశంలో అత్యధిక భక్తులు సందర్శించే ఈ జాతర నిర్వహణ పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ఈ జాతరలో గిరిజన, ఆదివాసీ సంప్రదాయ నృత్యాలతో పాటు ఇతర రాష్ట్రాల కళాకారుల బృందాలతో ప్రత్యేకమైన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జాతర లో మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ దఫా జాతర ప్రాంతాన్ని 10 జోన్లుగా వర్గీకరించాలన్నారు. భక్తులు వన దేవతలను ప్రశాంతంగా దర్శించుకుని తిరిగి అంతే ప్రశాంతంగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మేడారం జాతర పనులు త్వరితగతిన పూర్తికావడానికి జిల్లా కలెక్టర్లు, అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ట్రాఫిక్ జామ్ ,రూట్ క్లియరెన్స్ కోసం ప్రత్యేక నోడల్ అధికారులను నియమించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమ్మక్క సారక్క జాతర విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మేడారం జాతర ను ఈ సారి ప్లాస్టిక్ రహిత జాతరగా నిర్వహించాలని పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. జాతరలో పర్యావరణ పరిరక్షణకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. అటవీ ప్రాంతాన్ని సంరక్షించడం తో పాటు అటవీ జంతువులకు హాని కలగకుండా చూడాలన్నారు. స్నాన ఘట్టాల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. గిరిజన, ఆదివాసీ సంప్రదాయలకు అత్యంత ప్రాముఖ్యత ఇవ్వాలని దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. టూరిజం అభివృద్ధి చెందటానికి తగిన బస్సులను నడపాలన్నారు. జాతరలో దొంగతనాలు జరగకుండా పోలీస్ అధికారులు పటిష్ట నిఘా ఉంచాలన్నారు.

# 13 దేశాల ప్రతినిధులకు సిఎం ఆతిథ్యం

**సంక్షేమంతో పాటు తెలంగాణ యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు, దశాబ్ద కాలంగా దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒకవైపు ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూనే, రాష్ట్ర ఆర్థికరంగానికి పటిష్టమైన పునాదులు వేయడానికి పారిశ్రామికీకరణకు ప్రభుత్వం కార్యాచరణను అమలు చేస్తున్నది.**

- యాసా వెంకటేశ్వర్లు.

**అందులో** భాగంగా దావోస్ సదస్సుకు వెళ్ళడానికి ముందు జనవరి 10న హైదరాబాద్ లోని కుతుబ్ షాహీ టూంబ్‌ల వద్ద 13 దేశాల ప్రతినిధులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆతిథ్యం ఇచ్చారు. అమెరికా, ఇరాన్, తుర్కియే, యుఏఈ, యుకె, జపాన్, థాయిలాండ్, జర్మనీ, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, ఫిన్లాండ్ దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. ఆయా దేశాలతో మన దేశానికి, ముఖ్యంగా తెలంగాణకు శతాబ్దాల నుంచి ఆధ్యాత్మిక,



సాంస్కృతిక, విద్య, పర్యాటక, వాణిజ్య, పారిశ్రామిక సంబంధాలు ఉన్నాయి. అనేక దేశాలకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఎంబసీలు ఉన్నాయి. ప్రపంచ ఆర్థిక, పారిశ్రామిక రంగాలలో ఈ దేశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక గమనాన్ని నిర్దేశిస్తున్నాయి. జనవరి 15 నుంచి దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుకు ముందు ఈ దేశాల ప్రతినిధులకు వ్యూహాత్మకంగా ప్రభుత్వం అతిథ్యం ఇచ్చింది.

ఈ సందర్భంగా వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతం పలుకుతూ, తమ ప్రభుత్వం ప్రాధాన్యతలను వివరించారు. ఆయా దేశాలతో ఉన్న చారిత్రక అనుబంధాన్ని గుర్తుచేశారు. అభయహస్తం కింద అన్ని వర్గాల అభ్యున్నతికి

నూతనంగా ఏర్పాటు అయిన తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర సమర యోధులు మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ తదితర నేతల ఆశయాలను, మాజీ ప్రధాని ఇందిరా గాంధీనీ స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, పారదర్శకత్వంతో తమ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఆరు గ్యారంటీలతో సంక్షేమ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవిస్తుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఐ.టి. ఫార్మా, పారిశ్రామిక రంగాలలో తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలు గురించి వివరించారు. యువత భవిష్యత్తుకు, పారిశ్రామిక అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఇండస్ట్రియల్ ఫ్రెండ్లీ పాలసీతో వ్యవహరించనున్నట్లు తెలిపారు. పెట్టుబడులకు సంబంధించి ఉన్న అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయా దేశాలకు విజ్ఞప్తి చేశారు. అన్ని దేశాలతో సత్సంబంధాలు కొనసాగించటానికి తమ ప్రభుత్వం చిత్త శుద్ధితో ప్రయత్నిస్తుందని తెలిపారు. తెలంగాణను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ముందుకు రావాలని కోరారు. అందుకు తగిన సూచనలు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక ప్రణాళిక, విద్యుత్ శాఖా మంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఐటి, పరిశ్రమలు, వాణిజ్య, శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, హైదరాబాద్ రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ స్నేహజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు 'దూసన్'

## మంత్రి కోమటిరెడ్డిని కలిసిన కంపెనీ ప్రతినిధులు

**హైదరాబాద్‌కు మరో ప్రతిష్ఠాత్మక కంపెనీ రానున్నది. దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచ ఖ్యాతిగాంచిన కాస్మొటిక్ ఉత్పత్తుల సంస్థ దూసన్ 5వేల కోట్ల రూపాయల పెట్టుబడితో దేశంలోనే మొదటిసారిగా హైదరాబాద్‌లో కర్మాగారాన్ని స్థాపించనున్నది. ఆ సంస్థ ప్రతినిధి మూన్‌కీ ఈ విషయాన్ని వెల్లడించారు. సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వారు తమ పరిశ్రమ పెట్టుబడులపై సమగ్ర ప్రాజెక్టు రిపోర్టును అందించారు. కంబోడియా, వియత్నాం, చైనా దేశాలలో తమ సంస్థ 460 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టిందని తెలిపారు.**

తమ పరిశ్రమ స్థాపన ద్వారా ఎందరికి ఉద్యోగాలు లభిస్తాయి, స్థానికులకు ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి తదితర విషయాలను మంత్రికి సంస్థ ప్రతినిధులు వివరించారు. సుగంధ ద్రవ్యాలను, ఔషధ మొక్కలను రైతుల నుంచే కొంటామని, అందుకు రైతులను ఆయా పంటలు పండించే విధంగా ప్రోత్సహిస్తామని తెలి పారు. తాము తయారుచేసే ఉత్పత్తులను స్థానికంగా విక్ర యించడంతో పాటు విదేశాలకు కూడా ఎగుమతి చేస్తామ న్నారు. సంస్థ ప్రతినిధులతో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడు తూ, తాము పరిశ్రమలకు సింగిల్‌విండో పద్ధతుల్లో అనుమ తులు ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహాయ, సహకారాలు లభిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ పారిశ్రామిక పాలసీలు, ఇక్కడి వాతావరణం పరిశ్రమలకు ఎంతో అనుకూలంగా ఉన్నాయని వివరిం చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశం ఏర్పాటు చేయించి కంపెనీకి అనుమతులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.



# మూసివేసిన బడులను తెరిపించాలి

**తెలంగాణలోని ప్రతి పంచాయతీలో బడి ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బడి లేని పంచాయతీ తెలంగాణలో ఉండొద్దని సచివాలయంలో జరిగిన విద్యాశాఖ సమీక్షలో అన్నారు.**

**'రాష్ట్రంలో** ఎంత చిన్న గ్రామమైనా, మారుమూల తాండా అయినా తప్పకుండా ఒక ప్రభుత్వ పాఠశాల ఉండాల్సిందే. ఏ ఒక్క బాలుడు గానీ, బాలిక గానీ చదువు కోసం ఇతర గ్రామాలకు, పట్టణాలకు పోయే పరిస్థితి ఉండొద్దు. విద్యార్థులు లేరనే నెపంతో మూసివేసిన అన్ని పాఠశాలలను తెరిపించాలి. ఎంతమంది పిల్లలున్నా ప్రభుత్వ పాఠశాలను నడపాల్సిందే' అని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

దీనికోసం వెంటనే మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల భర్తీకి చర్యలను తీసుకోవాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడానికి డీఎస్సీ నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 'మన ఊరు, మన బడి' కార్యక్రమంలో జరిగిన పనుల పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంకా మిగిలిపోయిన పనులన్నింటినీ పూర్తి చేసి, రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను ఉత్తమ పాఠశాలలుగా తీర్చిదిద్దాలన్నారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలలో ఉన్న అవాంతరాలపై దృష్టిసారించాలని సిఎం రేవంత్ ఆదేశించారు. బదిలీల అంశంలో ఉన్న అవాంతరాలను, అభ్యంతరాలను అధిగమించడానికి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరపాలని, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. విద్యాలయాల విద్యుత్ బిల్లులకు సంబంధించి కేటగిరి మార్పునకు తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ సూచనలను చేశారు. విద్యాలయాలకు వ్యాపార, పారిశ్రామిక కేటగిరి కింద బిల్లులు వసూలు చేయడంపై తగిన ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. పాఠశాలల్లో స్వీపర్లు, పారిశుధ్య కార్మికులను ఏర్పాటుచేయడానికి ఉన్న మార్గాల గురించి అధికారులకు తగిన ఆదేశాలను జారీ చేశారు.

### ఉమ్మడి జిల్లాకో స్కిల్ యూనివర్సిటీ

రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల్లో స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. డా.బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో విద్యా శాఖకు చెందిన పలు అంశాలపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఎం మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రారిశ్రామిక అవసరాలకు కావాల్సిన నైపుణ్యంగల ఉద్యోగాలను సాధించేవిధంగా ఈ స్కిల్ యూనివర్సిటీలు ఉండాలని అన్నారు. వీటిలో ఉపాధి ఆధారిత స్వల్పకాల, దీర్ఘ కాల కోర్సులను ప్రవేశ పెట్టాలని పేర్కొన్నారు. ఈ విషయంలో గుజరాత్, హర్యానా, రాజస్థాన్, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఉన్న ఈ విధమైన స్కిల్ యూనివర్సిటీలని అధ్యయనం చేయాలన్నారు. కొడంగల్ నియోజక వర్గంతో పాటు తొమ్మిది జిలాల్లో ఈ స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఇందుకుగాను, విద్యా శాఖ, పరిశ్రమల శాఖ, కార్మిక శాఖల కార్యదర్శులతో ప్రత్యేక కమిటీ వేసి తగు ప్రతిపాదనలను సమర్పించాలని సి.ఎస్‌ను ఆదేశించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రో.లింబాద్రి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ దేవసేన, సి.ఎం.ఓ అధికారులు శేషాద్రి, షా-నవాజ్ ఖాసీం తదితర అధికారులు హాజరయ్యారు.

# ఈ - రేస్ అక్రమం నిష్ప్రయోజనం

**సెక్రెటేరియట్ బిజినెస్ రూల్స్ ప్రకారం ఏవిధమైన ముందస్తు అనుమతులు లేకుండా నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్ ఒప్పందం, నిర్వహణపై న్యాయపరంగా ముందుకు వెళ్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సచివాలయంలోని మీడియా సెంటర్‌లో పాత్రికేయుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. హైదరాబాద్‌లో గతేడాది నిర్వహించిన ఫార్ములా ఈ రేసింగ్ ఒప్పందానికి సంబంధించి ప్రస్తావిస్తూ, ఆ ఈవెంట్ అనేది ఓ కంపెనీకి లబ్ధి చేకూర్చడం కోసమే పెట్టారని అన్నారు.**

ఈ రేస్ వలన హైదరాబాద్‌కు ఏవిధమైన లాభం లేదని, పైగా ప్రభుత్వ నిధులను అప్పనంగా ఒక ప్రయివేటు సంస్థకు కట్టబెట్టారని అన్నారు. గత ప్రభుత్వం ఏవిధమైన విధి విధానాలు పాటించకుండా, రాష్ట్ర ప్రభుత్వంతో ఏవిధమైన ముందస్తు ఒప్పందం జరుపకుండా, వ్యాపార సూత్రాలకు విరుద్ధంగా ఓ కంపెనీకి లబ్ధి చేయడం కోసమే ఫార్ములా రేసు నిర్వహించారని అన్నారు. ఈ రేసు నిర్వహణకు రూ.110 కోట్లు అక్రమంగా చెల్లించారని అన్నారు. తాము ఫార్ములా ఈ-రేసు రద్దు చేయడంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రభుత్వంపై ప్రజలకు ఎన్నో ఆశలు ఉన్నాయని, ప్రతిపైసా ప్రజల అవసరాల కోసం మాత్రమే తాము ఖర్చు చేస్తామని వివరించారు. సెక్రెటేరియట్ బిజినెస్ రూల్స్ ప్రకారం ఫార్ములా ఈ-రేస్‌కు అనుమతి లేదని భట్టి విక్రమార్క అన్నారు. వాళ్లు ఎవరో హైదరాబాద్‌కు వచ్చి వెళ్లడానికి రూ.100 కోట్లు కట్టాలా? అని ప్రశ్నించారు. ఇది బిజినెస్ రూల్స్‌కు విరుద్ధమైనదని భట్టి అన్నారు. ప్రతి పైసా రాష్ట్ర ప్రజల అవసరాల కోసం ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. ఫార్ములా ఈ రేస్ నిర్వహించడం వల్ల రాష్ట్రానికి ఎలాంటి ఆదాయం ఉండదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఒప్పందం ప్రకారం ప్రభుత్వం ట్రాక్ సదుపాయం కల్పించాలని అన్నారు.

## అభయ హస్తం సక్సెస్

ప్రజా పాలన 'అభయ హస్తం' దరఖాస్తుల స్వీకరణ రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి చిన్న సంఘటన లేకుండా చాలా పకడ్బందీగా నిర్వహించామని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహాలక్ష్మి పథకం ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు కోట్లాది మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా లబ్ధి పొందారని వివరించారు. ప్రజా భవన్‌లో ఎవరైనా ప్రతి రోజు ఉదయం 8.30 నుంచి 9.30 వరకు కలవ వచ్చని స్పష్టం చేశారు. సంపద సృష్టిస్తామని, సృష్టించిన సంపదను ప్రజలకు పంచుతామని డిప్యూటీ సి.ఎం తెలిపారు.




# "జయ జయహే తెలంగాణ"

దాదాపు మూడు సంవత్సరాల తర్వాత దేశరాజధాని ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలలో తెలంగాణ శకటం ప్రదర్శనకు చోటు దక్కింది. అంతేకాదు, ఈ సంవత్సరంతో పాటు వచ్చే మరో రెండేళ్ల పాటు వరుసగా తెలంగాణ శకటాన్ని ప్రదర్శించే అవకాశం, అనుమతి లభించాయి. ఈ సారి 'జయ జయహే తెలంగాణ' అనే మకుటంతో తెలంగాణ శకటాన్ని ప్రదర్శించడం జరిగింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహా, సూచనల మేరకు, స్వీయ పాలన, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమ స్ఫూర్తిని ప్రపంచానికి మరోసారి చాటి చెప్పే విధంగా శకటాన్ని రూపొందించడం జరిగింది. ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల తోడ్పాటుతో అతి స్వల్ప సమయంలో శకటాన్ని రూపొందించడానికి మార్గం సుగమమైంది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2015 అటు పిమ్మట 2020 సంవత్సరాలలో శకటాన్ని ప్రదర్శించే అవకాశం వచ్చింది. ఆ తర్వాత ఈ సంవత్సరమే తెలంగాణ శకటానికి మరోసారి అవకాశం దక్కింది.

ఈసారి శకటాన్ని, నిరంకుశ విధానాలు, రాజరిక, ఫ్యూడల్ వ్యవస్థలకు వ్యతిరేకంగా తెలంగాణాలో జరిగిన ప్రజా ఉద్యమాలకు ప్రతీకగా తీర్చిదిద్దడం జరిగింది. దీనిలో భాగంగా కొమరం భీం, రాంజీ గోండు, చాకలి ఐలమ్మ తదితర పోరాట యోధులు ఎందరో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా స్వయం పాలన, ప్రజాస్వామ్య పరిరక్షణకై తమ తమ పంథాలో చేసిన పోరాటాలను గుర్తుకుతెచ్చే విధంగా శకటాన్ని తీర్చిదిద్దారు.

-ఎన్.వి. రావ్

# బీసీల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా బీసీలకు విద్య, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ పనితీరుని, ప్రస్తుతం ఉన్న గురుకుల విద్యాలయాలు, బీసీ కార్పొరేషన్ రుణాలు, ఆత్మగౌరవ భవనాలు, ఫెడరేషన్లకు సంబంధించిన అనేక విషయాలను ఈ సమావేశంలో మంత్రి సమీక్షించారు.

సంక్షేమాన్ని ప్రజలకు అందించటం ఒక అదృష్టంగా భావించి అధికారులందరూ బీసీల సామగ్రాభివృద్ధి కోసం, నిరుపేదలైన బీసీ ప్రజల సంక్షేమం, వారిని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడం కోసం నిబద్ధతతో పని చేయాలని మంత్రి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు విద్యా ఉపాధి అవకాశాలు కల్పించడానికి అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచించారు. బీసీ సంక్షేమ శాఖలోని హాస్టళ్ళల్లో విద్యార్థుల సంఖ్య, అవసరమైన నిధులు, వసతుల గురించి, రాష్ట్రం లోని స్టడీ సర్కిల్స్‌లో ఇస్తున్న కోచింగ్ గురించి ఈ సమావేశంలో సమీక్షించారు. గురుకుల పాఠశాలల పనితీరు, విద్యార్థులు సాధిస్తున్న ఉత్తీర్ణత శాతం గురించి మంత్రి సమీక్షించారు. సచివాలయంలో నిర్వహించిన ఈ సమీక్ష సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం ఐఏఎస్, అడిషనల్ సెక్రెటరీ పద్మ, ఎంబీసీ సీఈఓ అలోక్ కుమార్, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య బట్టు, చంద్రశేఖర్, సంధ్య, విమల, శ్రీనివాస్ రెడ్డి, మద్దిలేటి, మంజుల, ఉదయ్ ప్రకాష్, తిరుపతి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# 'పునాస' త్రైమాసిక సాహిత్య పత్రిక ఆవిష్కరణ

తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ సాహిత్య అకాడమీ నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాలలో భాగంగా సాహితీవేత్తల కోసం ప్రత్యేకంగా 'పునాస' అనే సాహిత్య పత్రికను ప్రచురించడం శుభపరిణామం అని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన చాంబర్‌లో తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించిన 'పునాస' త్రైమాసిక సాహిత్య పత్రికను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. తెలుగు సాహిత్యంలో సృజనశీలతను ప్రతిబింబించే లక్ష్యంతో తెలంగాణ సాహిత్య అకాడమీ పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ పత్రికలో అనేకమంది సాహిత్యకారులు రచించిన వ్యాసాలు, కథలు, కవిత్వంతో పాటు అనేక పుస్తకాల సమీక్షలు ప్రచురిం చడం బాగుందన్నారు. రాష్ట్రంలో రచయితలు కవులు ఎంతో మంది ఉన్నారని, వారి నుంచి మరిన్ని రచనలు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ , పర్యాటక శాఖ ఎండీ రమేష్ నాయుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారి, సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. మామిడి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# త్వరలో కులగణన

- నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్
- గురుకులాల సొంత భవనాలకు స్థలాల గుర్తింపు
- గ్రీన్ ఛానల్ ద్వారా డైట్, కాస్మోటిక్ ఛార్జీల చెల్లింపు
- విదేశాలకు వెళ్లే విద్యార్థులకు మరింత ప్రయోజనం
- బీసీ, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ విభాగాల సమీక్షలో సిఎం

**త్వరలోనే రాష్ట్రంలో కుల గణన చేపడతామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తమ ప్రభుత్వం ఈ నిర్ణయానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కుల గణనకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ విభాగాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో అద్దె భవనాల్లో ఉన్న సంక్షేమ గురుకుల పాఠశాలలకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని సూచించారు. వీటికి సొంత భవనాలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన భవనాల నిర్మాణానికి సరిపడే స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో స్కూల్ నిర్మాణానికి ఎంత ఖర్చవుతుందో అంచనా వేసి బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అన్నారు.**

ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఇచ్చే డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు, వంట బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు చేయాలని అన్నారు. మహాత్మ జ్యోతిభాపూలే ఓవర్ సీస్ స్కాలర్ షిప్ స్కీమ్ ను మరింత సమర్థంగా అమలు చేయాలని సిఎం ఆదేశించారు. ఇప్పుడున్న దానికంటే ఎక్కువ మంది అర్హులైన విద్యార్థులకు మేలు జరిగేలా చూడాలని అన్నారు. విదేశాల్లో ఉన్న యూనివర్సిటీల ర్యాంకింగ్‌ల ఆధారంగా టాప్ యూనివర్సిటీలను గుర్తించి ఫ్రేమ్ వర్క్ తయారు చేయాలని అన్నారు. వాటిలో చదివేందుకు వెళ్లే విద్యార్థులకు ఈ స్కీమ్ లో మొదటి ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థలన్నీ వేర్వేరు చోట్ల విడివిడిగా కాకుండా ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని సిఎం అన్నారు. నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ హబ్ నిర్మించే ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అన్నారు. దీంతో స్కూళ్ల నిర్వహణ, పర్యవేక్షణ, అజమాయిషీ కూడా మరింత మెరుగ్గా చేసే వీలుంటుందని అన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదువుకోవటం ద్వారా వారిలో ప్రతిభా పాటవాలు పెరుగుతాయని, పోటీతత్వం పెరుగుతుందని సిఎం అభిప్రాయపడ్డారు. వెంటనే అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఎడ్యుకేషన్ హబ్‌ల నిర్మాణానికి సరిపడే స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రంలో వీలు కాకుంటే ప్రత్యామ్నాయంగా అదే సెగ్మెంట్లో మరో పట్టణం లేదా, మండల కేంద్రాలను ఎంచుకోవాలని సూచించారు. ఇప్పటికే 20 ఎకరాలకుపైగా విస్తీర్ణమున్న స్కూల్ ప్రాంగణాల్లో మిగతా భవనాలు నిర్మించి హబ్‌గా తీర్చిదిద్దే అవకాశాలుంటే పరిశీలించాలని అన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌ల నిర్మాణానికి కార్పొరేట్ సంస్థల, కంపెనీల సహకారం తీసుకోవాలని సిఎం అన్నారు. సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ) ఫండ్స్‌ను సమీకరించాలని, ముందుకు వచ్చే దాతల నుంచి విరాళాలు స్వీకరించి ఈ భవన నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు ఇచ్చే దుప్పట్లు, నోట్ బుక్స్, యూనిఫామ్స్, పుస్తకాలకు కూడా సిఎస్ఆర్ ద్వారా నిధులు సమీకరించాలని సూచించారు.

### నగదుతో పాటు తులం బంగారం

కళ్యాణమస్తు, షాదీ ముబారక్ లబ్ధిదారులకు నగదుతో పాటు తులం బంగారం అందించేందుకు అంచనా బడ్జెట్‌ను రూపొందించాలని సిఎం ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పుడున్న బీసీ స్టడీ సర్కిళ్లను ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం యూనిట్ గా ఏర్పాటు చేసే అంశంపై అధ్యయనం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పాల్గొన్నారు.



# నల్గొండ సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి చర్యలు

## సాగునీటి సమీక్షలో అధికారులను ఆదేశించిన మంత్రులు

**నల్గొండ జిల్లా రైతాంగానికి సాగునీళ్లు అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సాగు నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డా.బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఇరిగేషన్ మంత్రిఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన సమీక్షలో.. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను త్వరతగతిన పూర్తిచేసేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి ఇద్దరు మంత్రులు అధికారులకు దిశానిర్దేశం చేశారు.**

గత ప్రభుత్వంలో నల్గొండ సాగునీటి ప్రాజెక్టులకు తీరని అన్యాయం జరిగిందన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. మెజారిటీ పనులు పూర్తయిన ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టును కూడా నిర్లక్ష్యం చేసి వదిలేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను స్వయంగా ఎన్నోసార్లు ఈ ప్రాజెక్టు గురించి అసెంబ్లీలో మాట్లాడినా ఆనాటి ముఖ్యమంత్రి కనీసం స్పందించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నల్గొండ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో ఉంది. జిల్లాకు చెందిన ఉత్తమ్ కుమార్ రెడ్డి సాగునీటి పారుదల శాఖ మంత్రిగా ఉండటం జిల్లా ప్రజల అదృష్టమని ఆయన అన్నారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లా డుతూ.. లక్ష ఎకరాలకు సాగునీరు అందించే ఉదయసముద్రం, బ్రాహ్మణ వెల్లముల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కెనాల్స్‌తో పాటు, పెండింగ్‌లో ఉన్న ఎస్ ఎల్‌బిసి టన్నెల్ పనులను యుద్ధప్రతిపాదికన చేపట్టి పూర్తి చేయాలి. గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఎస్ఎల్‌బిసి కాలువలను పూర్తిచేసినప్పటికి బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం మెయింటెనెన్స్ కూడా చేయలేదు. ఎస్ఎల్‌బిసి కాలువలకు, వరద కాలువకు గత 10 సంవత్సరాల నుంచి మెయింటెనెన్స్ లేకపోవడంతో చెట్లు, పూడిక పెరిగింది. వీటికి మరమ్మతులు చేపట్టాలి, బెడ్ మరియు సైడ్స్ లైనింగ్ పనులను ఈ సంవత్సరంలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అధికా రులను ఆదేశించారు.

ఉదయ సముద్రం ప్రాజెక్టు క్రింద మొదటిదశలో 50 వేల ఎకరాలకు, రెండవ దశలో మరో 50 వేల ఎకరాలకు భూసేకరణ చేపట్టడం, కాలువలను తవ్వే పనులను పూర్తి చేసి లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీళ్లు అందించేలా ప్రణాళికలు రూపొందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి నల్గొండ జిల్లా ప్రాజెక్టుల పట్ల సానుకూలంగా ఉన్నారు. ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు కావల్సిన సహకారం అందిస్తామని వారు చెప్పారు. ఉదయ సముద్రం మొదటి దశ భూసేకరణకు సుమారు 100 కోట్లను, అలాగే పనులకు గాను మరో 100 కోట్లను త్వరితగతిన విడుదల చేస్తామని, అధికారులు అవిశ్రాంతంగా శ్రమించి యేడాదిలో మొదటి దశను పూర్తి చేసి 50 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని మంత్రులిద్దరు అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, ఈఎన్‌సీ మురళీధర్ రావు, ఛీఫ్ ఇంజనీరు అజయ్ కుమార్, డిప్యూటీ ఈఎన్‌సీ జనరల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# మే నెలాఖరు కల్లా సీతారామ కాలువల పనులు పూర్తి

**ఈ ఏడాది మే నెలాఖరు కల్లా సీతారామ ప్రాజెక్టు కాలువల పనులన్నీ పూర్తి చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్ష సందర్భంగా సీతారామ పనుల పురోగతి, చేపట్టాల్సిన కార్యాచరణపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మంత్రి తుమ్మల పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు సాగు నీరందించే ఉద్దేశంతో చేపట్టిన సీతారామ ప్రాజెక్టుపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా పాల్గొన్నారు.**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న సీతారామ ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలుజారీ చేశారు. అనుకున్న స్థాయిలో పనుల్లో వేగం పెంచి ఈ ఏడాదిలోనే వైరా ప్రాజెక్టు, లంకా సాగర్, ఎన్ఎస్‌పి ఆయకట్టులోని సుమారు లక్షా 60 వేల ఎకరాలకు సాగు నీరు అందించే విధంగా పనులు పూర్తి చేయాలి. ఇప్పటికే ప్రాజెక్టుకు సుమారు రూ.7500 కోట్లు ఖర్చు చేశారని అన్నారు. సీతారామ ప్రాజెక్టు కు సంబంధించి మూడు పంప్ హౌజ్‌లు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. ఏన్కూరు వద్ద లింకు కెనాల్ పనులకు టెండర్లు పూర్తి చేసి పనులు మొదలుపెట్టి వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సుమారు రూ.70 కోట్లతో ఈ పనులు పూర్తి చేస్తే వచ్చే సీజన్‌లోనే వైరా ప్రాజెక్టు, లంకాసాగర్, బేతుపల్లి పరిధిలో ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉందన్నారు.

ఇటీవల గండుగులపల్లిలో జరిగిన సమావేశంలో సమీక్షించిన అంశాలను ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి మంత్రి తుమ్మల తీసుకెళ్లగా, సంబంధిత పనులను దశల వారీగా ప్రాధాన్యతను బట్టి పూర్తిచేసి మే నెలాఖరు కల్లా పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. యాతాలకుంట భూసేకరణ పూర్తయితే సత్తుపల్లి టన్నెల్ ద్వారా లంకాసాగర్, బేతుపల్లి కెనాల్ కు ఈ సీజన్ లోనే సాగునీరు అందించే అవకాశం ఉందని తుమ్మల తెలిపారు. సీతారామ కాలువల పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మే నెలాఖరు కల్లా అన్ని ప్రాంతాల్లో కాలువల నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఏన్కూరు వద్ద కాలువ పనులు పూర్తి చేస్తే, అక్కడి నుంచి వైరా ప్రాజెక్టుకు లింకు కెనాల్ కలిపే పనులు చేపట్టవచ్చుని, ఈ పనులకు సంబంధించి వెంటనే టెండర్లు ఆహ్వానించాలని నీటి పారుదల శాఖ అధికారులకు మంత్రి తుమ్మల సూచించారు.

ఈ పనులు పూర్తయితే, సీతారామ ద్వారా ఎన్ఎస్‌పి ఆయకట్టుకు నీరు అందించేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. లింకు కెనాల్ పనులు పూర్తి చేస్తే వైరా రిజర్వాయర్ తోపాటు లంకాసాగర్‌కు నీరు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. సత్తుపల్లి ట్రంకు కెనాల్ కు సంబంధించి భూ సేకరణకు చెల్లించాల్సిన రూ.12కోట్లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణ నిధులు చెల్లించి వెంటనే పనులు చేపడితే యాతాలకుంట ట్రంకు పనులు పూర్తి చేయవచ్చని సూచించారు. అదేవిధంగా పాలేరు టన్నెల్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాలేరు టన్నెల్ ద్వారా పాలేరు రిజర్వాయర్ కు సైతం నీరు అందించే అవకాశం ఉంటుందని అధికారులకు సూచించారు. పై పనులన్నీ పూర్తి చేస్తే వైరా రిజర్వాయర్ కింద లక్షా 60 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించవచ్చని మంత్రి తుమ్మల అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.



## సాంకేతిక పరిజ్ఞానం..

# ఉన్నత ప్రమాణాలతో ఐటీఐలు

కాలం చెల్లిన కోర్సులకు మంగళం...
ఉపాధి కల్పించే కోర్సులకు శ్రీకారం

టాటా టెక్నాలజీ సంస్థ ప్రతినిధులతో
సిఎం రేవంత్ రెడ్డి సమావేశం

రాష్ట్రంలో రూ. 2 వేల కోట్ల వ్యయంతో
స్కిల్ డెవలప్‌మెంట్‌కు టాటా అంగీకారం

**ప్రపంచంతో పోటీపడే విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణ యువతకు అందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. రాష్ట్రంలో యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ ఇవ్వడంద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి దేశంలోని ప్రముఖ సంస్థ టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు.**

**రాష్ట్రంలోని** ప్రభుత్వ ఐటీఐలలో ఉన్నత ప్రమాణాలతో కూడిన ఆధునిక కోర్సులను ప్రవేశపెట్టాలని ఆయన సూచించారు. తెలంగాణలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. దీనికి అనుగుణంగా సాంకేతిక కోర్సులను పూర్తిచేసిన వెంటనే ఉద్యోగం, ఉపాధి, స్వంతంగా పరిశ్రమలను ఏర్పాటుచేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి అవసరమైన కోర్సులను ప్రవేశపెట్టాలని ఈ సమావేశంలో పాల్గొన్న టాటా సంస్థ ప్రతినిధులకు, అధికారులకు రేవంత్ రెడ్డి సూచించారు. కాలం చెల్లిన కోర్సులతో యువత సమయాన్ని, విద్యను వృథా చేయకుండా ఆధునాతన కోర్సుల్లో శిక్షణకోసం చర్యలు తీసుకోవాలన్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాలుగా సహకరిస్తుందన్నారు.

రాష్ట్రంలోని 50 ప్రభుత్వ ఐ.టీ.ఐలలో రూ. 1500 నుండి 2000 కోట్ల రూపాయలతో ఉపాధి ఆధారిత పారిశ్రామిక శిక్షణ అందించడానికి టాటా టెక్నాలజీస్ ముందుకు రావడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతించారు. రాష్ట్రంలో 4.0 స్కిల్లింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు వాటి నిర్వహణకు కావాల్సిన మెషినరీ, పరికరాలను, సాఫ్ట్ వెర్ ను టాటా సంస్థ అందిస్తుంది. కాగా, రాష్ట్రంలో దాదాపు ఒక లక్ష మంది





విద్యార్థులు శిక్షణ పొంది పలు పరిశ్రమలలో ఉద్యోగాలు పొందే విధంగా తగు శిక్షణ అందించడానికి టాటా సంస్థ ముందుకు రావడాన్ని సి.ఎం రేవంత్ రెడ్డి స్వాగతించారు. టాటా సంస్థతో తమ ప్రభుత్వం కలసి పనిచేస్తున్నదని, ఇందుకు కావాల్సిన ఏర్పాట్లను అందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు గాను కావాల్సిన ఎం.ఓ.యును కుదుర్చుకోవడానికి ఉన్నతాధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సి.ఎస్.ను కోరారు.

యువతకు ఇండస్ట్రియల్ ఆటోమేషన్, రోబోటిక్స్ తయారీ, అధునాతన సి.ఎన్.సి మెషినింగ్ టెక్నీషియన్, ఈవీ మెకానిక్, బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫైయర్ లాంటి 4.0 పరిశ్రమ ఆధారిత కోర్సుల్లో తగు నైపుణ్యాన్ని ప్రభుత్వ ఐటీఐలలో అందించడానికి టాటా సంస్థ ముందుకు రాగా సి.ఎం ఇందుకు అంగీకరించారు. 4.0 పరిశ్రమ కోర్సుల నిర్వహణకు అవసరమైన యంత్రాలు, సాఫ్ట్‌వేర్ అందించడంతో పాటు ప్రతీ ఐటీఐలో ఇద్దరు మాస్టర్ ట్రెయినర్లను టాటా సంస్థ అందిస్తుంది. ఈ ప్రాజెక్టును ఐదేళ్ల పాటు టాటా సంస్థ ఉచితంగా అందిస్తుంది. దీనిలో భాగంగా ఆధునిక సాంకేతిక వర్క్ షాపులు, అత్యధిక డిమాండ్ కలిగిన తయారీ రంగంలో ఉపాధికల్పించడానికి 22 నూతన స్వల్పకాలిక, 5 దీర్ఘకాలిక కోర్సులను పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ ప్రాజెక్ట్ లో టాటా సంస్థ అందిస్తుంది.

ఇప్పటికే, ఎం.ఓ.యు విధివిధానాలు ఖరారు చేయడానికి రాష్ట్ర ఉపాధికల్పన, కార్మిక శాఖ టాటా టెక్నాలజీతో సంప్రదింపులు జరుపుతోంది. దీని ఆధారంగానే రాష్ట్రంలో 50 ప్రభుత్వ ఐటీఐలను గుర్తించడం జరిగిందని అధికారులు తెలియచేశారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, కార్మిక, ఉపాధికల్పన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని, ఐ.టి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సి.ఎం.ఓ అధికారులు శేషాద్రి, షానవాజ్, అజిత్ రెడ్డిలతో పాటు టాటా టెక్నాలజీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పీ.వీ.కొల్హద్, గ్లోబల్ హెడ్ వైస్ ప్రెసిడెంట్ సుశీల్ కుమార్ సమావేశంలో పాల్గొన్నారు.

## జనావాసాలకు దూరంగా
# డంప్ యార్డులు

**హైదరాబాద్ చుట్టూ నాలుగువైపులా నాలుగు డంప్ యార్డులను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ డంప్ యార్డుల వల్ల ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.**

**ప్రస్తుతం** హైదరాబాద్ నగరానికంతటికి జవహర్ నగర్‌లో ఒకే డంప్ యార్డు వున్నది. ప్రతిరోజు సుమారు 8వేల టన్నుల చెత్తను జవహర్ నగర్ డంప్ యార్డుకు చేరవేయడం జరుగుతున్నది. డంప్‌యార్డ్ వల్ల వాయు కాలుష్యం, దుర్గంధం వంటి వాటితో చుట్టు ప్రక్కల వుండే ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. కాలుష్యాన్ని తగ్గించే విధంగా సిటీకి దూరంగా గతంలో శంషాబాద్, మెదక్ వైపు డంప్ యార్డు సైట్‌లను పరిశీలించామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిశీలించి ప్రజలకు ఇబ్బందికరంగా లేకుండా ఏర్పాటు చేయాలన్నారు. చెత్త ద్వారా 15 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని, ఇందుకుగాను టిఎస్ఎస్పీడీసిఎల్‌తో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. చెత్తను సాధ్యమైనంతవరకు రీసైకిల్ చేయాలని అన్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలందిస్తామన్నారు.

### మెట్రో రైల్

సిఐఐ ప్రతినిధుల సమావేశంలో మెట్రో రైల్ రూట్ విస్తరణపై జరిగిన చర్చల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోమారు స్పష్టతను ఇచ్చారు. గతంలో గచ్చిబౌలి – ఎయిర్ పోర్టు వరకు 32 కిలోమీటర్ల మేర ప్రణాళికలు రూపొందించారని, దానివల్ల సామాన్య జనాలకు పెద్దగా ఉపయోగం లేదని, గచ్చిబౌలి, జూబ్లిహిల్స్ చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో అధికంగా ధనికులు వుండటం వల్ల వారు ఎక్కువగా స్వంత వాహనాలు వాడుతున్నారని అన్నారు. గతంలో సర్వే చేసిన గౌలిగూడ – ఫలక్‌నుమా – ఏయిర్ పోర్టు రూట్, ఎల్బీ నగర్ నుంచి ఎయిర్ పోర్టు రూట్‌ను ప్రజలు ఎక్కువగా వినియోగించుకునేందుకు అవకాశాలు వున్నాయని అన్నారు. ఈ ప్రాంతాల నుంచి అరబ్ దేశాలకు అధికంగా వెళుతుంటారని, విదేశాలకు వెళ్లే వారి కుటుంబాలు ఎయిర్ పోర్టుకు వెళ్లి సెండాఫ్ ఇస్తుంటారని అందుకే ఈ రూట్ చాలా వినియోగకరంగా వుంటుందని సిఎం అభిప్రాయపడ్డారు.




# ఆరు గ్యారంటీల అభయ'హస్తం'



- మాశర్మ

**ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపించి, ఇంటింటా సౌభాగ్యాన్ని నింపాలనే మహాసంకల్పంతో భారత జాతీయ కాంగ్రెస్ 'మేనిఫెస్టో' మహానిర్మాణం రూపుదాల్చుకుంది.2023 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ మేనిఫెస్టోలో 36 అంశాలను పొందుపరిచినా, ఆరు గ్యారంటీలు అగ్రగామిగా నిలుస్తున్నాయి. తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకోడానికి దోహదపడిన ప్రధాన అంశాల్లో ఆరు గ్యారంటీల పాత్ర కీలకమైంది.**

**ఈ** ఆరు గ్యారంటీలను ప్రకటించిన నాడే ఈ అంశంపై దేశవ్యాప్తంగా పెద్ద చర్చ జరిగింది.అనేక రాష్ట్రాలు దీని వైపు ఆసక్తిగా చూశాయి. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవాల్సిన రాష్ట్రాలు మరింత శ్రద్ధ, ఆసక్తితో గమనించాయి, గమనిస్తున్నాయి. ఆరు గ్యారంటీలపై తెలంగాణ ప్రజలు అత్యంత విశ్వాసంతో వున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే తమ ఓటు వేసి, అధికారపీఠంపై కూర్చోపెట్టారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన అనేది దశాబ్దాల పాటు కలగానే

మిగిలిపోయిన తరుణంలో, ఆనాడు కేంద్రంలో అధికారంలో వున్న కాంగ్రెస్, ముఖ్యంగా చైర్ పర్సన్ సోనియాగాంధీ సంపూర్ణ సహకారంతోనే ఆ కల సాకారమైంది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఇది చరిత్ర. ఈ చరిత్ర పుటల్లో కాంగ్రెస్‌తో పాటు, సోనియాగాంధీ కూడా తమ స్థానాన్ని విశిష్టంగా కైవసం చేసుకున్నారు. తెలంగాణ భావోద్వేగాలకు పెద్దపీట వేసిన కాంగ్రెస్‌కు, సోనియాగాంధీకి తెలంగాణ నేలపై దక్కాల్సిన గుర్తింపు, గౌరవం నేటి గెలుపుతో దక్కాయి. దక్షిణాదిలో కర్ణాటకతో పాటు తెలంగాణ కూడా జత కలవడంతో పార్టీ రెట్టింపు ఉత్సాహంతో వుంది. ఉత్తరాదిలో హిమాచల్ ప్రదేశ్ గెలుపుతో కాంగ్రెస్ కు మంచిరోజులు మొదలయ్యాయి. ఆ తర్వాత కర్ణాటక, నేడు తెలంగాణ ప్రజలు 'హస్తా'నికి ప్రేమహస్తాన్ని, విజయబావుటాను అందించారు. దక్షిణాదిలో బలోపేతమవడానికి తెలంగాణ గెలుపు పెద్ద ఊతాన్నిచ్చింది. నైతికబలాన్ని పెంచింది.

"ఇందిరమ్మ రాజ్యం" అనే మాట తెలుగునేలపై మారు మోగుతుంది. స్వాతంత్ర్యానంతర ఎన్నికల భారతంలో, తెలుగు ప్రజలు కాంగ్రెస్ పట్ల, ఇందిరాగాంధీ పట్ల ప్రత్యేకమైన ప్రేమను అనేక సందర్భాల్లో చాటుకున్నారు. 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని 42 స్థానాల్లో 41 స్థానాల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. దేశాన్ని కుదిపేసిన ఎమర్జెన్సీ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఇంతటి ప్రభంజనాన్ని కాంగ్రెస్‌కు అందించినవారు తెలుగువారు. 2009 ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికల గెలుపుతో పాటు, లోక్ సభ ఫలితాలలో 42 స్థానాలకు గాను 33 చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులే గెలిచారు. ఇదొక ఘన విజయం. ఈ గొప్ప గెలుపులో వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి పాత్ర కీలకమైంది. 2014లో తెలుగు రాష్ట్రాలు రెండుగా విడిపోయాయి. ఈ నేపథ్యంలో, రేవంత్ రెడ్డి నాయకత్వంలోకి వచ్చాక, పార్టీ రాష్ట్రంలో బాగా బలపడింది. ఇందిరమ్మ రాజ్యాన్ని సుస్థాపితం చేసే దిశలో భాగంగా తెలంగాణలో పెద్ద అడుగులు పడుతున్నాయి. ఆరు గ్యారంటీలు ఆరోప్రాణంగా నిలుస్తున్నాయి. మహాలక్ష్మి పథకం 'గేమ్ ఛేంజర్'గా ప్రత్యేకతను చాటుకుంటోంది. అన్నింటి కన్నా మిన్నగా కనిపిస్తున్న ఆరు గ్యారంటీల గురించి మాట్లాడుకుందాం. మహాలక్ష్మి, రైతుభరోసా ప్రతి ఏటా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్ళు, యువ వికాసం, చేయూత...

## ఇవే ఆరు గ్యారంటీలు.

**మహాలక్ష్మి :** మహిళలకు ప్రతి నెల రూ. 2,500, రూ. 500లకే గ్యాస్ సిలెండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం.

**రైతు భరోసా ప్రతి ఏటా:** రైతులకు,కౌలు రైతులకు ఎకరానికి రూ. 15వేలు,వ్యవసాయ కూలీలకు రూ. 12వేలు, వరి పంటకు క్వింటాలుకు రూ. 500 బోనస్.

**గృహజ్యోతి :** ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్.

**ఇందిరమ్మ ఇళ్ళు :** ఇల్లులేని వారికి ఇంటి స్థలం -రూ. 5లక్షలు,ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం.

**యువ వికాసం :** విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్.

**చేయూత :** రూ. 4వేల నెలసరి పించను, రూ. 10లక్షల రాజీవ్ ఆరోగ్య బీమా.

ప్రతి రాజకీయ పార్టీ కూడా ఎన్నికల ముందు 'మేనిఫెస్టో'ను ప్రకటించడం చాలా సహజమైన అంశం. కానీ,మేనిఫెస్టోలో పొందుపరిచిన అన్ని అంశాలను పూర్తిగా అమలుచేసిన సందర్భాలు చాలా అరుదుగా వుంటాయి. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆరు అంశాలను గ్యారంటీగా అమలు చేసి చూపిస్తామని చెప్పడం వినూత్నం, విభిన్నం, విశిష్టం. దీనికి ఎంతో ధైర్యం కావాలి, చిత్తశుద్ధి ఉండాలి. మేనిఫెస్టో నిర్మాణంలో ఈసారి ఎన్నో కసరత్తులు జరిగాయి. గత ప్రభుత్వ వైఫల్యాలను గమనంలో పెట్టుకుంటూ, మిగిలిన రాష్ట్రాలలోని అధికార పార్టీల మేనిఫెస్టోల్లోని ఆకర్షణీయమైన అంశాలను దృష్టిలో ఉంచుకుంటూ, తెలంగాణ ప్రజల అవసరాలను, ప్రాధాన్యాలను గుర్తెరుగుతూ, వివిధ వర్గాల, సంఘాల, సంస్థల, వ్యక్తుల అభిప్రాయాలను క్రోడీకరించుకుంటూ, సాధ్యాసాధ్యాలను బేరీజువేసుకుంటూ, హామీల అమలు పట్ల అత్యంత విశ్వాసాన్ని కలిగివుంటూ, తెలంగాణ సర్వతోముఖ అభివృద్ధిని సంకాంక్షిస్తూ, సమగ్రత, సమతుల్యతను పాటిస్తూ ఈ మేనిఫెస్టోను రూపకల్పన చేశామని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు విస్పష్టంగా వివరించారు. ఈ మేనిఫెస్టోను తెలంగాణ ప్రజకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రతి అంశాన్ని ఆచరణలో సాధిస్తూ సుపరిపాలన అందిస్తామని మాట యిచ్చారు.

ఆరు గ్యారెంటీలను 100రోజుల్లోనే అమలుకు శ్రీకారం చుడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన మరు క్షణాల్లోనే ప్రజానీకానికి ప్రకటించారు. అమలు ప్రక్రియ తొలిగా మహాలక్ష్మి పథకంతోనే ఆరంభమైంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకానికి అనూహ్యమైన స్పందన వస్తోంది. బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. మహాలక్ష్మి పథకం అమలుకు ముందు, మొత్తం ప్రయాణీకుల్లో మహిళలు 40 శాతం మంది ఉండేవారు. ఇప్పుడు అది 60 శాతానికి చేరినట్లు తెలుస్తోంది. ఈ ఒరవడి భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం వుంది.

రైతే రాజు అనే నినాదాన్ని ఆచరణ సాధ్యం చేసే తలంపుతోనే 'రైతు భరోసా పథకం' నిర్మాణమైనట్లు కనిపిస్తోంది. భూమి యజమానులకే కాక, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు మేలుచేసే విధంగానే ఈ పథకం వుంది. భూస్వాములకు, ధనవంతులకు ఎటువంటి రాయితీలు, భరోసాలు అవసరం లేదు. సన్నకారు, చిన్నకారు రైతులకు, పొలాలనన్నీ హలాల దున్ని స్వేదం చిందించే పేదరైతుకు అండగా నిలిచే పథకమే నిజమైన పథకం. వరి పంటకు క్వింటాలుకు 500 బోనస్ ప్రకటించడం ముదావహం. గిట్టుబాటు ధర పలికితేనే రైతు ఊపిరి పీల్చుకుంటాడు. ప్రతి ఏటా

అర్హులకు తెలంగాణ ప్రభుత్వం ఆ భరోసా కల్పిస్తానంటోంది. రైతు వారీకి ఇది పెద్ద ఊరట. విద్యుత్ అంశం ప్రతి రాష్ట్రానికి ఎప్పుడూ సవాలే. వ్యవసాయదారులకు, గ్రామీణులకు,పట్టణ, నగరవాసులకు విద్యుత్ అందించడంలో,ధరలు నిర్ణయించడంలో సమతుల్యత పాటించడం ఎంతో అవసరం. ఉచిత విద్యుత్ అందించడంలోనూ సమన్యాయం జరగాలి.

'గృహజ్యోతి' పథకం కింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్లు ఉచితంగా అందించడం సముచితం. 'ఇందిరమ్మ ఇళ్ళు' పథకం కొండంత ధైర్యాన్ని కలిగిస్తోంది. ఇల్లు లేనివారికి ఇంటి స్థలం మంజూరు చేయడంతో పాటు, 5 లక్షల రూపాయలు అందించడం గొప్ప కానుక. తెలంగాణ ఉద్యమంలో ఎందరో త్యాగధనులున్నారు. ధన, మాన, ప్రాణాలు పోగొట్టుకున్నవారు ఎందరో వున్నారు. జైళ్లల్లో మగ్గినవారు, చదువులు దెబ్బతిన్న వారు మరెందరో వున్నారు. ఆ ఉద్యమకారుల కుటుంబాలను గుర్తించి 250 చదరపు గజాల ఇంటి స్థలాన్ని కేటాయించడం ప్రశంసాపాత్రం. ఇదే త్యాగధనులకిచ్చే నిజమైన నివాళి. ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంలో విద్యార్థులు, యువత పాత్ర చాలా పెద్దది. గత ప్రభుత్వంపై కోపం, ఉద్యోగం,ఉపాధి దొరకలేదనే అసహనం, ఆక్రోశంతో నిన్నటి అధికార పార్టీకి వ్యతిరేకంగా నిలబడుతూ, కాంగ్రెస్‌ను గెలిపించుకున్నారు. ఈ ప్రభుత్వంలో ఉద్యోగాలు వస్తాయని, ఉపాధి లభిస్తుందనే విశ్వాసంతో వున్నారు.

'యువ వికాసం' పథకం వీరందరినీ కూడా విశేషంగా ఆకర్షించింది. విద్యార్థులకు 5లక్షల రూపాయల విద్యా భరోసా కార్డును ప్రకటించడం వినూత్నం. ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్‌ను స్థాపించాలనే ఆలోచన కూడా విశేషమైంది.విద్యలో వికాసం చెందడంతో పాటు ఉపాధి దొరికినప్పుడే, ప్రతిభకు పట్టం కట్టినప్పుడే యువలోకం హర్షిస్తుంది. నెల వారీ పించనుగా నాలుగు వేల రూపాయలు అందించడం, 10లక్షల రూపాయల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా కల్పించడం 'చేయూత' లోని ప్రత్యేకత.

మొత్తంగా ఈ ఆరు గ్యారెంటీల బృహత్ విధానాన్ని గమనిస్తే, మహిళలు, రైతులు, సగటు మనుషులు, పేదలు, తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలు, విద్యార్థులకు ఎంతో చేయూత అందుతోందని అర్థమవుతోంది. ఆరు గ్యారంటీల అమలు విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో ఉందని అర్థం చేసుకోవాలి. ఈ క్రమంలో, ఇప్పటికే అనేకమంది మేధావులను ముఖ్యమంత్రి సంప్రదిస్తున్నారు. ఇటీవల, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ రఘురామ రాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సి.ఎం మల్లు భట్టి విక్రమార్క సమావేశమైనట్లు తెలిసిందే.అనవసరమైన ఖర్చులను ఎలా తగ్గించాలి, పన్నుల ద్వారా ఆదాయాన్ని ఎలా పెంచుకోవాలి, సంక్షేమ పథకాలు – అభివృద్ధి మధ్య సమన్వయం ఎలా చేసుకోవాలి, సమతుల్యత ఎలా పాటించాలి, సమగ్ర ప్రగతి ఎలా సాధించాలి అనే అంశాల పట్ల చర్చ జరిగినట్లు సమాచారం. ఆరు గ్యారంటీల అమలు సంపూర్ణంగా, సమర్థవంతంగా, విజయవంతంగా ఎలా నిర్వహించాలి... అనే వాటిపై రఘు రామ రాజన్ నుంచి విలువైన సలహాలు,సూచనలు ప్రభుత్వానికి అందే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణ ఆర్థిక పరిస్థితిని సమగ్రంగా అధ్యయనం చేస్తూ, సమయోచిత సూచనలు ఇటువంటి వారి నుంచి తీసుకోవాలనే ఆలోచన ప్రభుత్వాధినేతలకు రావడం అభినందనీయం. రఘురామ రాజన్ వంటి మేధావుల అవసరం సమాజానికి ఎంతో వుంది. ఇటువంటివారిని సలహాదారులుగా నియమించుకోవడం అంతే అవసరం.కొత్త ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతుందని ఆకాంక్షిద్దాం.

# హైదరాబాద్‌లో ఎస్ ల్యాబ్

**ఐటీ శాఖా మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ప్రతినిధులు**



**హైదరాబాద్‌లో** రష్యాకు చెందిన ఫోరెన్సిక్ ల్యాబ్ ఎస్ ల్యాబ్ ఏర్పాటు కానున్నది. ఈ మేరకు సంస్థ సీఓఓ సీహెచ్ శ్రీనివాస్, ఇతర ప్రతినిధులు పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును కలిసి విన్నవించారు. డిజిటల్ ఫోరెన్సిక్, డేటా రికవరీలో పేరు గాంచిన ఈ కంపెనీ హైదరాబాద్‌లో ఏర్పాటు కానుండడంతో వారికి అన్ని విధాల అనుమతులు, ఇతర సౌకర్యాల విషయంలో సహకరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పేర తమ ల్యాబ్ స్థాపన జరుగుతుందని వారు తెలిపారు.




# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ళు

**మరో హామీ సాకారం దిశగా సిఎం అడుగులు**

**రాష్ట్రంలోని** అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, రెవిన్యూ, సమాచార, ప్రజాసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. దీనితో మరో హామీ నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది.

గ్రామాల్లోని అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ళు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆరు గ్యారంటీల అమలు సందర్భంగా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, అందులో ఇండ్లు లేని పేదలను గుర్తించాలని కోరారు. దీనిద్వారా ఇండ్లు కావాల్సిన వారి లెక్క తేలితే, దాని ప్రకారం కార్యాచరణ సిద్ధం చేయవచ్చని అన్నారు. తాము గృహనిర్మాణానికి నిధుల్లో ప్రాధాన్యత ఇస్తామన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో ఇది ఉపయోగపడుతుందన్నారు.

ముందుగా స్థలాలు ఉండి, ఇండ్లు కట్టుకునే వారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాంటి వారి సమాచారాన్ని సేకరించి, జాబితా సిద్ధం చేయాలన్నారు. అనంతరం స్థలాలు సేకరించి, స్థలాలు, ఇండ్లు ఇచ్చే విధంగా రెండవ విడత ప్రణాళిక రూపొందించాలన్నారు. దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ, దాని ప్రకారం నిధులు కూడా దశల వారీగా మంజూరూ చేస్తామని సీఎం అధికారులకు తెలియపరిచారు.



# పచ్చదనం పెంపు నిరంతర ప్రక్రియ

**రాష్ట్ర** వ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచే కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలని అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు. హరితహారంపై ఇప్పటిదాకా జరిగిన పురోగతి, రానున్న సీజన్ కోసం తీసుకోవాల్సిన చర్యలపై సచివాలయంలో మంత్రి సమీక్షించారు. అటవీ, గ్రామీణ అభివృద్ధి, మునిసిపల్, హెచ్ఎండిఏ, జిహెచ్ఎంసి, హార్టీ కల్చర్, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అటవీ రక్షణ, పచ్చదనం పెంపు నిరంతరాయ ప్రక్రియ అని మంత్రి కొండా సురేఖ తెలిపారు. లక్షిత 33 శాతం పచ్చదనం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మొక్కలు నాటడం, నర్సరీలు, అటవీ సంబంధిత కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంతవరకు తగ్గించాలని మంత్రి సూచించారు. ప్రజల ఇంటి అవసరాలకు ఉపయోగకరమైన, అలాగే కనీస ఆదాయాన్నిచ్చే మొక్కలు పెంచేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తెలంగాణ ప్రాంతానికి చెందినటు వంటి పూలు, పండ్ల జాతుల మొక్కల పంపిణీతో పాటు, వాటిని స్వచ్ఛందంగా పెంచేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

తమ ఆవరణలో చెట్లు నాటుకున్న వాళ్లకు కనీస ఆదాయం వచ్చేలా ప్రోత్సహించాలని తెలిపారు. అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. చింత, సీతాఫల్, ఉసిరి, జామ, నిమ్మ, సపోటా, మునగ, కరివేపాకు లాంటి మొక్కలను పంపిణీ చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. హరితహారం కార్యక్రమం పారదర్శకంగా పూర్తి జవాబుదారీతనంతో ఉండాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవన్నారు. గతంలో జరిగిన తప్పులను సవరించుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు నాటుతున్న మొక్కలు వాటి ఎదుగుదల, అలాగే చనిపోయిన మొక్కలను మార్చే విధానం అన్నీ కూడా వీలైనంత త్వరగా ఆన్ లైన్ లో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.



# అందరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు

**రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డును ఒక యూనిక్ నంబర్ తో అనుసంధానం చేయాలని సూచించారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో సరైన వైద్యం అందించే వీలుంటుందని అన్నారు. ఈ హెల్త్ ప్రొఫైల్ కార్డుతో ఆరోగ్యశ్రీ ని అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.**

**ఆరోగ్యశ్రీకి** తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి అనే నిబంధన సడలించే అంశాన్ని పరిశీలించాలని సీఎం అధికారులతో చర్చించారు. ఈ నిబంధన కారణంగా ఆరోగ్యశ్రీ కార్డు కోసం తెల్ల రేషన్ కార్డు తీసుకునే వారి సంఖ్య పెరుగుతోందని అన్నారు. మెడికల్ కాలేజీ ఉన్న ప్రతీ చోట నర్సింగ్, ఫీజియోథెరపీ, పారా మెడికల్ కాలేజీలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం కామన్ పాలసీని తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

సోమవారం సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సీఎం ప్రిన్సిపాల్ సెక్రటరీ శేషాద్రి, సీఎం జాయింట్ సెక్రటరీ సంగీత సత్యనారాయణ, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తు, కమీషనర్ కర్ణన్, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ కమలహాసన్ రెడ్డి, సీఈఓ ఆరోగ్యశ్రీ విశాలాచ్చి, తదితర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

వరంగల్, ఎల్బీ నగర్, సనత్ నగర్, అల్వాల్ లో టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. వైద్యుల కొరత లేకుండా మెడికల్ కాలేజీలను ఆసుపత్రులకు అనుసంధానంగా ఉండేలా చూడాలని అన్నారు. రాష్ట్రంలో మెడికల్, నర్సింగ్, పారా మెడికల్ కాలేజీల్లో ఇంకా ప్రారంభం కాని వాటి వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. కొడంగల్ లో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేసేందుకు పరిశీలన జరపాలని అధికారులకు సూచించారు.

బీబీనగర్ ఎయిమ్స్ లో పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు రావాలని సీఎం అన్నారు. ఎయిమ్స్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. దీంతో ఉస్మానియా, నిమ్స్ ఆస్పత్రులపై భారం తగ్గుతుందన్నారు. ఎయిమ్స్ ను సందర్శించి పూర్తిస్థాయి రిపోర్టు తయారు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఎయిమ్స్ లో పూర్తిస్థాయి వైద్య సేవల కోసం అవసరమైతే తానే స్వయంగా కేంద్రమంత్రిని కలిసి వివరిస్తానని సీఎం అన్నారు.



రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలు వైద్యం కోసం కేవలం హైదరాబాద్ పైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ఏరియాల వారీగా ఎక్కడికక్కడ వైద్య సదుపాయాలు కల్పించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలన్నారు. సంబంధిత మెడికల్ కాలేజీల్లో ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉస్మానియా ఆసుపత్రి విస్తరణలో సమస్యలను అధికారులు సీఎంకు వివరించారు. ఉస్మానియా హెరిటేజ్ భవనానికి సంబంధించి కోర్టులో ఉన్నందున, కోర్టు సూచనల ప్రకారం ఎలా ముందుకు వెళ్లాలో నిర్ణయం తీసుకుందామని సీఎం అన్నారు.

మెడికల్ కాలేజీలతో అనుసంధానంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో హౌస్ కీపింగ్ మెయింటెనెన్స్ నిర్వహణ బాధ్యతను పెద్ద ఫార్మా కంపెనీలు తమ సి ఎస్ ఆర్ నిధులను ఉపయోగించి హౌస్ కీపింగ్ సేవలను మెరుగుపరచాలని అన్నారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో ఏదో ఒక ఆసుపత్రిలో దీనిని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ అమలు తీరు, నిధులకు సంబంధించి సీఎం అధికారులతో చర్చించారు. ప్రతి నెల ప్రభుత్వ ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులు విధిగా విడుదల చేయాలని అన్నారు. ప్రయివేటు ఆసుపత్రుల ఆరోగ్యశ్రీ బిల్లులను ప్రతీ మూడు నెలలకోసారి విడుదల చేసేలా ఒప్పందం కుదుర్చుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలతో అనుసంధానంగా వున్న టీచింగ్ హాస్పిటల్స్, ప్రభుత్వ హాస్పిటల్స్ కు పెండింగ్ లో ఉన్న రూ. 270 కోట్ల ఆరోగ్య శ్రీ బిల్లులు వెంటనే విడుదల చేయాలని చెప్పారు. అలాగే జూనియర్ డాక్టర్స్, ఆశ వర్కర్స్, స్టాఫ్ నర్సుల జీతాలు ప్రతి నెల క్రమం తప్పకుండ అందించేలా చూడాలన్నారు. 108, 102 సేవల పనితీరును ముఖ్యమంత్రి అరా తీశారు, మెరుగైన సేవలు అందించేలా చూడాలని సీఎం ఆదేశించారు.



# పెట్టుబడులకు ప్రోత్సాహం

**పెట్టుబడులు పెట్టడానికి తెలంగాణ అనువైన రాష్ట్రమని, కాబట్టి తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని పలు బహుళజాతి కంపెనీలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. సౌదీ అరేబియా, జెడ్డాలో వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలలో పాల్గొన్నారు. తెలంగాణలో పరిశ్రమలను ఏర్పాటు చేసే సంస్థలకు కల్పించే రాయితీలు, ప్రోత్సాహకాల వంటి విషయాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణలో నిరంతర విద్యుత్తు సరఫరా, పుష్కలమైన నీటి లభ్యత, నాణ్యమైన మానవ వనరులు, మంచి మౌలిక సదుపాయాలు, మెరుగైన కనెక్టివిటీ ఉన్నాయని మంత్రి వారందరికీ వివరించి చెప్పారు.**

పెట్టబడులను పెట్టే ప్రయత్నంలో భాగంగా, మంత్రిని కలిసిన వారిలో సౌదీ యువరాజు కార్యాలయ జనరల్ డైరెక్టర్ మహమ్మద్ బిన్ అబ్దుల్లా అల్ రాయెస్ తో మంత్రి సమావేశమై తెలంగాణ విధానాలు, ఐటీ పరిశ్రమకు సహకారం అందించడం వంటి అంశాలపై వివరించారు. తెలంగాణలో సౌదీ కంపెనీలు పెట్టబడులు పెట్టేలా చొరవ చూపించాలని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత ఆరాంకో సంస్థ ప్రతినిధులను కలిసిన మంత్రి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే అంశాలపై చర్చలు జరుపగా, పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి ఆ సంస్థకు అన్ని రకాల సహకరిస్తామని హామీ ఇచ్చారు. రసాయనాలు, ఇంధన రంగాలకు సంబంధించి, అరాంకో కంపెనీ దిగ్గజ సంస్థగా అంతర్జాతీయంగా పేరుపొందింది. వీరితోపాటు ఆల్ షరీఫ్ గ్రూప్ హెూల్డింగ్స్ సంస్థ సీఈవో ఆల్ షరీఫ్ నవాబ్ బిన్ ఫైజ్ బిన్ అబ్దుల్ హకీమ్, ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ ప్రాజెక్ట్స్ ఇంజనీర్ సులైమన్‌కే తో పెట్టుబడుల అంశంపై సమావేశంలో చర్చించారు. ఈ సంస్థ విద్యుత్తు, హాస్పిటాలిటీ, రియల్ ఎస్టేట్, టెక్నాలజీ, ఆవిష్కరణ రంగాలలో అగ్రగామిగా ఉంది. కాగా, ప్రముఖ ఇన్వెస్ట్ మెంట్ కంపెనీ సెడ్కో కేపిటల్స్ ప్రతినిధులతో, జెడ్డా ఛాంబర్స్ తో, ఆహార ఉత్పత్తుల దిగ్గజ సంస్థ అయిన సవోలా గ్రూప్ సీఈవో వలీద్ ఫతానాతో, సౌదీ బ్రదర్స్ కమర్షియల్ కంపెనీ సీఈవో, బోర్డ్ సభ్యులతో, పెట్రోమిన్ కార్పోరేషన్ ప్రతినిధులతో, బట్టర్జీ హెూల్డింగ్ కంపెనీ చైర్మన్ మాజెన్ బెట్టర్జీతో మంత్రి శ్రీధర్ బాబు సమావేశమయ్యారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు ఆసక్తి కనబర్చాయి. అనేక సంస్థలు సానుకూలంగా స్పందించాయి. ఈ సమావేశంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జయేశ్ రంజన్, ఇన్వెస్ట్‌మెంట్, ప్రమోషన్ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి ఉన్నారు.

# కేంద్ర గ్రాంట్లు ఇప్పించండి..

## నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌కు సిఎం రేవంత్ విజ్ఞప్తి

**వెనుకబడిన జిల్లాల అభివృద్ధి గ్రాంటు కింద నాలుగేళ్లకు సంబంధించి తెలంగాణ రాష్ట్రానికి రూ.1800 కోట్లు రావాల్సి ఉందని, వాటిని ఇప్పించాలని సిఎం రేవంత్‌రెడ్డి నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్ సుమన్‌కుమార్ బేరి, సభ్యుడు విజయ్‌కుమార్ సారస్వత్‌కు విజ్ఞప్తి చేశారు. డీఎంఈవో డైరెక్టర్ జనరల్ సంజయ్ కుమార్, డైరెక్టర్ అవినాష్ దాస్, మరో ఐఏఎస్ అధికారి ముత్తుకుమార్‌తో కలిసి వీరిద్దరూ సచివాలయంలో సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.**



**ఆంధ్రప్రదేశ్** పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్ 94(2) కింద కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమ అమలుకు హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. 2019-20 నుంచి ఏడాదికి రూ.450 కోట్ల చొప్పున నాలుగేళ్ల నిధులు రావాల్సి ఉందని, వీటిని వెంటనే విడుదల చేయించాలని కోరారు. దీంతోపాటు రాష్ట్రానికి 14వ, 15వ ఆర్థిక సంఘాలు సిఫారసు చేసిన నిధులు కూడా రావాల్సి ఉందని, వీటి విడుదలకు కేంద్రంతో మధ్యవర్తిత్వం చేయాలని కోరారు. 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న 16వ ఆర్థిక సంఘం ద్వారా కూడా రాష్ట్రానికి ఎక్కువ మొత్తంలో నిధులు వచ్చేలా చూడాలన్నారు.

రాష్ట్రంలోని పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలు బలపడాలంటే 16వ ఆర్థిక సంఘం నిధుల విడుదల ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. రాష్ట్ర విద్య, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి కేంద్రం నుంచి నిధుల కేటాయింపు ఉండాలన్నారు. రాష్ట్రంలో సౌర విద్యుత్తును మరింత వినియోగించుకోవడానికి కేంద్రం సహకారం అందించాలని, సౌర విద్యుత్తు సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్రం ఇచ్చే రాయితీలు, సబ్సిడీలను రాష్ట్రానికి వర్తింపజేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో హైదరాబాద్‌ను కాలుష్య రహిత 'అర్బన్ గ్రోత్ హబ్'గా అభివృద్ధి చేయడానికి ప్రణాళికను సూచించాలని నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్, సభ్యులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు.

నీతి ఆయోగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సహకారం అందిస్తుందని, గవర్నింగ్ కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొంటుందని, నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అవసరమైన విధాన రూపకల్పన, సహకారాత్మక వ్యూహాలు, ప్రణాళికపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ పలు అంశాలను నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం నుంచి న్యాయబద్ధంగా, విభజన చట్టం ప్రకారం రావాల్సిన నిధులను విడుదల చేయించాలని కోరారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అనుసరించాల్సిన సహకారాత్మక సమాఖ్య విధానంపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి, అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి నీతి ఆయోగ్, రాష్ట్ర ప్రభుత్వం కలిసికట్టుగా పని చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమ్యాలు, కీలక రంగాల అభివృద్ధి, ఇందుకు అనుసరించాల్సిన మార్గాలను ముఖ్యమంత్రి వివరించారు.

స్థానిక సమస్యలను పరిష్కరించుకోవడంలో మెరుగైన పద్ధతులను అవలంభించాలని నీతి ఆయోగ్ సూచించింది. యువతలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సిఎం వివరించారు. ముఖ్యంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్సెస్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి సాంకేతిక సహకారం అందించాలని సిఎం నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. సబర్మతి రివర్ ఫ్రంట్, నమామీ గంగే వంటి జాతీయ, అంతర్జాతీయ పీపీపీ మోడల్స్‌ను వర్తింపజేయాలన్నారు. మూసీనది కోసం సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల (ఎస్‌టీపీ) ఏర్పాటుకు సహకరించాలన్నారు. ప్రజా సంక్షేమం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారాత్మక సమాఖ్య స్ఫూర్తితో పని చేయాలని నిర్ణయించారు. కాగా, నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశాల్లో భాగం పంచుకోవాలని రాష్ట్రాన్ని నీతి ఆయోగ్ కోరగా.. తప్పకుండా పాల్గొంటామని, నీతి ఆయోగ్‌కు నిర్మాణాత్మక మద్దతు, సహకారాన్ని అందిస్తామని సిఎం రేవంత్ తెలిపారు.

# హైదరాబాద్‌కా నిషాన్ నుమాయిష్



'హైదరాబాద్ కా నిషాన్ నుమాయిష్' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ అంటే చార్మినార్.. ట్యాంక్ బండ్ తరువాత గుర్తొచ్చేది నుమాయిష్ అని పేర్కొన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 83వ నుమాయిష్‌ను ప్రారంభించిన తర్వాత సిఎం సభనుద్దేశించి ప్రసంగించారు. ప్రతీ ఏటా నుమాయిష్ ప్రాధాన్యత తగ్గకుండా నిర్వహిస్తున్న సొసైటీని సిఎం ఈ సందర్భంగా అభినందించారు. సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీని ఇంజనీరింగ్ కాలేజీగా అప్ గ్రేడ్ చేయడానికి ప్రభుత్వం తరపు నుంచి పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. సామాజిక బాధ్యతతో విద్యా సంస్థలను నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీకి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌కు గుర్తింపు తెచ్చేందుకు నుమాయిష్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.











# క్రీడాకారులకు ప్రోత్సాహం

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన మరుసటి రోజే పలు అంశాలపై దృష్టి సారించి, సంబంధిత అధికారులతో చర్చించి, తగు సూచనలు, ఆదేశాలను జారీ చేయడం జరిగింది.**

**మన** రాష్ట్రానికి చెందిన అర్జున అవార్డు గ్రహీతలు, ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన విజేతలు సచివాలయంలో సిఎం ఎ. రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. ముఖ్యమంత్రి ప్రతి క్రీడాకారుడిని పలకరించి వారి విజయాలు, భవిష్యత్తు టోర్నీల గురించి అడిగి తెలుసుకున్నారు. విజేతలందరినీ సిఎం శాలువాలతో సత్కరించి, వారి విజయాలకు గుర్తుగా పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

ప్రతి క్రీడాకారుడు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని, జాబితాను రూపొందించాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణలో క్రీడల అభివృద్ధికి తమ ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందని అన్నారు. అర్హతలకు అనుగుణంగా ఆర్థిక సాయం, ఉద్యోగావకాశాలు కల్పించి క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉన్నదని సిఎం అన్నారు. హుసాముద్దీన్ (బాక్సింగ్ మరియు కామన్వెల్త్ గేమ్స్ కాంస్య పతక విజేత), ఈషా సింగ్ (షూటింగ్, ఆసియా క్రీడలు 2023 బంగారు పతక విజేత), ఆసియా క్రీడలు 2023లో పాల్గొన్న నిఖత్ జరీన్ (బాక్సింగ్‌లో కాంస్య పతకం), కినాన్ చెనై డారియస్ (షూటింగ్‌లో బంగారు పతక విజేత), అగసర నందిని (అథ్లెటిక్స్‌లో కాంస్య పతక విజేత), ఎన్. సిక్కి రెడ్డి (బ్యాడ్మింటన్ పార్టిసిపెంట్) పి. గాయత్రి గోపీచంద్ (బ్యాడ్మింటన్ పార్టిసిపెంట్). పారా అథ్లెట్, పారా గేమ్స్‌లో గోల్డ్ మెడలిస్ట్ అయిన జీవన్‌జీ దీప్తి ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా విజేతలందరూ తమ పతకాలను, అవార్డులను సగర్వంగా ముఖ్యమంత్రికి చూపించారు. ముఖ్యమంత్రి అందించిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు.

## వికారాబాద్‌లో రాడార్ స్టేషన్

భారత నావికాదళం తెలంగాణను కీలక స్థావరంగా ఎంచుకుంది. దేశంలోనే రెండో వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ స్టేషన్ ను వికారాబాద్ జిల్లాలో నెలకొల్పుతోంది. నౌకలు, జలాంతర్గాములతో సంభాషించేందుకు నావికాదళం,





వీఎల్ఎఫ్ (వెరీ లో ఫ్రీక్వెన్సీ) కమ్యూనికేషన్ ట్రాన్స్ మిషన్ స్టేషన్‌ను ఉపయోగిస్తుంది. వికారాబాద్ మండలం పూడూరు సమీపంలోని దామగూడెం అటవీ ప్రాంతంలో ఈ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నది. దేశంలోనే ఇది రెండో స్టేషన్. తమిళనాడులోని తిరునల్వేలిలో ఉన్న ఐఎన్ఎస్ కట్టబొమ్మన్ రాడార్ స్టేషన్ మొట్ట మొదటిది. 1990 నుంచి అది నావికాదళానికి సేవలందిస్తోంది. రెండో రాడార్ స్టేషన్ ఏర్పాటుకు తెలంగాణ అనువైన ప్రాంతంగా విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండెంట్ గుర్తించింది.

2010 నుంచి నావికాదళం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. పర్యావరణ అనుమతులు, క్లియరెన్స్‌లన్నీ వచ్చినప్పటికీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా భూముల కేటాయింపు ముందుకు సాగలేదు. సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులన్నీ తొలిగిపోయాయి. వికారాబాద్ డీఎఫ్ వో, నావల్ కమాండ్ ఏజెన్సీ అధికారులు అటవీ భూముల బదిలీ ఒప్పందంపై సంతకాలు చేశారు. దామగూడెం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న 1174 హెక్టార్ల అటవీ భూమిని నేవీకి అప్పగించారు.

## మూసీ నది పొడవునా పర్యాటకం

లండన్‌లోని థేమ్స్ రివర్ ప్రాజెక్టు తరహాలో హైదరాబాద్‌లో మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బ్రిటిష్ హై కమిషనర్ అలెక్స్ ఎల్లిస్ తో తన ఆలోచనలను పంచుకున్నారు. ఇటీవల లండన్ పర్యటనలో అక్కడ థేమ్స్ నది నిర్వహిస్తున్న తీరు, రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అభివృద్ధి చేసిన తీరును ప్రత్యేకంగా అధ్యయనం చేసినట్లు చెప్పారు. అదే మోడల్‌లో హైదరాబాద్‌లో మూసీనది పునరుజ్జీవింపజేసేందుకు చేస్తున్న ప్రణాళికలను, ప్రాజెక్టుకు సంబంధించిన అవుట్ లైన్, థేమ్స్ నది తరహాలో అభివృద్ధి, తదితర అంశాలను ఆయనతో చర్చించారు.

## మెహదీపట్నంలో స్కై వాక్‌కు తొలగిన అడ్డంకి

హైదరాబాద్ నగరంలోని మెహదీపట్నంలో స్కై వాక్ నిర్మాణానికి లైన్ క్లియర్ అయింది. త్వరలోనే స్కై వే నిర్మించనున్నట్లు హెచ్ఎండిఏ ప్రకటించింది. పెరిగిన ట్రాఫిక్ రద్దీ కారణంగా రోడ్లపై నడిచి వెళ్లే వారి భద్రత దృష్ట్యా ఇక్కడ స్కై వే నిర్మించాలనే ప్రతిపాదనలు ఎప్పటినుంచే ఉన్నాయి. రైతు బజార్ ప్రాంతంలో ఉన్న తమ భూములను ఇచ్చేందుకు కేంద్ర రక్షణ శాఖ గతంలో అంగీకరించకపోవటంతో పీటముడి పడిం ది. రక్షణ శాఖ పరిధిలోని 0.51 ఎకరాల స్థలం తమకు బదిలీ చేయాలని గత ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవటంతో స్కై వాక్ పనులు నిలిచిపోయాయి. దీంతో అత్యంత రద్దీ ఉండే మెహదీపట్నం రైతు బజార్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరిగిపోయింది.

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే సిటీలో ట్రాఫిక్ రద్దీని అధిగమించే చర్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. జనవరి 5వ తేదీన ఢిల్లీకి వెళ్లినప్పుడు ప్రత్యేకంగా రక్షణ శాఖ మంత్రిని కలిశారు. అక్కడున్న రక్షణ శాఖ భూములను తమకు బదిలీ చేయాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రి వివరించటంతో రక్షణ మంత్రి సానుకూలంగా స్పందించారు. అక్కడున్న ఢిఫెన్స్ జోన్ కు ఇబ్బంది లేకుండా కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్పులకు అనుగుణంగా స్కై వే డిజైన్‌లో సిఎం పలు మార్పులు చేయించారు. సవరించిన కొత్త ప్రతిపాదనలను ఇటీవలే కేంద్రానికి పంపించారు.

స్కై వే నిర్మాణానికి అవసరమైన మేరకు భూమి కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మొత్తం 3380 చదరపు గజాల స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించనున్నది. బదిలీ చేసిన భూములకు బదులుగా కేంద్రం ఢిఫెన్స్ విభాగానికి రూ. 15.15 కోట్ల విలువైన మౌలిక వసతులు కల్పించాల్సి వుంటుంది. మరి కొంత స్థలానికి పదేండ్ల పాటు లైసెన్స్ రుసుం చెల్లించాలనే నిబంధన విధించింది. నాలుగు వారాల్లోనే ఈ భూములను అప్పగించేందుకు కేంద్ర రక్షణ శాఖ అంగీకరించింది. దీంతో మెహదీపట్నం స్కై వాక్ పనులకున్న ప్రధాన అడ్డంకి తొలిగిపోయింది.






# గిరిజన విద్యా సంస్థల్లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

**2024 మార్చ్‌లో జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని పంచాయితీరాజ్, స్త్రీ సంక్షేమ శాఖల, మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గిరిజన గురుకులాల ప్రిన్సిపల్స్, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమాధికారులతో 'బంజారా భవన్', హైదరాబాద్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె ప్రసంగించారు.**

**తాను** కూడా గిరిజన వసతి గృహంలో ఉండి చదువుకున్నానని, ఈ సమావేశంలో తన గురువులు కూడా ఉన్నారని ఆమె అన్నారు. కేవలం పరీక్షా ఫలితాల కోసం కాకుండా గిరిజన విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రిన్సిపాళ్ళు, ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమాధికారులు కృషి చేయాలని ఆమె అన్నారు. కేవలం పాఠ్యాంశాల బోధనే కాకుండా విద్యార్థులకు తమ చుట్టూ వుండే జనరల్ నాలెడ్జి విషయాలను కుడా బోధించాలన్నారు. వీటితో పాటు నైపుణ్య శిక్షణ, కమ్యునికేషన్ స్కిల్స్ కూడా పాఠ్యాంశాలలో భాగం కావాలని సూచించారు. ముఖ్యంగా అధికారులందరూ గిరిజనుల జీవన నేపథ్యం, వారు ఎదుర్కొనే సమస్యల అవగాహనతో, క్షేత్ర స్థాయిలో పని చేస్తే, గిరిజనుల సంక్షేమం ప్రభుత్వం ఆశించిన మేరకు సాధించడం సాధ్యం అని అన్నారు.

భారత రాజ్యాంగం పుస్తకాన్ని ప్రతి గిరిజన విద్యా సంస్థలో ఉంచాలని, విద్యార్థులకు దీనిపై పూర్తిగా అవగాహన రావాలి, అలాగే దానిపై క్విజ్ పోటీలను నిర్వహించి విద్యార్థులు చురుకుగా పాల్గొనేలా చూడాలని మంత్రి సీతక్క అన్నారు. పదవ తరగతిలో వంద శాతం ఫలితాలు సాధిస్తామని, అధికారులు, ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు మంత్రి సమక్షంలో ప్రతిజ్ఞ చేశారు.

అనంతరం గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల్లో చదువుతోన్న 1320 మంది విద్యార్థులకు పౌష్టిక ఆహారంలో భాగంగా గిరిజన కార్పోరేషన్ తయారు చేసిన తేనె ప్రతి రోజు 50 గ్రాములు ఉచితంగా ఇచ్చే పథకాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు.

గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి ఎ. శరత్ మాట్లాడుతూ ఈ రోజు నుండి ప్రతి గిరిజన విద్యా సంస్థలో 10 నియమాలను అమలు చేసి, పదవ తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులను వారి సామర్థ్యాల ఆధారంగా గ్రేడ్‌లుగా, గ్రూప్‌లుగా, విభజించాలనీ, ప్రతీ గ్రూపులో అన్ని

గ్రేడ్‌ల విద్యార్థులు ఉండేలా చూడాలనీ, ప్రతీ గ్రూప్‌ను ఒక్కొక్క టీచర్‌కు దత్తత ఇవ్వాలనీ, పాఠశాల పనివేళలకు ముందు, తరువాత ప్రత్యేక తరగతులు నిర్వహించాలనీ, విద్యార్థుల సామర్థ్యాల వారీగా వివిధ స్టడీ మెటీరియళ్ళను తయారుచేసి ఇవ్వాలనీ, పదవ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం టీ, స్నాక్స్ పండ్లు వంటి స్పెషల్ డైట్ ఇవ్వాలనీ, విద్యార్థులు గ్రూప్‌లుగా చదువుకొనేలా చూడాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు తన సిబ్బందితో ఒక టీమ్ వర్క్ లాగా పనిచేయాలనీ, హెడ్ ఆఫీసు నుండి తనిఖీ అధికారులు వచ్చి తగు సూచనలు, సలహాలు ఇస్తారని, 100శాతం ఫలితాలు సాధించిన గిరిజన విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులకు, టీచర్లకు ప్రోత్సాహకంగా సన్మానాలు వుంటాయని, మెరుగైన ఫలితాలు తీసుకురాని వారికి శిక్షలు కూడా వుంటాయని గిరిజన సంక్షేమ కార్యదర్శి ఎ.శరత్ అన్నారు.

గిరిజన సంక్షేమ సెక్రటరీ మాట్లాడుతూ మెనూ చార్ట్‌ను అందరికీ కనబడేలా డైనింగ్ హాలు, ఇతర చోట పెయింట్ చేయించాలనీ, దానిపై ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ నంబర్‌తో పాటు గిరిజన సంక్షేమ కార్యదర్శి, డైరెక్టర్ సెల్ నంబర్లను రాయించాలన్నారు. వంట సరుకులు అన్నీ బాగున్నా, ఆహారం రుచిగా కావడం లేదంటే, అది ఆహారం వండే వారికి అవగాహన లోపం వల్లేనని, అందుకే కిచెన్ స్టాఫ్ అందరికీ శిక్షణ ఇప్పించాలన్నారు. ఆవరణ అంతా పచ్చదనం, పండ్ల చెట్ల తో వుండాలని, అందుకోసం సిబ్బంది ప్రతి ఒక్కరు, ఒక పండ్ల చెట్టు నాటి దానిని సంరక్షించాలన్నారు.

గిరిజన సంక్షేమ డైరెక్టర్ ఇ.వి. నరసింహ్మా రెడ్డి మాట్లాడుతూ ఇంతకు ముందు ఇచ్చిన వంద రోజుల ప్రణాళికకు ఈ 10 నియమాలను అదనంగా చేర్చుకొని వారం రోజుల్లోగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమం లో గిరిజన గురుకుల సొసైటీ కార్యదర్శి నవీన్ నికోలస్, అడిషనల్ డైరెక్టర్ వి. సర్వేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ శంకర్, జి యం. ట్రైకార్ శంకర్ రావ్, జాయింట్ డైరెక్టర్‌లు కళ్యాణ్ రెడ్డి, సముజ్వల, డిప్యూటీ డైరెక్టర్‌లు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారులు, సహాయ గిరిజన అభివృద్ధి అధికారులు, గురుకులాల ప్రిన్సిపాళ్ళు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, ఎ.సి.యం.ఓ.లు, జి.సి.డి.ఓలు, జిసిసి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.




# ‘ప్రజావాణి’తో కానిస్టేబుల్ భార్యకు ఉద్యోగం

**‘మనసుంటే** మార్గం ఉంటుంది’ ఆదుకునే హృదయం ఉంటే నిబంధనలు అడ్డుకాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరూపించారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ భార్య సత్యలతకు నిబంధనలను సడలించి మరీ ఉద్యోగం ఇప్పించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. గత ప్రభుత్వం ఈమెకు నిబంధనలు అనుకూలించవని ఉద్యోగం ఇవ్వడానికి నిరాకరించింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి, ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన తరువాత మొట్టమొదటి ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన కానిస్టేబుల్ భార్య సత్యలత సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి తన గోడు విన్నవించుకుంది. ఆమె పరిస్థితి చూసి చలించిపోయిన సిఎం వెంటనే ఆమెకు పోలీస్‌శాఖలో ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆదేశించారు.

రాష్ట్ర రాజధాని నగరం హైదరాబాద్‌లోని అంబర్‌పేట పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో సొంగా శేఖర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండేవాడు. 2021, సెప్టెంబరు 30న శేఖర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని భార్య సత్యలత తనకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని పోలీసు ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించింది. అయితే రాచకొండ పోలీసులు ఆమె ఆంధ్రాకు చెందిన మహిళ అని, స్థానికత లేదనే కారణంతో నియామకాన్ని నిరాకరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆమె మొదటి ‘ప్రజావాణి’ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తన పరిస్థితిని విన్నవించింది. దీనితో స్పందించిన ముఖ్యమంత్రి మానవతా దృక్పథంతో ఆమెకు నిబంధనలు సడలించి ఉద్యోగం ఇవ్వాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆమేరకు సత్యలతను రాచకొండ పోలీసు కమిషనర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ కమిషనర్ సుధీర్‌బాబు అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చారు.



# సంపదను పెంచుతాం...ప్రజలకు పంచుతాం

**ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉన్నామని, మాట ప్రకారం అమలుచేస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఎర్రుపాలెం మండలం, బనిగండ్లపాడు గ్రామంలోని ప్రభుత్వ కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కౌంటర్లలో దరఖాస్తుల స్వీకరణ, ఏ ఏ పథకాల గురించి దరఖాస్తు చేస్తున్నది, దరఖాస్తుల స్వీకరణ లో ప్రభుత్వ యంత్రాంగం చర్యలను పరిశీలించారు.**

**- ఎం.ఏ గౌస్**

**అనంతరం** భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెస్తామని, ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని, సంపద సృష్టిస్తాం, సృష్టించిన సంపద ప్రజలకు పంచుతామని ఆయన తెలిపారు. అసెంబ్లీలో శాసనసభ్యులు ప్రమాణ స్వీకారం చేసిన గంటలోపే అదే ప్రాంగణంలో మహాలక్ష్మి పథకం ప్రారంభించి, తెలంగాణ సమాజంలో సగభాగం ఉన్న మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామన్నారు. అదేవిధంగా పేదలకు మెరుగైన వైద్యం అందాలని రాజీవ్ ఆరోగ్యశ్రీ సాయాన్ని 10 లక్షల రూపాయలకు పెంచామని ఆయన తెలిపారు. ఆరు గ్యారంటీల అమలుకు కావలసిన బడ్జెట్ ప్రిపరేషన్ కోసమే ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు.

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఇండ్ల స్థలాలు పంచిందని, ఇందిరమ్మ ఇల్లు కట్టించామని ఆయన అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఐదు లక్షలు సాయం చేస్తుందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అధిగమిస్తామని, సంపద సృష్టిస్తామని, ప్రజలకు పంచుతామని ఇది ప్రభుత్వ మాట, ఇదే ప్రభుత్వ ఆచరణ అని ఆయన తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల గురించి ప్రజలకు వాస్తవాలు తెలియాలని అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల చేసి ఆర్థిక పరిస్థితులను చెప్పామని ఆయన అన్నారు. ఈ సంవత్సరపు చివరి త్రైమాసిక నిధులను కూడా ఎన్నికలకు ముందే డ్రా చేసి గత ప్రభుత్వం ఖర్చు పెట్టిందని ఆయన అన్నారు.

తెలంగాణ యువత కన్నటువంటి కలలను, ఆశలను నిజం చేస్తామని, స్కిల్ డెవలప్మెంట్ విద్యా వ్యవస్థను అభివృద్ధి చేస్తామని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆయన తెలిపారు. 2014 సంవత్సరానికి ముందు ఉన్న ప్రభుత్వాలు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని, విద్యుత్తు ప్లాంట్లను నిర్మాణం చేయడంతో అవి ప్రొడక్షన్ లోకి వచ్చి గత పది సంవత్సరాలుగా తెలంగాణలో కరెంటు కోతలు లేవన్నారు. దామరచర్లలో నిర్మాణం చేస్తున్న యాదాద్రి పవర్ ప్లాంట్ ఇప్పటికీ ప్రారంభం కాలేదని, విద్యుత్తు రంగంపై 1.10 లక్షల కోట్ల రూపాయల అప్పుల భారం గత ప్రభుత్వ మోపినప్పటికీ ఆ ఇబ్బందులను అధిగమిస్తూ రాష్ట్ర ప్రజలకు 24 గంటల పాటు నాణ్యమైన కరెంటు ఇస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ విద్యుత్తు ఉత్పత్తిపై అధ్యయనం చేపట్టామన్నారు. ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు గ్రామంలో శిథిలావస్థకు చేరిన కళాశాల నిర్మాణానికి, గ్రామంలో రెండు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం కోసం నిధులను మంజూరు చేస్తామన్నారు. గ్రామంలో ఉన్న పీహెచ్‌సీ ఆసుపత్రిని మోడల్ ఆసుపత్రిగా తీర్చిదిద్దడానికి కావలసిన సౌకర్యాలు, సిబ్బందిని నియమిస్తామన్నారు.

Printed and Published by **K.Ashok Reddy IAS,** at Ground Floor, Samachar Bhawan, A.C. Guards, Hyderabad-28, on behalf of Spl. Commissioner, I & PR, Telangana State. Printed at M/s. Karshak Art Printers, APHB - 40, Vidyangar, O.U. Road, Hyderabad - 44. Chief Editor: **K.Subrahmanya Sastry**, Ph: 040-23326064.




‘తెలంగాణ మాసపత్రిక’ జనవరి సంచికను సచివాలయంలో
ఆవిష్కరించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికారులు

RNI No. TelTel/2015/61759
Postal Regd. No. D/RNP/HCD-1217/2024-26

Date of Publishing every month 4th
Posting Date: every month 6th & 7th




From:
**The Commissioner**,
Information & Public Relations Department,
10-2-1, Samachar Bhavan, A.C. Guards,
Masabtank, Hyderabad - 500 028.

PRINTED MATTER

To